అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

గురువారం 15-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 48 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 16 + 16 పేజీలు వెల : 5.00





# ఉపాధి ఉత్తిదే

## పీఎంఈజీపీకి 4 లక్షల దరఖాస్తులు..50 వేలమందికే రుణాలు



ప్రతి ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలు కల్పిస్తాం.
- 2014 ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి మోడీ



2018-19 బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ పొగ్రాం (పీఎంఈజీపీ) కింద 7.5లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.
-ఫిబ్రవరి 1,2018 పార్లమెంటులో జైట్లీ

ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలిస్తామని మోడీ చెప్పిన మాటలు ఆచరణలో మాత్రం నిరుద్యోగాన్ని పెంచిందని అధ్యయనాలు తెలుపుతున్నాయి.సాక్షాత్తు అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) నివేదిక వెల్లడించటం చర్చనీయాంశమైంది.నాలుగేండ్లలో ఉపాధిఅవకాశాలు పెరగకపోగా..2017లో ఉన్న ఉద్యోగాలు కోల్పోవటం సర్వత్రా ఆందోళనకలిగిస్తున్నది.2016లో కల్పించిన ఉద్యోగాలు గత పదేండ్లలో ఎన్నడూలేనంత తక్కువగా ఉన్నాయన్న వాస్తవాలు వెలుగుచూశాయి. 2017లో ఉద్యోగాల కల్పన మైనస్‌లో వెళ్లటం తీవ్రమైన విషయంగా పరిశీలకులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వయం ఉపాధి కల్పిస్తామంటూ మోడీ సర్కారు ఇచ్చిన హామీ కూడా నిరుద్యోగ యువతను నిరుత్సాహపరుస్తున్నది.

- నిరుద్యోగ సమస్యకు నిరాదరణే
- మోడీ సర్కార్‌లో రోజ్‌గార్ తీరిది..


ఫైల్

నవతెలంగాణ జనరల్ డెస్క్

గత 8 ఏండ్లలో ఎన్నడూలేనంతగా మోడీ పాలనలో నిరుద్యోగం తాండవం చేస్తున్నదని వివరించింది. ఇలాంటి పరిస్థితుల్లో స్వయం ఉపాధికి మోడీ సర్కారు ఇచ్చిన రుణాలు అంతంతేనని స్పష్టమవుతున్నది. అటు ఉద్యోగాలు కల్పనలేక.. ఇటు స్వయం ఉపాధిలేని నిరుద్యోగ యువత భవిష్యత్ ఏంటని సమాజం ప్రశ్నిస్తున్నది.

**నాలుగు లక్షలకుపైనే యువత దరఖాస్తు చేసుకుంటే..**

2017లో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పీఎంఈజీపీ కింద నాలుగులక్షలకుపైనే యువత ఉపాధికోసం దరఖాస్తు చేసుకుంటే... అందులో కేవలం 50 వేల మందికి మాత్రమే రుణాలిచ్చారు. దీని ప్రకారం కేవలం 12 శాతం మాత్రమే రుణాలిచ్చినట్టు రికార్టులు ధ్రువీకరిస్తున్నాయి. మిగతా 88 శాతం నిరుద్యోగులు పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించారు.

**పీఎంఈజీపీ పథకం తీరు తెన్నులెంటీ.?**

పీఎంఈజీపీ ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన అంటారు. ఈ పథకం 2008-09లో ప్రారంభమైంది. స్వయం ఉపాధికల్పించే విధంగా అమల్లోకి తెచ్చింది. 18 ఏండ్లకు పైబడిన నిరుద్యోగులు ఉపాధి కల్పించుకునేలా.. రూ. ఐదు లక్షల నుంచి 10లో

# మా లెక్క తేల్చండి..



## కేంద్రంతో అమీతుమీకి కేసీఆర్ సిద్ధం!

- విభజన హామీలు, నిధులపై నేడు జైట్లీతో భేటీ
- ఢిల్లీలో ఆర్థికశాఖ అధికారులతో సుదీర్ఘ మంతనాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

విభజన చట్టంలో తెలంగాణకు పొందుపరిచిన హామీల అమలుతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్రంతో అమీతుమీ తేల్చుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమైనట్టు తెలుస్తోంది. నాలుగు సంవత్సరాలుగా తెలంగాణ కు కేంద్రం ఇచ్చిన నిధులు, పెండింగ్‌లో ఉన్న నిధుల గణంకాలను సిద్ధం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ఢిల్లీలోని తన నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. నిధులపై కూలంకషంగా చర్చించారు. కేసీఆర్ సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి నేడు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీతో జరగనున్న భేటీలో ఆయన ముందుంచనున్నారని తెలిసింది. జైట్లీతో జరగనున్న ఈ భేటీకి హాజరుకావాల్సిందిగా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి కూడా కేసీఆర్ ఆదేశించినట్టు సమాచారం. గురువారం ఉదయం ఎస్‌కే జోషి ఢిల్లీరానున్నారని తెలిసింది.

ఫిబ్రవరి 9న ఢిల్లీకి వచ్చిన కేసీఆర్.... ఈ పర్యటనలో ప్రధానమంత్రి, కేంద్రమంత్రులను కలుస్తారని మొదట వార్తలు వచ్చాయి. అయితే శుక్రవారం నుంచి ఢిల్లీలోని తన నివాసం తుగ్లక్‌రోడ్డు-23కే పరిమితమయ్యారు. అయితే బుధవారం మాత్రం ఆర్థికశాఖ అధికారులను హస్తినకు పిలిపించుకున్నారని తెలిసింది. ప్రధానంగా నాలుగేండ్ల కాలంలో తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చిన నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లించిన మొత్తానికి సంబంధించిన నిధుల లెక్క తీశారు. అలాగే మిషన్‌కాకతీయకు, భగీరథకు ఆర్థిక సాయంగా నిధులు ఇవ్వాలని నిటి ఆయోగ్ ప్రతిపాదించినప్పటికీ.. ఇవ్వకపోవడం లో గల ఆంతర్యమేంటో ఏమిటో కేంద్రమంత్రిని ప్రశ్నించను న్నట్టు తెలిసింది. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. వెయ్యికోట్లు, ఎయిమ్స్‌కు నిధులు, విభజన చట్టంలో పొందు పరిచిన ప్రత్యేక హైకోర్టు తదితర అంశాలన్నింటిపై ప్రశ్నించనున్నారని సమాచారం. ముఖ్యమంత్రి శుక్రవారం హైదరాబాద్ తిరుగుపయనమవుతారని తెలిసింది.

# పొత్తు ప్రసక్తే లేదు..

## టీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలే..

### సీపీఐ (ఎం) పునరుద్ఘాటన

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం.. అయినా పట్టించుకోని కేసీఆర్
- మోడీని పల్లెత్తు మాట అనని సీఎం: తమ్మినేని
- తక్షణం అఖిలపక్షాన్ని నిర్వహించాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ ఒకేతాను ముక్కలని సీపీఐ (ఎం) విమర్శించింది. అందువల్ల వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించింది. ఇటీవల నల్లగొండ లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలో కూడా ఇందుక నుగుణంగా తీర్మానించి, ఆమోదించామని గుర్తు చేసింది. వీటన్నింటినీ విస్మరించి.. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయబోయే మహా 10లో

# తప్పకాలే కాదు.. పునరావాసమూ ముఖ్యమే

## అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో గవర్నర్ నరసింహన్

- మార్గదర్శకాలు పాటించాలి:కేంద్ర మంత్రి తోమర్
- ఆర్థిక వ్యవస్థకు ఊతం: కేటీఆర్

వివరాలు 10లో


మినరల్స్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రి తోమర్, మంత్రి కేటీఆర్

# ఇద్దరు రైతుల ఆత్మహత్య

నవతెలంగాణ-దోమ/ఇచ్చోడ రూరల్


నర్సింలు

వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో అప్పుల బాధతో ఇద్దరు రైతులు బుధవారం ఉరేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రానికి చెందిన ఈడిగ నర్సింలు (56) తన మూడెకరాలలో సాగు కోసం మూడు బోర్లను తవ్వించాడు. ఒక్క బోరులోనూ నీరు పడలేదు. మరోవైపు ఈసారి వేసిన పంటంతా ఎండిపోయింది. సాగుకు, బోర్ల కోసం చేసిన అప్పు రూ.4లక్షలకు చేరుకుంది. అప్పులు ఎలా తీర్చాలో నని మనో వేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి పొలం దగ్గరకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన నర్సింలు తిరిగి రాలేదు. ఆందోళన చెందిన పెద్ద కుమారుడు పొలం దగ్గరకు వెళ్లి చూడగా నర్సింలు చెట్టుకు ఉరేసుకుని కనిపిం చాడు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన రైతు రాపణి రాములు (50) వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ముగ్గురు కుమారులున్నారు. చిన్న కుమారుడిని దుబాయి పంపిం చడానికి ఆరు నెలల కింద రూ.రెండు లక్షల అప్పు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని మనస్తా పానికి గురై బుధవారం పశువుల కొట్టంలో ఉరేసు కున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎల్.రాజు తెలిపారు.

# ఉపాధ్యాయుని అసభ్య ప్రవర్తన

- నల్లగొండ జిల్లా చిట్యాలలో కేసు నమోదు

నవతెలంగాణ-చిట్యాల

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... ఏపూరు 10లో

# భజవీరంగ్ దళ్

- 'వాలెంటైన్స్ డే'ను వ్యతిరేకిస్తూ దౌర్జన్యాలు
- పలు చోట్ల ప్రేమ జంటలకు వేధింపులు
- పోలీసుల హెచ్చరికలనూ లెక్క చేయని వైనం

వివరాలు 3లో



# బాబోయ్.. పీఎన్‌బీ!!

- ఒకే శాఖలో రూ.11,400 కోట్ల కుంభకోణం
- ఎల్‌వోయూల మాటున భారీ అక్రమాలు

వివరాలు 14లో

punjab national bank

## ఈ ఏడాదిలో రూ.457.78 కోట్లు చెల్లించాల్సిందే

వివరాలు 10లో

కొక్కొరోకో..



మన నాయకుల దగ్గర కొద్దిగా యాక్టింగ్ నేర్చుకుంటే మంచిదేమో సార్ అతను..!!

# వంద మండలాల్లో కాలేజీల్లేవ్


ఫైల్

## ఇంటర్మీడియట్ విద్యార్థులు దూర ప్రాంతాలకు

- దగ్గర్లో లేక చదువు మానేస్తున్న అమ్మాయిలు
- కళాశాల కోసం ప్రభుత్వానికి ఎమ్మెల్యేల విజ్ఞప్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాజధాని హైదరాబాద్ జిల్లాలో 16 మండలాలుంటే 12 మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లేవు. ఖైరతాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేశారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. అయినా సర్కారులో ఇప్పటిప వరకు ఎలాంటి మార్పు రాలేదు. రాజధానిలోనే ఇలా ఉంటే జిల్లాలు, మారు మూల ప్రాంతాల్లో కాలేజీల ఏర్పాటుపై ఎంత 10 లో

## Bodhtree Consulting Limited

CIN: L74140TG1982PLC040516, Regd. Off.: Block "A", Wing"2", Level-6, Cyber Gateway, Madhapur, Hyderabad, Telangana - 500081. Ph. No. 040- 66222333; Fax: 040-66222444. E-mail: cosecy@bodhtree.com, Website: www.bodhtree.com

**EXTRACT OF STANDALONE UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31st DECEMBER, 2017**

(Rs. in Lakhs except per share data)

| Particulars | Quarter Ended 31 Dec, 2017 | Nine Months Ended 31 Dec, 2017 | Quarter Ended 31 Dec, 2016 |
|---|---|---|---|
| Total Income from Operations | 2624.99 | 6443.52 | 1758.11 |
| Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and/or Extraordinary items) | 117.68 | 221.05 | 70.29 |
| Net Profit / (Loss) for the period before Tax (after Exceptional and/or Extraordinary items) | 77.40 | 158.29 | 59.47 |
| Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and/or Extraordinary items) | 77.40 | 158.29 | 59.47 |
| Total Comprehensive Income for the period [Comprising of Profit / (Loss) for the period (after Tax) and Other comprehensive income (after Tax)] | 85.39 | 158.55 | 59.47 |
| Equity Share Capital (face value of Re. 10/- each per share) | 19,95,82,360 | 19,95,82,360 | 18,04,61,670 |
| Reserves (excluding Revaluation Reserve as shown in the Audited Balance Sheet of previous year) | -- | -- | -- |
| Earnings Per Share (of Rs. 10/- each) (for continuing and discontinued operations) | | | |
| Basic | 0.43 | 0.79 | 0.33 |
| Diluted | 0.43 | 0.79 | 0.33 |

**Notes:**

a. The above is an extract of the detailed format of Quarterly Financial Results filed with the Stock Exchange BSE under Regulation 33 of the SEBI (Listing Obligations & Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly Financial Results are available on the website of stock exchange at www.bseindia.com and also on the Company's website at www.bodhtree.com.

b. The Company has adopted Indian Accounting Standards (Ind AS), prescribed under Section 133 of the Companies Act, 2013 read with the relevant rules. The date of transition of Ind AS is April 01, 2016 and accordingly these unaudited financial results have prepared in accordance with the recognition and measurement principles laid down in Ind AS 34 "Interim Financial Reporting" and other accounting principles generally accepted in India.

c. Figures for the previous periods have been regrouped / reclassified wherever necessary to confirm to the classification of the current period.

For **BODHTREE CONSULTING LIMITED**
Sd/-
**L N RAMA KRISHNA**
**MANAGING DIRECTOR**
**DIN: 03623543**

Place: Hyderabad
Date : 14.02.2018

## GOLDSTONE TECHNOLOGIES LIMITED

CIN; L72200TG1994PLC017211

**Regd. Office:** 9-1-83 & 84, Amarchand Sharma Complex, S.D. Road, Secunderabad - 03. Tel.040-27807640, Fax +91-040-39120023, Email Id : corporate@goldstonetech.com

**EXTRACT OF THE UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 31-12-2017**

| S. No. | Particulars | STANDALONE (Rs. In Millions) Quarter ended 31.12.2017 (Un-Audited) | Correspondig Quarter ended 31.12.2016 (Un-Audited) | Previous year ended 31.03.2017 (Audited) | CONSOLIDATED (Rs. In Millions) Quarter ended 31.12.2017 (Un-Audited) | Correspondig Quarter ended 31.12.2016 (Un-Audited) | Previous year ended 31.03.2017 (Audited) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Total Income from Operations (Net) | 59.66 | 51.36 | 215.12 | 82.80 | 83.66 | 371.70 |
| 2 | Net Profit / (Loss) for the period (before tax, Exceptional and / or Extraordinary items) | 6.76 | (0.26) | (40.99) | 1.68 | (3.61) | (53.59) |
| 3 | Net Profit / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items) | 6.76 | (0.26) | (40.99) | 1.68 | (3.61) | (53.59) |
| 4 | Net Profit / (Loss) for the period after tax (after Exceptional and / or Extraordinary items) | 6.76 | 0.99 | (51.00) | 1.68 | (2.63) | (63.96) |
| 5 | Total Comprehensive Income for the period | 7.02 | 0.99 | (51.00) | (1.70) | 5.04 | (63.96) |
| 6 | Equity Share Capital | 187.82 | 187.82 | 187.82 | 187.82 | 187.82 | 187.82 |
| 7 | Reserves (excluding Revaluation Reserve as shown in the Balance Sheet of previous year) | | | 296.92 | | | 423.76 |
| 8 | Earnings Per Share (of Rs.10/- each) | | | | | | |
| | Basic : | 0.37 | 0.05 | (2.72) | (0.09) | 0.27 | (3.41) |
| | Diluted : | 0.37 | 0.05 | (2.72) | (0.09) | 0.27 | (3.41) |

**Note** :"The above is an extract of the detailed format of Quarterly/Annual Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly/Annual Financial Results are available on the websites of the Stock Exchange(s) and listed entity. (URL: www.bseindia.com, www.nseindia.com and www.goldstonetech.com respectly)

**For Goldstone Technologies Limited**
Sd/-
C.Sudhakar Reddy
Managing Director
DIN:02191226

Place: Secunderabad
Date: 14.02.2018

## S.S. ORGANICS LIMITED

**CIN:** L24110TG1990PLC012038
**Regd. Office:** Survey No. 2521, Aroor Village, Sadasivapet Mandal, Medak Dist.
**Corp. Office:** H.No: 8-2-120/77/5, Ground Floor, Opp. KBR Park, Road No. 2, Banjara Hills, Hyderabad -500034 Telangana State.
**Phone No.** 040-23559938 **Email ID:** md@ssorganics.co.in, cs@ssorganics.co.in **Website:** www.ssorganics.co.in

**STATEMENT OF UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31.12.2017**

*(Rs. in Lacs except EPS)*

| S. No. | Particulars | Quarter Ended 31.12.2017 Unaudited | Nine Months Ended 31.12.2017 Unaudited | Quarter Ended 31.12.2016 Unaudited |
|---|---|---|---|---|
| 1 | Total income from operations (Net) | 295.34 | 737.07 | 314.77 |
| 2 | Net Profit / (Loss) from ordinary activities after tax | (76.26) | (361.03) | (154.53) |
| 3 | Net Profit / (Loss) for the period after tax (after Extraordinary Items) | (26.68) | (226.74) | (154.53) |
| 4 | Equity Share Capital | 1020.13 | 1020.13 | 1020.13 |
| 5 | Reserves (excluding revaluation reserve as shown in the balance sheet of previous year) | 0.00 | 0.00 | 0.00 |
| 6 | Earnings Per Share (Before Extraordinary Items) (of Rs.10/- each) Basic: | (0.26) | (2.22) | (1.51) |
| | Diluted: | (0.26) | (2.22) | (1.51) |
| 7 | Earnings Per Share (After Extraordinary Items) (of Rs.10/- each) Basic: | (0.26) | (2.22) | (1.51) |
| | Diluted: | (0.26) | (2.22) | (1.51) |

**Notes:**

1. The above is an extract of the detailed format of Financial Results for the Quarter and Nine months ended 31st December, 2017 filed with the Stock Exchange under Regulation 33 of the SEBI for the quarter and Nine months ended 31.12.2017 (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full formats of the Quarterly and Nine months ended Financial Results are available on the Website (www.bseindia.com.) and also available on Company website (www.ssorganics.co.in.)
2. The above results have been reviewed by the Audit committee and approved by the Board of Directors at its meeting held on 14th February 2018 at Corporate office: H.No-8-2-120/77/5,Ground Floor, Opp.KBR Park,Road No-2, Banjara Hills, Hyderabad 500034.

For **S.S. Organics Limited**
Sd/-
**V.N Sunanda Reddy**
*Managing Director*
*DIN: 00058317*

Date : 14.02.2018
Place : Hyderabad

## RAMINFO LIMITED

RAMINFO Ideate · Collaborate · Deliver

**CIN :** L72200TG1994PLC017598
Aakanksha, 3rd Floor, 8-2-293/82/J/III/564A22/1, Road No.92, Jubilee Hills, Hyderabad - 500033, Telangana
**Tel:** +91 40 23541894 **Fax:** +91 40 23558240 **URL:** www.raminfo.com **Email:** cs@raminfo.com

**Extract of Standalone Unaudited Financial Results for the Quarter and Nine Months Ended 31-12-2017**

*(Rs. in Lacs)*

| Sl. No. | Particulars | Quarter ended 31.12.2017 Unaudited | Quarter ended 30.09.2017 Unaudited | Quarter ended 31.12.2016 Unaudited | Nine months ended 31.12.2017 Unaudited | Nine months ended 31.12.2016 Unaudited |
|---|---|---|---|---|---|---|
| 1 | Total Income from Operations | 774.80 | 474.34 | 367.17 | 1623.68 | 1435.87 |
| 2 | Net Profit / (Loss) for the period (beforeTax, Exceptional items) | 42.96 | 26.19 | 34.58 | 89.69 | 83.15 |
| 3 | Net Profit / (Loss) for the period before tax(after Exceptional items) | 42.96 | 26.19 | 34.58 | 89.69 | 83.15 |
| 4 | Net Profit / (Loss) for the period after tax(after Exceptional and/or Extraordinaryitems#) | 35.62 | 23.84 | 28.81 | 79.79 | 67.90 |
| 5 | Total Comprehensive Income for the period[Comprising Profit / (Loss) for the period(after tax) and Other ComprehensiveIncome (after tax)] | 35.62 | 25.84 | 28.81 | 81.79 | 67.90 |
| 6 | Equity Share Capital | 628.06 | 628.06 | 628.06 | 628.06 | 628.06 |
| 7 | Earnings Per Share (Face value of Rs. 10/- each) 1. Basic: | 0.57 | 0.41 | 0.46 | 1.30 | 1.08 |
| | 2. Diluted: | 0.57 | 0.41 | 0.46 | 1.30 | 1.08 |

**Note:** Note: the above is an extractof the detailed format for quarterly/ Half yearly Financial Results filed with the Stock Exchange under Regulation 33 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly/ Half yearly Financial Results are available on the Stock Exchange website vizwww.bseindia.com and on the Company's website www.raminfo.com

The reconciliation between standalone financial results for the quarter ended 31st December, 2016, as previously reported in GAAP and IND AS is as under:

| Particulars | Quarter ended 31st December, 2016 (Rs. In Lakhs) |
|---|---|
| Net Profit under previous GAAP | 32.30 |
| Net Loss on valuation of Financial assets and financial liabilities at amorted cost as per IND AS 109 | 5.05 |
| Expected Credit loss adjustment | 0.00 |
| Tax Impact | (1.56) |
| Net Profit for the period under Ind AS | 28.81 |
| Other Comprehensive Income (net of tax) | 0.00 |
| **Total Comprehensive income under Ind AS** | **28.81** |

The reconciliation statement has been provided in accordance with Circular CIR/CFD/FAC/62/2016 issued by SEBI dated 5th July, 2016, on account of implementation of Ind AS by listed companies.

**For RAMINFO LIMITED**
**Sd/-**
**L. Srinath Reddy**
**Managing Director**
**DIN: 03255638**

**Place : Hyderabad**
**Date : 14th February, 2018**

## PUBLIC NOTICE

The General Public are hereby informed that my client, M/s.APBC Printing Inks Pvt., Ltd., having its office at 3-4-480/3, Barkatpura, Hyderabad is the lawful owner and possessor of land measuring 1 acre out of 11 acres being part of sy.no.62/1/A at Bahadurpally village and Gram Panchayat, Qutbullapur Mandal, Rangareddy district having purchased the same vide regd. Sale deed being doct.no.6686 of 1986 dated 27-10-1986. Ever since the date of purchase my client is using said land by raising structures and running his company.

The link documents pertaining to my client's above land and other appurtenant land, namely, original sale deeds being doct.no.796 of 1983 dated 21.2.1983, doct.no.804 of 1983 dated 22.2.1983 and doct.no.853 of 1983 dated 23.2.1983 are not readily traceable and have been misplaced. My client has also approached the concerned police station by filing a complaint requesting to trace out the missing documents.

In the above circumstances, it is hereby cautioned to the General Public that except my client no other person or persons have any right or claim over the land measuring 1.00 acre being part of sy.no.62/1/A at Bahadurpally village and Gram Panchayat, Qutbullapur Mandal, Rangareddy district and no body shall deal with third parties in regard to above land except my client.

Hyderabad
Date: 13-02-2018

**Vijay Kumar Heroor**
Advocate

## SANGAM HEALTHCARE PRODUCTS LTD

రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నం.205 & 206, అమర్ చంద్ శర్మ కాంప్లెక్స్, ఎస్.డి.రోడ్, సికింద్రాబాద్

**31.12.2017తో ముగిసిన త్రైమాసికానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు**

రూ. లక్షల్లో

| క్ర. సం. | వివరాలు | 31.12.2017తో ముగిసిన త్రైమాసికానికి | 31.12.2017తో ముగిసిన [illegible] | 31.12.2016తో ముగిసిన [illegible] | గత సంవత్సరం ముగిసిన [illegible] 3 నెలలు |
|---|---|---|---|---|---|
| 1 | ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం | 656.06 | 1610.46 | 1898.06 | 507.85 |
| 2 | కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు) | (22.85) | (268.78) | (185.95) | -111.98 |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు గల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (22.85) | (268.78) | (185.95) | -111.98 |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు గల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (22.85) | (268.78) | (185.95) | -111.98 |
| 5 | కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైజింగ్ లాభం/నష్టం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) | (22.85) | (268.78) | (185.95) | -111.98 |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం | 14860700 | 14860700 | 14860700 | 14860700 |
| 7 | రిజర్వులు (గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రివాల్యూవేషన్ రిజర్వులు మినహా) | - | - | - | - |
| 8 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) 1. బేసిక్ 2. డిల్యూటెడ్ | (0.015) | 0.180 | 0.125 | (0.07) |

ఎ) పైది సెబి (లిస్టింగ్ & అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజితో సమర్పించిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మేట్ యొక్క సారాంశం. త్రైమాసిక ఫలితాల పూర్తిఫార్మేట్ స్టాక్ ఎక్ఛేంజి యొక్క వెబ్‌సైట్లపై అందుబాటులో ఉంటాయి మరియు [illegible]
బి) అకౌంటింగ్ పాలసీలో మార్పుకారణంగా పూర్తి సమగ్ర ఆదాయం లేదా ఏదేని ఇతర సంబంధిత ఆర్థిక ఐటంల నికర లాభం/నష్టం యొక్క ప్రభావం ఫుట్‌నోట్ ఆధారంగా డిస్‌క్లోజ్‌చేయబడినది.
సి) మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంలు అవసరమైనచోట ఇండ్-ఏఎస్ రూల్స్‌తో సంబంధించిన లాభ& నష్ట నివేదికలో సర్దుబాటుచేయబడినవి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ తరఫున
**SANGAM HEALTH CARE PRODUCTS LIMITED**
సం/- (ఏ బాల గోపాల్)
మేనేజింగ్ డైరెక్టర్
**DIN No.01712903**

ప్రదేశం: హైదరాబాద్
తేది: 13-02-2018

## SoftSol India Limited (CIN: L72200TG1990PLC011771)

రిజిస్టర్డు ఆఫీస్: ప్లాట్ నం.4, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, సైబరాబాద్, హైదరాబాద్-500081, తెలంగాణ.

**31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం & తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌కాని స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాల సారాంశం**

| క్ర. సం. | వివరాలు | త్రైమాసిక ముగింపు 31.12.2017 ఆడిట్‌చేయనిది | త్రైమాసిక ముగింపు 30.09.2017 ఆడిట్‌చేయనిది | త్రైమాసిక ముగింపు 31.12.2016 ఆడిట్‌చేయనిది | అర్థ వార్షికం 31.12.2017 ఆడిట్‌చేయనిది | అర్థ వార్షికం 31.12.2016 ఆడిట్‌చేయనిది |
|---|---|---|---|---|---|---|
| 1 | ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర) | 429.61 | 552.24 | 474.25 | 1414.06 | 1417.46 |
| 2 | కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు) | 125.62 | 266.30 | 199.22 | 563.56 | 658.21 |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | 125.62 | 266.30 | 199.22 | 563.56 | 658.21 |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | 88.35 | 170.60 | 186.37 | 412.72 | 594.44 |
| 5 | కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) | (5.11) | (5.12) | (0.36) | 3.66 | 13.84 |
| 6 | ఈక్విటీ వాటామూలధనం (ముఖ విలువ రూ.10/- చొప్పున) | 1,723.65 | 1,723.65 | 1,723.65 | 1,723.65 | 1,723.65 |
| 7 | గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వు (రివాల్యూవేషన్ రిజర్వు మినహా) | - | - | - | - | - |
| 8 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) రెండు- బేసిక్& డైల్యూటెడ్ | 0.52 | 1.01 | 1.11 | 2.45 | 3.53 |

**గమనిక:** (1) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బాంబే స్టాక్ ఎక్ఛేంజితోదాఖలుచేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్స్ www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.softsolindia.com పై అందుబాటులో ఉంటాయి. (2) పై ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 14 ఫిబ్రవరి 2018న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి. (3) 1 ఏప్రిల్, 2017 నుండి ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి ఏఎస్)ను కంపెనీ ఆమోదించింది. తదనుగుణంగా, 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆర్థిక ఫలితాలు ఐఎన్‌డి ఏఎస్ గుర్తించిన మరియు మెజర్‌మెంట్ సూత్రాలను అనుసరించి ప్రిపేర్‌చేయబడినవి. 31 డిసెంబర్, 2016తో ముగిసిన త్రైమాసికం& అర్థవార్షికానికి ఆర్థిక ఫలితాలు ఐఎన్‌డి ఏఎస్ సూత్రాల ఆధారంగా రిస్టేట్ చేయడమైనది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 14-02-2018

For **SoftSol India Limited**
సం/- భాస్కర్ రావు మాదల
పూర్తి కాలపు డైరెక్టర్

## SHESHADRI INDUSTRIES LTD.

CIN - L17291TG2009PLC064849
రిజిస్టర్డు ఆఫీస్: సూర్య టవర్స్, 105, 6వ అంతస్తు, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్-500 003, తెలంగాణ.
Ph: 91-40-040-27843333, Fax: 91-40-27815135 email ID - info@sheshadri.in Website: www.sheshadri.in

**డిసెంబర్ 31, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం** (రూ.లక్షల్లో)

| క్ర. సం. | వివరాలు | త్రైమాసిక ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయనిది | త్రైమాసిక ముగింపు 30-09-2017 ఆడిట్‌చేయనిది | త్రైమాసిక ముగింపు 31-12-2016 ఆడిట్‌చేయనిది | తొమ్మిది నెలల ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయనిది | తొమ్మిది నెలల ముగింపు 31-12-2016 ఆడిట్‌చేయనిది |
|---|---|---|---|---|---|---|
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర) | 556.34 | 842.51 | 1,184.02 | 2,628.93 | 4,771.32 |
| 2 | కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను మరియు మినహాయింపు ఐటెంలకు ముందు) | (358.19) | (504.56) | (617.18) | (1,200.88) | (1,281.20) |
| 3 | కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్నుకు ముందు మినహాయింపు ఐటెంల తరువాత) | (358.19) | (504.56) | (617.18) | (1,200.88) | (1,281.20) |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపు ఐటెంల తరువాత) | (358.19) | (504.56) | (617.18) | (1,200.88) | (1,281.20) |
| 5 | కాలవ్యవధిలో పూర్తి సమగ్ర ఆదాయం | (358.19) | (504.56) | (617.18) | (1,200.88) | (1,281.20) |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం | 495.96 | 495.96 | 495.96 | 495.96 | 495.96 |
| 7 | రిజర్వులు (గత సం॥ యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్‌షీట్‌లో చూపినట్లు రివల్యూషన్ రిజర్వులు మినహా) | - | - | - | - | - |
| 8 | వాటా ఒక్కింటికి రాబడి (వార్షికం కాని) బేసిక్: (రూ) | (7.22) | (10.17) | (12.44) | (24.21) | (25.83) |
| | డైల్యూటెడ్: (రూ) | (7.22) | (10.17) | (12.44) | (24.21) | (25.83) |

గమనిక:

1. ఎ) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్& డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజిలతో దాఖలుచేసిన త్రైమాసిక ముగింపు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మేట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నది. త్రైమాసిక ముగింపుఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మేట్ స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్లు (www.bseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.sheshadri.in పై అందుబాటులో ఉంటాయి.

బి) పై ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఫిబ్రవరి 14, 2018న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ద్వారా ఆమోదించబడినవి. కంపెనీ యొక్క చట్టబద్ధ ఆడిటర్లు 31 డిసెంబర్, 2017తో ముగిసిన కాలవ్యవధి కొరకు ఫలితాల యొక్క పరిమిత సమీక్షను చేపట్టారు.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున
జితేందర్ కుమార్ అగర్వాల్
మేనేజింగ్ డైరెక్టర్

ప్రదేశం: సికింద్రాబాద్
తేది: 14 ఫిబ్రవరి, 2018

# ఆ సీపీఐ(ఎం) అభ్యర్థి అతి నిరుపేద



**అగర్తలా :** త్రిపుర ఎన్నికలలో ధలాయ్ జిల్లా చవమను నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఆస్తి కేవలం రూ. 1,218 మాత్రమే. ఆయనే నిరజయ్ త్రిపుర. ఈ విషయాన్ని ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అంతేగాకుండా ఆయన దేశంలోనే అత్యంత వయోధికుడైన శాసన సభ్యుడు కావడం విశేషం. ఆయన వయస్సు 90 సంవత్సరాలు. కాని అనుభవంలో మాణిక్ సర్కార్ కన్నా ఎంతో 'సంపన్నుడు'. ఈ ఎన్నికల్లో తన నియోజక వర్గం నుంచి మూడోసారి విజయం సాధించాలనుకుంటున్నాడు. "నేను నా నియోజక వర్గ ప్రజల కోసం జీవిస్తున్నాను. నేను వారి కోసం మరణిస్తాను. దానికి ముందే నేను పాన్ కార్డు పొందాలనుకుంటున్నాను. అత్యంత వయోధికుడైన శాసన సభ్యుడిగా రికార్డు బ్రేక్ చేయాలనుకుంటున్నాను." అని త్రిపుర చెప్పారు. ప్రస్తుతం ఈ రికార్డును మణిపూర్‌కు చెందిన రిషాంగ్ కేషింగ్ అనే రాజ్యసభ సభ్యుడు సొంతం చేసుకున్నారు. ఆయన వయస్సు 94 ఏళ్ళ సంవత్సరాలు. అయితే కేషింగ్ గత ఏడాది ఆగస్టులో మరణించారు. ఎమ్మెల్యేగా త్రిపుర రూ.55,170లు అలవెన్సులు అందుకుంటున్నారు. అవి మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. అందుకుగాను త్రిపురకు పాన్ కార్డు అవసరం ఏర్పడింది. "నాకు అలవెన్సులుగా వచ్చేదంతా అవసరం లేదు. నా నెలవారి వేతనం రూ.14 వేలు నాకు సరిపోతుంది. నా నియోజక వర్గంలో అవసరమైన వారు చాలా మంది ఉన్నారు. అలవెన్సుల మొత్తం వారికి ఉపయోగపడుతుంది." అని ఆయన చెప్పారు. త్రిపుర ఒక పూరింటిలో నివసిస్తున్నారు. ఆయనకు టెలివిజన్ కూడా లేదు. ఆయన భార్య కొన్నేళ్ళ క్రితం మరణించారు. త్రిపురకు కుమార్తె ఉన్నారు. నాలుగు కుర్చీలు, ఒక మంచం, ఒక టేబుల్, కొన్ని వాయిద్య పరికరాలు మాత్రమే ఆయన ఆస్తులు.

# ఇది ప్రజల మధ్య చిచ్చు... యాత్ర

## 'రామ్ రాజ్ రథ్ యాత్ర'పై సీపీఐ(ఎం) ఆందోళన

- మత విభజనతో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఓటుబ్యాంక్ రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకొచ్చి, బీజేపీ రాజకీయ ప్రయోజనాల్ని పొందాలనుకుంటోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు అంతా కలిసి 'రామ్ రాజ్ రథ్ యాత్ర' ప్రారంభించటంపై పొలిట్‌బ్యూరో ఆగ్రహం వ్యక్తం చేసింది. మతం పేరుతో దేశ ప్రజల్ని రెచ్చగొట్టి...తద్వారా హిందూ ఓటర్లని ఆకర్షించటమే దీనివెనుకున్న ఉద్దేశమని సీపీఐ(ఎం) తప్పుబట్టింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో బుధవారం విడుదల చేసిన ప్రకటన ఈ విధంగా ఉంది...

మూడు రోజుల క్రితం అయోధ్యలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి చేతులమీదుగా 'రామ్ రాజ్ రథ్ యాత్ర' ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఫైజాబాద్ బీజేపీ ఎంపీ, అయోధ్య బీజేపీ మేయర్, ఇతర బీజేపీ నాయకులు హాజరయ్యారు. పురాణగాథ 'రామాయణం'లో రాముడు శ్రీలంకకు వెళ్లిన మార్గంలో నేడు ఈ యాత్రను చేపట్టారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, ప్రతీ పాఠశాలలో రామాయణాన్ని బోధించటం, ఆదివారం స్థానంలో జాతీయ హిందూ సెలవు దినంగా గురువారం...తదితర డిమాండ్లతో మెజార్టీ ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రారంభించింది.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక (ఎలక్షన్లున్నాయని 15 రోజులు), కేరళ, తమిళనాడు రాష్ట్రాల గూండా ఈ యాత్రను జరపబోతున్నారు. ఈ యాత్ర ద్వారా మతపరమైన ఓటుబ్యాంక్‌ను బలపర్చుకోవాలని బీజేపీ-ఆర్ఎస్ఎస్ చూస్తోంది. దీనివల్ల పలు రాష్ట్రాల్లో మత ఉద్రిక్తతలు తలెత్తే అవకాశముంది. హింస, విద్వేష ఘటనలు జరగొచ్చు. మత ఏకీకరణ, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం బీజేపీ-ఆర్ఎస్ఎస్ పన్నుతున్న కుయుక్తులపై లౌకిక శక్తులు గళమెత్తాలి. శాంతికాముకులు, ప్రజాస్వామ్యవాదులు బీజేపీ-ఆర్ఎస్ఎస్ కుట్రల్ని బయటపెట్టాలి.

# ఓటు కోసం బీజేపీ మరో నాటకం !

## క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర అవకాశం

- ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల వాగ్దానం

**న్యూఢిల్లీ** ఎన్నికల వేళ ... ఎలాంటి హామీలనైనా కొన్ని రాజకీయ పక్షాలు, ప్రత్యేకించి బీజేపీ, ఓటర్లు ముందు పడేసి వారిని లోబరుచుకునేందుకు వెనుకాడదనే విషయం మరో సారి స్పష్టంగా కనిపిస్తోంది. ఈశాన్య భారత దేశంలోని మూడు రాష్ట్రాలు - త్రిపుర, మేఘాలయతో పాటు నాగాలాండ్ శాసనసభకు రానున్న కొద్ది రోజుల్లో ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. నాగాలాండ్‌లోని జనాభాలో 88 శాతం, మేఘాలయలో 75 శాతం క్రైస్తవులే. వారి ఓట్లను ఆకట్టుకునేందుకు మరో కొత్త వాగ్దానాన్ని బీజేపీ తెరపైకి తెచ్చింది. ముస్లింలకు ఇంతకాలం ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని కేవలం కొద్ది వారాల క్రితమే బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ సర్కారు ఉపసంహరించుకుంది. ఇప్పుడు అదే ప్రలోభాన్ని ఈశాన్య రాష్ట్రాల ఓటర్లను ఎరగా - క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర - ప్రకటించింది. ఈ విషయాన్ని ఈశాన్య ప్రాంత వార్తాసంస్థలు వెల్లడించాయి. అయితే ఇప్పటికీ స్పష్టం కాని విషయం ఏమిటంటే ఈ సదుపాయాన్ని దేశంలోని క్రైస్తవులందరికీ వర్తింపజేస్తుందా లేదా ఈశాన్యంలోని వారికి మాత్రమేనా? లేదా పూర్తిగా నాగాల్యాండ్ క్రైస్తవులకు మాత్రమేనా అన్నది ఇంకా తెలియలేదు. వియ్ ది నాగాస్ వార్తాసంస్థ సమాచారం ప్రకారం నాగాలాండ్‌లో అధికారం కట్టబెడితే క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర చేకూరుస్తామని బీజేపీ ప్రకటించింది. అయితే యూఎన్ఐ సంస్థ సమాచారం ప్రకారం ఈ సదుపాయం కేవలం ఆ రాష్ట్రంలోని వారికి మాత్రమే అని తెలుస్తున్నది. హజ్ సబ్సిడీలను తొలగించిన తరువాత వెలుగు చూసిన ఈ బీజేపీ ధోరణి అవకాశవాదానికీ, ఆత్మవంతనకు పరాకాష్ట అని కొంత మంది విమర్శిస్తున్నారు.

### 'బీజేపీ మాటలను నమ్మి మోసపోవద్దు'

**కొహిమా:** బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా నాగాలాండ్ బాప్టిస్టు చర్చి కౌన్సిల్(ఎన్‌బీసీసీ) భారీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజలను మభ్యపెట్టి, పెద్ద మొత్తంలో డబ్బులు పంచి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోందంటూ ప్రచారం నిర్వహిస్తున్నది. కాషాయ పార్టీ చేస్తున్న అసత్య వాగ్దానాలను తిప్పికొట్టాలని ఓటర్లకు ఎన్‌బీసీసీ పిలుపునిచ్చింది. ఈనెల 27న నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కాగా.. ఎన్‌బీసీసీ జనరల్ సెక్రెటరీ రేవ్ కెయ్‌హో మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అసలు ఉద్దేశమేంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ, ఆ పార్టీ దీనికి సమాధానం చెప్పలేకపోతే.. ప్రజలను మోసగించడం మానుకోవాలన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ అండతో దేశంలో కొన్నేండ్లుగా హిందూత్వ శక్తుల ఆగడాలు మితిమీరుతున్నాయని తెలిపారు. మోడీ సర్కారు అధికారంలోకొచ్చిన తర్వాత మైనార్టీ వర్గాలపై హింస మూడింతలకు పైగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూత్వమూకలు.. చర్చి పాస్టర్లను వీధుల్లోకి తీసుకొచ్చి వేధింపులకు గురిచేస్తూ.. అవమాన పరుస్తున్నాయని చెప్పారు. అంతేకాక, విదేశాల్లోని ఎన్‌బీసీసీ భాగస్వామ్య నాయకులకు కేంద్రం మూడేండ్లుగా వీసాలు నిరాకరిస్తూ వారిని దేశానికి రానివ్వడం లేదని తెలిపారు.

# 78 లక్షల మందికి ఉపయోగపడేలా కొత్త భీమా పథకం : జూపల్లి

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

అభయహస్తం పథకం కన్నా మెరుగైన భీమా పథకాన్ని తేవాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, దీనికి సంబంధించి కసరత్తులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 78 లక్షల మందికి ఉపయోగపడేలా ఈ పథకం ఉంటుందన్నారు. సహజ మరణమైతే రూ. 75 వేలు, యాక్సిడెంట్ మరణమైతే రూ.4 లక్షల చొప్పున ఇచ్చే విధంగా కొత్త స్కీమ్‌ను త్వరలో అమలులో తేనున్నట్టు తెలిపారు. అందరికీ న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని తెలిపారు.

# భజ(వీ)రంగ్ దళ్

**న్యూఢిల్లీ:** ప్రేమికుల దినోత్సవాన భజరంగ్ దళ్ కార్యకర్తలు రెచ్చిపోయా రు. తాము పాశ్చాత్య సంస్కృతికి వ్యతి రేకం కానీ, ప్రేమకు కాదు అంటూనే దౌర్జన్యాలకు దిగారు. ప్రేమ జంటలు రోడ్లపై, పార్కుల్లో తిరిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. బుధవారం పార్కుల్లో కి ప్రేమి కులను అనుమతించొద్దంటూ యాజమాన్యాలకు ముందే నోటీసులు అందించారు. మరోవైపు.. పోలీసులు కూడా అదే స్థాయిలో భజరంగ్ కార్యకర్తలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రేమికుల స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని, అలాంటి చర్యలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తా మని పోలీసు ఉన్నతాధి కారులు తెలిపారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినాగానీ, భజరంగ్, శివసేన కార్యకర్తలు తమ ప్రతాపాన్ని చూపారు. కనిపించిన ప్రేమ జంటలనల్లా వేధింపులకు గురి చేశారు. కొన్ని చోట్ల ప్రేమికులపై దాడులు కూడా జరిగాయి.

**అహ్మదాబాద్‌లో...**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి నదీ పరివాహక ప్రాంతంలో ప్రేమ జంటలను భజరం గ్ దళ్ సభ్యులు వేధించారు.

చేతిలో కర్రలు పట్టుకొని వారిని వెంబడించారు. ఈ క్రమంలోనే కొందరు భజరం గ్‌దళ్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**రాజస్థాన్‌లో ప్రేమికులపై దాడి**

రాజస్థాన్‌లో శివసేన హిందుస్థాన్ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. రాష్ట్రంలోని అజ్మేర్‌లో యువతి, యువకుడిపై వారి ప్రతాపాన్ని చూపిం చారు. వారిద్దరిపై దాడి చేయడమే కాక.. యువకుడితో గుంజీలు తీయిం చారు. రాష్ట్రంలోని మరికొన్ని చోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకు న్నట్టు సమాచా రం. ఇంత జరిగినా పోలీసులు ఒక్కరినీ అరెస్టు చేయకపో వడం గమనార్హం.

**నాగ్‌పూర్‌లో..**

ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరే కిస్తూ మహారాష్ట్రలోని నాగ్‌పూ ర్‌లో భజరంగ్‌దళ్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ప్రేమ జంటలు రోడ్లపై తిరుగు తూ కనిపిస్తే పెండ్లి చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

**చెన్నైలో కుక్కకు, గాడిదకు పెళ్లి**

ఇక చెన్నైలో భారత్ హిందూ ఫ్రంట్ కార్యకర్తలు మితి మీరి ప్రవర్తిం చారు. వాలెంటైన్స్ డేకు వ్యతిరేకంగా కుక్కకు, గాడిదకు పెండ్లి చేసి నిరసన తెలపడం వివాదాస్పదమైంది.

**పంజాబ్‌లో గట్టి బందోబస్తు**

ప్రేమికుల రోజున నగరంలో శాంతి భద్రతలను సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధి కారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఛండీగఢ్ సహా ఇతర నగరాల్లో గర్ల్స్ హాస్టళ్లు, కాలేజీలు, పంజాబ్ యూనివర్సిటీ, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వద్ద భద్రత కోసం అదనపు బలగాలను రంగంలోకి దింపారు. దీంతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో యూనివర్సిటీ మూత పడింది.

సంపాదకీయం

# అమెరికా సైనిక సమీకరణ

అమెరికా సామ్రాజ్యవాదానికి చైనా, రష్యాలు 'వ్యూహాత్మక పోటీదారులు' అని గత నెలలో ట్రంప్ విడుదల చేసిన నేషనల్ డిఫెన్స్ స్ట్రాటజీ పేర్కొంది. ప్రపంచంపై అమెరికా ఆధిపత్యానికి సవాలుగా మారకుండా ఈ రెండు దేశాలను నిరోధించాలని కూడా ఆ వ్యూహంలో పేర్కొన్నారు. 'అమెరికా యుద్ధానికి సన్నద్ధమవటానికి ప్రాధాన్యత నివ్వాలి' అని ఆ డాక్యుమెంట్ ప్రకటించింది. 2011 నవంబరు నెలలో అప్పటి అధ్యక్షుడు ఒబామా 'ఆసియా ఇరుసు' సూత్రీకరణ చేసిన తరువాత గత ఆరేండ్లుగా ఆసియాలో అమెరికా మిలిటరీ సరిగ్గా ఇదేపని చేస్తున్నది.

**ప్రగతిశీల శక్తులు విప్లవ చైతన్యంతో పాలకవర్గాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు అంతర్యుద్ధాలుగా పరిణమించే అవకాశం ఉంటుంది. 20వ శతాబ్దంలో సంభవించిన ప్రధాన విప్లవాలు ముఖ్యంగా అక్టోబరు మహావిప్లవం, చైనా విప్లవం ఈ కోవకే చెందుతాయి.**

చైనాకు వ్యతిరేకంగా యుద్ధానికి సన్నద్ధం కావటానికి యుద్ధ నౌకలను, జలాంతర్గాములను, యుద్ధ విమానాలను, బాంబర్లను, సైనిక, నౌకా దళాలను అమెరికా మోహరించింది. ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో కొత్త స్థావరాలను నెలకొల్పింది. ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్‌లలో పాత స్థావరాలను అమెరికా పునరుద్ధరించింది. చైనాకు వ్యతిరేకంగా 'వ్యూహాత్మక భాగస్వామి'గా మారిన భారతదేశం అమెరికా మిలిటరీకి నిర్వహణ, సరఫరా సౌకర్యాలను అందజేస్తున్నది.

ఇదిలావుండగా స్వల్పకాలంలో ఉత్తర కొరియాపై పెద్దఎత్తున దాడి చేసి ఆ దేశంలోని ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా భావిస్తోంది. అటువంటి పరిస్థితి తలఎత్తితే ఈశాన్య ఆసియాలో ప్రాబల్య సమతౌల్యం (బాలెన్స్ ఆఫ్ పవర్) తీవ్రంగా మారుతుంది. ఉత్తర కొరియాకు సరిహద్దు దేశాలయిన చైనా, రష్యాల భద్రత దీనితో ప్రమాదంలో పడుతుంది.

ఇదిలావుండగా దక్షిణ కొరియాలో జరుగుతున్న శీతాకాలపు ఒలింపిక్ క్రీడలలో ఉత్తర కొరియా పాల్గొనటాన్ని దక్షిణ కొరియా స్వాగతించింది. అంతేకాకుండా ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యోజోంగ్‌కు దౌత్యవేత్తకు గౌరవాన్నీ ఇచ్చింది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు ప్రవర్తించిన తీరును అందరూ గర్హిస్తున్నారు. యుద్ధమే గనుక సంభవిస్తే సర్వనాశనం అయ్యేది ఉత్తర, దక్షిణ కొరియాలే. అందుకే ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణాన్ని చల్లబరిచే ప్రయత్నాలకు ఇరువైపులా మద్దతు కనపడుతున్నది.




ఇటువంటి పరిస్థితి అమెరికాకు నచ్చటం లేదు. కొరియా సమస్యకు శాంతియుత పరిష్కారం లభించటం అమెరికాకు ఇష్టంలేదని సామ్రాజ్యవాద దురహంకారంతో ఆ దేశ ఉపాధ్యక్షుడు పెన్స్ ప్రకటించి ప్రభుత్వ విందు నుంచి అర్ధాంతరంగా నిష్క్రమించాడు. శీతాకాలపు ఒలింపిక్స్ ప్రారంభ ఉత్సవంలో రెండు కొరియా దేశాల క్రీడాకారుల బృందాలు ఒకే బృందంగా పాల్గొనటం చూసి అమెరికా ఉపాధ్యక్షుడు తట్టుకోలేకపోయాడు.

ఇటువంటి దౌత్యపరమైన దురహంకారం ఒక విషయాన్ని సూచిస్తున్నది. అదేమంటే అమెరికాకు కావలసింది ఉత్తర కొరియా తన ముందు సాష్టాంగపడటమే. కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం తన ముందు మోకరిల్లాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. అలా జరగకపోతే ఉత్తర కొరియాను సర్వనాశనం చేసేందుకు ట్రంప్ పథకాలను రచించటమే కాకుండా వాటి ఆచరణకు సంసిద్ధుడవుతున్నారు. కొరియాలో యుద్ధమనేదే సంభవిస్తే అది ఘోరాతిఘోరంగా ఉంటుందని జనరల్ డన్‌ఫోర్డ్ నావికాదళంతో మాట్లాడుతూ చెప్పారు. 'మీరు ఉదయం లేవగానే మీకు శాంతి ఉండే చివరి రోజు ఇదేనని మీరు అనుకోవాలి' అని ఆయన ఆ నావికాదళానికి చెప్పాడు. అటువంటి ప్రకటనలనుంచి, అమెరికా, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్ సైన్యాలు అన్నివైపులా మోహరించటం వంటి చర్యలనుంచి ఉత్తర కొరియా ఏమి అర్థం చేసుకోవాలి?

పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అత్యంత భయానకమైన, ఖరీదైన యుద్ధం అంచుకు ప్రపంచాన్ని తీసుకువచ్చాయి. అంతర్గత సంక్షోభాలతో సతమతమౌతున్న అమెరికా పాలకవర్గాలు గతంలోవలే ప్రపంచాన్ని శాసించే సామర్థ్యాన్ని కోల్పోయాయి. తమ ప్రాబల్యం ఇలా క్షీణించటాన్ని నిలువరించేందుకు గత 25ఏండ్లుగా చేస్తున్న సైనిక హింసను తీవ్రతరం చేయటమొక్కటే మార్గమని అమెరికా పాలకవర్గాలు భావిస్తున్నాయి.

ఉత్తర కొరియాపై అమెరికా చేయబోయే యుద్ధంలో చైనా, రష్యాలు ఉత్తర కొరియా తరపున పాల్గొనకపోయినా అటువంటి యుద్ధం అణ్వస్త్ర దేశాలమధ్య యుద్ధంగా పరిణమించే అవకాశం ఉంటుంది. నిజానికి చైనా, రష్యాలు కూడా అనివార్యమైతే అమెరికాను సైనికంగా ఎదుర్కోవటానికి సంసిద్ధమౌతున్నాయి. ఐరోపాలోని సామ్రాజ్యవాద దేశాలు కూడా అటువంటి మహా సంగ్రామంలో అమెరికాతో జతకలవటం అనివార్యమని భావిస్తున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలు చేసే యుద్ధాలు విప్లవ సన్నివేశాలను సృష్టిస్తాయని మొదటి ప్రపంచ యుద్ధం మొదలయిన తరువాత 1915లో వ్లాడీమీర్ లెనిన్ రాశాడు. అటువంటి సన్నివేశాల నేపథ్యంలో ప్రగతిశీల శక్తులు విప్లవ చైతన్యంతో పాలకవర్గాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు అంతర్యుద్ధాలుగా పరిణమించే అవకాశం ఉంటుంది. 20వ శతాబ్దంలో సంభవించిన ప్రధాన విప్లవాలు ముఖ్యంగా అక్టోబరు మహావిప్లవం, చైనా విప్లవం ఈ కోవకే చెందుతాయి. సరిగ్గా అలానే జరగకపోయినా పతనావస్థలోవున్న పెట్టుబడిదారీ వ్యవస్థ హింసాత్మకంగా చెలరేగుతోంది. అంతిమంగా ప్రజలే విజేతలవుతారనేది చరిత్ర మనకు అందిస్తున్న సందేశం!

# మిరప వ్యాపారుల మాయాజాలం



**సారంపల్లి మల్లారెడ్డి**


మిరప పంట మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. మరో మాసం రోజుల్లో పూర్తి పంట మార్కెట్‌కు వస్తుంది. గత సంవత్సరం పంట కాలంలో క్వింటాలుకు రూ.3500 నుండి రూ.4000 మధ్య అమ్మకాలు సాగాయి. కానీ, అంతకు మూడు మాసాల ముందు క్వింటాలు రూ.9000 నుండి రూ.14000 వరకు అమ్మారు. 2017 డిసెంబర్- 2018 జనవరిలో క్వింటాలు రూ.9000 నుండి రూ.10000 వరకు అమ్మకాలు సాగాయి. గత 15రోజులుగా క్రమంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం రూ.6000-7000 మధ్య అమ్మకాలు సాగుతున్నాయి. పంట మార్కెట్‌కు రావడం మొదలుకాగానే వ్యాపారులు ధరలు తగ్గించడం పరిపాటిగా మారింది. ఉత్పత్తి బాగా పెరిగిందని, ఎగుమతులు లేవని ప్రచారం మొదలుపెడతారు. కానీ వాస్తవాలేమిటి?

**ఈసారి క్వింటాలు ధర రూ.10000-12000 మధ్య ఉండేటట్టు చూడాలి. నాణ్యతాప్రమాణాలు, గ్రేడింగ్ పేరుతో మోసగించే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలి. ఇంతవరకూ మార్కెట్ కమిటీలు, వ్యాపారుల పక్షానే పనిచేస్తున్నాయి. ఇకనైనా రైతుల పక్షాన బాధ్యత తీసుకుని న్యాయమైన ధర రైతులకు వచ్చేలా చూడాలి. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ వేసి మార్కెట్లను పర్యవేక్షించాలి. అన్ని మార్కెట్లలో ధరల జాబితాను ప్రకటించాలి.**

ప్రపంచంలో 50 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతున్నది. అందులో 38శాతం భారత్‌లో జరుగుతున్నది. ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉండగా, 7శాతంతో చైనా, 5శాతంతో పాకిస్థాన్, బంగ్లాదేశ్, పెరూ దేశాలున్నాయి. థాయిలాండ్, మయిన్మార్, ఇండోనేషియాలలో కూడా కొంతమేరకు ఉత్పత్తి జరుగుతున్నది. 7 వేల ఏండ్ల క్రితం మిరపను కనుగొన్నారు. కానీ 3,500 ఏండ్ల నుండి ఉత్పత్తి ప్రారంభించారు. చాలా దేశాలలో మిరపకు బదులు మిరియాల వాడకం ఎక్కువగా ఉంది. క్రమంగా మిరియాల స్థానంలో మిరపకాయల వాడకం పెరుగుతున్నది. భారతదేశంలో 22 లక్షల ఎకరాల్లో ఈ పంట వేస్తున్నారు. 18 నుండి 22 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతున్నది. భారత ఉత్పత్తిలో 57శాతం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉత్పత్తి అవుతున్నది. ఒక విధంగా చెప్పాలంటే.. ఉభయ తెలుగు రాష్ట్రాలు ప్రపంచ ఉత్పత్తిలో 20శాతం వరకు ఉత్పత్తి చేస్తున్నారు. భారత్‌లో గుజరాత్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అధికంగా ఉత్పత్తి చేస్తారు. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, అస్సాం, పంజాబ్‌లలో నామమాత్రంగా ఉత్పత్తి అవుతున్నది. గత దశాబ్దకాల ఉత్పత్తిని పరిశీలిస్తే ఏనాడూ 50-60 లక్షల టన్నులకు మించి ప్రపంచంలో ఉత్పత్తి లేదు. అయినా ఉత్పత్తి పెరిగిందని చేస్తున్న ప్రచారం, మార్కెట్‌లో ధరలు తగ్గించడానికే తప్ప మరో కారణం లేదు. తెలంగాణలో 2లక్షల ఎకరాల్లో మిరప పంట వేయగా, ఏపీలో 4-5 లక్షల ఎకరాల్లో పంట వేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో కలిపి 10-11లక్షల టన్నులు ఉత్పత్తి అవుతున్నది. దీనిని కొనుగోలు చేసి ఎగుమతి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలది. ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించి మధ్య దళారీలకు అప్పగిస్తున్నారు. ప్రధానంగా కృష్ణా, గుంటూరు, ఖమ్మం, వరంగల్ జిల్లాలు కేంద్రంగా ఈ వ్యాపారం సాగుతున్నది. మిరపను ఆహారంగానే కాక రంగులలోకి, ఓడలకు తుప్పు పట్టకుండా పేస్టు తయారుచేస్తారు. మిరపను ప్రోసెస్ చేయడానికి తగిన యూనిట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయలేదు. కోల్డ్ స్టోరేజీలు కూడా రైతులను మోసం చేస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీలో నిల్వలపై బ్యాంకులలో రుణాలు తీసుకుని యజమానులు ఎగనామం పెడుతున్నారు. దీనిపై ఎలాంటి చట్టం లేదు. కేరళ కేంద్రంగా స్పైస్ బోర్డు ఉన్నప్పటికీ ఉత్పత్తి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్నది. గుంటూరులో ఈమధ్య స్పైస్ బోర్డు బ్రాంచి ఏర్పాటుచేశారు. కానీ వారు మార్కెట్ సమస్యలను పట్టించుకోరు.

ఒక ఎకరా దిగుబడికి రూ.1.5 లక్షల నుండి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. వాతావరణం అనుకూలంగా ఉంటే 25-30 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. ఎకరా మిరపకు కౌలు రూ.15000 నుండి రూ.20000 వరకు ఉంటుంది. గోదావరి డెల్టాలో ఎకరా రూ.40 వేల కౌలు కూడా నడుస్తున్నది. ఇంత కౌలు రేటు, పెట్టుబడి వెచ్చించినప్పుడు, దిగుబడి తగ్గినట్టయితే రైతు దివాళా తీయాల్సిందే. అననుకూల వాతావరణం, క్రిమి కీటకాలు దాడులు బాగా జరిగినప్పుడు దిగుబడి 10క్వింటాళ్ళకు మించదు. వ్యవసాయ శాఖ నుండి ఎలాంటి సహాయ సహకారాలు, సలహాలు ఉండవు. రైతులే ఎరువుల వ్యాపారులతో సంప్రదించి పంట రక్షణ చేసుకోవాలి. ఈ పంటను నిల్వ పెట్టడం సాధ్యం కాదు. నిల్వ చేయాలంటే కోల్డు స్టోరేజీలు తప్ప మరో మార్గం లేదు. తెలంగాణలో కోల్డు స్టోరేజీల సంఖ్య చాలా తక్కువ. ఆంధ్ర ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఇతర సరుకులతో వాటిని నింపివేస్తారు. రైతుల బలహీనతను ఆసరాగా తీసుకుని కోల్డు స్టోరేజీలలో నిల్వ పెట్టే బస్తా (టిక్కీ)కి రూ.40 నుండి రూ.50 వరకూ వసూలు చేస్తారు. ధరలు పెరుగుతాయన్న ఆశతో నిల్వ చేసుకున్న రైతులకు 3, 4 మాసాల వరకు ధరలు పెరగవు. ఒక విధంగా కోల్డు స్టోరేజీలకు చెల్లించాల్సిన కిరాయికి అదనంగా నష్టపోవాల్సి వస్తున్నది. నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం లోపించినా నిల్వకు సాధ్యం కాదు. భారతదేశం నుండి శ్రీలంక, దక్షిణ కొరియా, అమెరికా, జర్మనీ, జపాన్, లండన్, ఫ్రాన్స్ దేశాలకు ఎగుమతులు చేస్తున్నాము. ఈ ఎగుమతులను క్రమబద్ధీకరించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ ఏజెన్సీల ద్వారా ఎగుమతి చేస్తే రైతులకు లాభం జరుగుతుంది. ఈరోజు బంగ్లాదేశ్, పాకిస్థాన్, అమెరికాలలో కిలో మిరపకాయలకు రూ.120-165 ధర పలుకుతున్నది. కానీ ఇక్కడ రైతులనుండి రూ.60-70 లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రపంచంలో ఏ మార్కెట్‌లోనూ ధరలు తగ్గకున్నా, ఇక్కడి వ్యాపారులు మాత్రం డిమాండు తగ్గిందని ప్రచారం చేస్తున్నారు. మిరపకు కనీస మద్దతు ధర నిర్ణయం లేదు. వ్యాపార పంట అయిన పత్తికి మద్దతు ధర నిర్ణయించారే తప్ప మిరపకు మద్దతు ధర నిర్ణయించకపోవడం ప్రభుత్వాల వ్యాపార అనుకూల ధోరణికి నిదర్శనం.

మిరపను ప్రోసెస్ చేయడానికి తగిన యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు మిరప వాడకాన్ని పెంచడానికి తగిన విధానాలను ప్రభుత్వం రూపొందించాలి. ఇందులో ఏ,సీ,ఈ విటమిన్లు ఉంటాయి. ఆరోగ్యానికి ఇది మేలు చేకూర్చుతుంది. రక్త ప్రసరణను వేగవంతం చేస్తుంది. దీనిన సుగంధ ద్రవ్యాల జాబితాలో చేర్చాలి. ఈ పంటలో 20 రకాలకు పైగా ఉత్పత్తి చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలకు కిలోకు రూ.1 లక్ష నుండి రూ.1.50 లక్ష



వరకూ చెల్లించాలి. అంతర్గత కృషికి కూలీల సంఖ్య ఎక్కువ అవసరం. 2,3 ఎకరాలు వేసినవారు కూడా ఇతర గ్రామాల నుంచి కూలీలను తెచ్చి, వారికి నివాసం, భోజనం ఏర్పాటు చేయాలి. వాస్తవానికి మిరపను ఏరిన తర్వాత రంగు పోకుండా నీడలో ఆరబెట్టాలి. కానీ అలాంటి వనరులు లేక ఆరుబయట ఆరబెడతారు. చాలా సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాల వల్ల, వర్షాలు, గాలి దుమారం వచ్చి ఆరబెట్టిన పంటకు పెద్ద ఎత్తున నష్టాలు జరిగాయి. ఈ పంటకు బీమా సౌకర్యం కూడా లేదు. తెలంగాణలో రాళ్ళ వర్షాలు ఎక్కువ. ఒకసారి రాళ్ళ వర్షం వస్తే, మిరప తోటలు గానీ, ఆరబెట్టిన మిరపకాయలు గానీ, ఒక్క కాయ కూడా కనపడదు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖామంత్రి మాత్రం కేంద్రానికి లేఖలు రాస్తున్నాము, చివరి మిరపకాయ వరకు కొనుగోళ్ళు చేస్తాము, కోల్డు స్టోరేజీలను నిర్మిస్తాం, అంటూ గత దశాబ్ద కాలంగా ప్రకటనలపై ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడడంలేదు. ప్రభుత్వం ఈ పంటను కొనుగోలు చేసి, ప్రోసెస్ చేసి, పౌడరుగా మార్చి నిల్వ చేసుకుని అవసరాన్ని బట్టి ఆయా దేశాలకు ఎగుమతులు చేస్తే రైతులతో పాటు ప్రభుత్వ వ్యాపార సంస్థకు కూడా లాభాలు వస్తాయి. ఉత్పత్తిదారులకు నాణ్యతగల విత్తనాలు సరఫరా చేయడంతో పాటు కొత్త విత్తనాలను ఆవిష్కరించాలి. మిరప పంటపై ఎలాంటి పరిశోధనా ప్రయోగాలు చేయడంలేదు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఆ పరిశోధనలను చేపట్టాలి. ఉత్పత్తి ధరపై 50శాతం కలిపి గిట్టుబాటు ధరను పంట వేసేటప్పుడే నిర్ణయించాలి. నాణ్యతా ప్రమాణాలను బట్టి ధరలను నిర్ణయించి కొనుగోలు చేయాలి. సమగ్ర ఉత్పత్తికి ప్రణాళికల రూపకల్పన ఉండాలి. వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళికలో మిరపపంట ఊసే ఉండదు. దీనికితోడు భూమి నాణ్యత ఆధారంగా పంటల ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తూ వ్యవసాయ శాఖ/ఐస్ బోర్డు నిర్ణయించాలి. సస్యరక్షణకు పై శాఖలు సలహాలు ఇవ్వాలి. ఈ పంటను ప్రోసెస్ చేయడానికి తగు పరిశ్రమలను ఏర్పాటు చెయ్యాలి. చిన్న, సన్నకారు రైతులకు స్పైస్ బోర్డు నుండి సలహాలు, ఆర్థిక గ్రాంట్లు ఇవ్వాలి. పంట చేతికి వచ్చాక నాలుగు మాసాలపాటు ఉచితంగా కోల్డు స్టోరేజీ సౌకర్యం కల్పించాలి.

మరొక మాసం రోజుల్లో ధరలు తగ్గే పరిస్థితి రాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం కల్పించుకుని ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలి. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడంలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సివిల్ సప్లైయిస్ శాఖ ద్వారా వెంటనే రంగంలోకి దిగి, ఏ ప్రాంతం నుంచి ఎంత దిగుబడి వస్తున్నదో నమోదు చేసుకుని, వారికి తగు సూచనలు ఇవ్వాలి. హాట్ బాయిలర్ల ద్వారా మిరపను ఆరబెట్టే సాంకేతిక ప్రక్రియను రైతులకు అందుబాటులో పెట్టాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టానికి పూర్తి పరిహారం చెల్లించాలి. అంతేతప్ప, డిమాండు లేదని, ప్రపంచంలో ఎగుమతులకు అవకాశం లేదని సాకులు చెప్పి, ధరలు తగ్గించి, రైతాంగాన్ని మోసపుచ్చే విధానాలను మానుకోవాలి. వ్యాపారులు స్వచ్ఛందంగా లాభాలను తగ్గించుకోవడానికి సుముఖంగా ఉండరు. అందువల్ల ప్రభుత్వాలే జోక్యం కల్పించుకోవాలి. ఈసారి క్వింటాలు ధర రూ.10000-12000 మధ్య ఉండేటట్టు చూడాలి. నాణ్యతాప్రమాణాలు, గ్రేడింగ్ పేరుతో మోసగించే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలి. ఇంతవరకూ మార్కెట్ కమిటీలు, వ్యాపారుల పక్షానే పనిచేస్తున్నాయి. ఇకనైనా రైతుల పక్షాన బాధ్యత తీసుకుని న్యాయమైన ధర రైతులకు వచ్చేలా చూడాలి. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ వేసి మార్కెట్లను పర్యవేక్షించాలి. అన్ని మార్కెట్లలో ధరల జాబితాను ప్రకటించాలి.

**సెల్: 9490098666**



**డాక్టర్ చుక్కా రామయ్య**

# మనుషుల్లో ధైర్యం నింపండీ..!

రామయ్య మాట

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న బలవన్మరణాలు ఆందోళన కల్గిస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా నేరప్రవృత్తి విపరీతంగా విస్తరిస్తోంది. పాఠశాలకు సెలవు కోసం, పరీక్ష వాయిదా వేయించడం కోసం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మందలించారని, పరీక్ష తప్పినందుకు విద్యార్థులు ప్రాణం తీసుకుంటుంటే.. కూర బాగాలేదని, భార్య పుట్టింటికి వెళ్లిం దని, నగలు కొనిపెట్టలేదని, సినిమాకు తీసుకెళ్లలేదని.. ఇలా చిన్నచిన్న కారణాలతోనే తమ నూరేళ్ల జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నవారెందరో. మనుషుల్లో ఎందుకింత మానసిక అసమర్థత లోపిస్తుందో అంతుపట్టడంలేదు. కష్టసుఖాల సమ్మిళతమే జీవితం. మరి, అలాంటి అమూల్యమైన జీవితాన్ని ఎంతో ఆనందంగా సాగించకుండా ఇలాంటి చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయి ప్రాణాలు తీసుకొనే తీవ్రమైన నిర్ణయాలకు వచ్చేయడం సరికాదు. పిరికితనం మనిషిని నిర్వీర్యం చేస్తుంది. దానికి ఆత్మవిశ్వాసమే విరుగుడు. ఆత్మవిశ్వాసం ఉంటే మనిషి విజయపథం వైపు అడుగులు వేస్తాడనే విషయాన్ని గుర్తించాలి.

సాంకేతికతను అందిపుచ్చుకొని పారిశ్రామిక ఉత్పత్తిని పెంచుకుంటూ జీడీపీని పెంచుకోవడం కన్నా జీడీపీని పెంచే మనుషుల శ్రమను బతికించుకోవడమే ఈ రోజు ప్రధానం. ఇలాంటి సామాజిక రుగ్మతలను తరిమికొట్టినప్పుడే దృఢమైన సమాజం నిర్మితమవుతుందని ప్రభుత్వాలు గుర్తించుకోవాలి. ఈ శతాబ్దంలో మానవ వనరులే దేశానికి వరం. ఈ రోజు చిన్నచిన్న కుటుంబ తగాదాలు, చిన్నపాటి సమస్యలతో ప్రాణాలు తీసుకుంటున్నవారు కొందరైతే.. అహర్నిశలు శ్రమించి సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరరాక, ప్రభుత్వాల నుంచి సరైన సాయం అందక దేశానికి అన్నంపెట్టే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన విషయం.

మరో వైపు చేనేత కార్మికులు, చదువుకు తగిన ఉద్యోగాలు దొరక్క యువత తమ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం వీరందరికీ చేయూతనివ్వాలి. మనుషులు స్వేచ్ఛగా, ఆనందంగా జీవించే వాతావరణం సృష్టించాలి. జీడీపీని పెంచేముందు దాన్ని సృష్టించే మానవ వనరులను బతికించుకోవడం నేటి ప్రభుత్వాలకు ఓ సవాల్. పెద్దపెద్ద కాంట్రాక్టర్లు, బడా బాబులకు అడిగిందే తడవుగా రూ. కోట్ల మొత్తంలో రుణాలు ఇస్తున్న బ్యాంకులు దేశానికి అన్నం పెట్టే రైతుకు, ఏదైనా ఉపాధి కోసం రుణం అడిగే యువకుడికి మాత్రం మొండిచేయి చూపుతున్నాయి. తద్వారా తమ సామాజిక బాధ్యత విస్మరిస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వాలు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం బాధాకరం. బ్యాంకులను నిలదీసి ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వాలే ఈ ధోరణిలో వ్యవహరిస్తుంటే ఇక వారిని పట్టించుకొనేదెవరు? రూ.వేల కోట్లు బ్యాంకులకు బకాయిపడిన వారంతా దర్జాగా తిరుగుతుంటే ఏమీ చేయలేని బ్యాంకులు కేవలం రూ.వేల మొత్తంలో రుణం తీసుకొని కట్టలేని పరిస్థితుల్లో ఉన్న సామాన్య జనంపై తమ జులుం ప్రదర్శిస్తున్నాయి. అప్పుల వసూలు కోసం వారిని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో 80శాతంగా ఉన్న వ్యవసాయం ఈ రోజు సుమారు 45శాతానికి పడిపోయింది. పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడానికి తోడు దళారీల మాయాజాలంలో చిక్కుకున్న రైతన్న కుదేలయ్యాడు. ఉద్యోగాలు రాక యువత తీవ్ర ఆందోళనకు గురవుతోంది. సమాజంలో మహిళలకు భద్రత కరువైంది.

కష్టానికి తగిన ఫలితం రాక బతుకు భారమై బలవన్మరణాలకు పాల్పడుతున్నవారు కొందరైతే.. చిన్నపాటి సమస్యలకే మనిషి ప్రాణాలు తీసుకుంటుండటం నేడు షరా మామూలైంది. సామాజిక అశాంతికి దారి తీసే పరిణామం. నిత్యకృత్యంగా మారుతున్న ఇలాంటి తీవ్రమైన సమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలి. దానికి కారణాలు అన్వేషించాలి. పరిష్కార మార్గాలను సూచించాలి. ఎలాంటి సమస్యలు వచ్చినా నిలదొక్కుకొని మానసిక స్థైర్యాన్నిచ్చే విధంగా కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. వారిలో మానసిక వికాసాన్ని పెంపొందించాలి. సమస్య ఉత్పన్నమైనప్పుడు పోలీసులను రంగప్రవేశం చేయించి దానిపై విచారణ చేయించడం మామూలే. కానీ మనుషుల్లో ఈ మానసిక అస్థిరతకు కారణాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. కేవలం గణాంకాలు చెప్పడం, కేసులు విచారణ చేసి అరెస్టులు చేయడంతో ఒరిగేదేమీ ఉండదు. సమస్య మూలాల్లోకి వెళ్లి ఆ రుగ్మతలను నియంత్రించే ప్రయత్నాలు చేస్తే సమాజానికి మేలు జరుగుతుంది. ఎందుకిలా జరుగుతోంది? ఏయే రంగాల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయి? ఏయే కారణాల వల్ల జరుగుతున్నాయో అన్వేషిస్తే చక్కటి పరిష్కారాలు దొరుకుతాయి. మనిషి ప్రాణాల హననానికి దారితీస్తున్న సమస్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. దేశ ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఏ చిన్నపాటి సమస్యలు వచ్చినా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్య అందుకు పరిష్కారం కాదు. ప్రతి మనిషి జీవితంలో విజయం, అపజయం రెండూ ఉంటాయి. అపజయాన్ని కూడా స్వీకరించే పరిస్థితిలో ఉంటేనే జయానికి సిద్ధంగా ఉంటాం. మనుషుల సంరక్షణపై ప్రభుత్వాలు పట్టనట్టుగా వ్యవహరించడం వల్లే ఇలాంటి సామాజిక అశాంతికి కారణమనే ఆరోపణల్ని తోసిపుచ్చలేం. నిత్యం ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వాలు మనుషుల్ని కేవలం ఓటు వేసే యంత్రాలుగానే చేస్తుండటం దురదృష్టకరం. మనుషుల్ని దేశంలో ఓ అమూల్య సంపదగా గుర్తించండి. మానవ సంబంధాలను బలోపేతం చేసే విధానాలను అనుసరించండి. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అని మహాకవి గురజాడ చెప్పిన మాటల్ని గుర్తుచేసుకోండి.

**- ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు**

# ఎన్నాళ్ళీ ఆవు కథలు...?



**జి. తిరుపతయ్య**

ఎనకటికి ఒక టీచర్ ఏదైనా కథ చెప్పమని ఒక విద్యార్థిని అడిగాడట, దానికి సమాదానంగా ఆ విద్యార్థి ఒక ఆవు కథ చెబుతూ" అనగనగా ఒక ఊరు ఆ ఊళ్ళో చాలా ఆవులు ఉండెను. ఆవుకు నాలుగు కాళ్ళు, రెండు కొమ్ములు, రెండు కండ్లు ఉండును. అది గడ్డి మేయును. ఆవు పాలు ఇచ్చును. పేడ వేయును, పాలు మనుషులు తాగెదరు పేడతో పిడకలు చేస్తారు..." అంటూ చెప్పాడట. ఆ తరువాత మరోరోజు జాతీయ నాయకులెవర్నైనా ఉటంకిస్తూ ఇంకో కథ చెప్పమన్నరట టీచర్. దానికా విద్యార్థి స్పందిస్తూ "మహాత్మా గాంధీ గొప్ప నాయకుడు, వారి చేతిలో ఎప్పుడూ కర్ర ఉండెను. ఆ కర్రతో ఆవులను కూడా కాయవచ్చు, ఆవుకు నాలుగు కాళ్ళు, రెండు కండ్లు ఉండును అది పేడ వేయును...." అంటూ ఇంతకు మునుపు చెప్పిన ఆవు లక్షణాలన్నీ వల్లె వేశాడట. టీచర్ కాస్త తమాయించుకుని ఈ సారి ఒక క్రీడా కారుని గురించి చెప్పామన్నాడట. అప్పుడా విద్యార్థి "సచిన్ టెండుల్కర్ మంచి ఆటగాడు, క్రికెట్ మైదానంలో మంచి పరుగులు సాధిస్తాడు. మైదానమంతా పచ్చగడ్డితో నిండి వుంటుంది. ఆ గడ్డి అంటే ఆవులకు చాలా ఇష్టం. ఆవుకు నాలుగు కాళ్ళు రెండు కండ్లు...." అంటూ మొదలెట్టగానే టీచర్‌కి అర్థమైందట విద్యార్థి ప్రతిభేంటో. ప్రధాని నరేంద్రమోడీ ఉపన్యాసాలకు ఈ విద్యార్థికి పోలికలేమైనా ఉన్నాయా? గత మూడున్నరేండ్లుగా వారి ఉపన్యాసాలు విన్నవారికి తప్పకుండా అవుననే అనిపిస్తుంది. దేశాన్ని పరిపాలించమని అధికారాన్ని చేతిలో పెడితే పాలించడంలో నైపుణ్యత లేక అన్నీ అడ్డగోలు, అసంబద్ధ నిర్ణయాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసి ఇదేమిట్రా బాబు అంటే దానికి సమాధానం చెప్పకుండా 1947లో దేశ విభజన సరిగ్గా జరగలేదు. అప్పుడలా జరిగి ఉంటే ఇప్పుడిలా ఉండేది అంటూ ఊహ జనిత నిర్ధారణలు చేయడం అసమర్థుల జీవయాత్ర కాదా? సమర్థులు సరిదిద్దుతారు కానీ సాకులు చెప్పరు. మొన్న పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగిస్తూ మోడీ చేసిన ప్రసంగం ఆద్యంతం ఎదుటి వారిని విమర్శించేందుకే ఉపయోగించారు కానీ వాస్తవాలేవీ మాట్లాడలేదు. 1947లో జవహర్‌లాల్ నెహ్రూకు బదులు లాల్ బహదూర్ శాస్త్రీ ప్రధాని అయివుంటే దేశం మరోలా ఉండేదని, పటేల్‌ను నెహ్రూ మోసం చేశారంటూ, దేశ విభజన జరిగేది కాదని, కాశ్మీర్ సమస్యే ఉండేది కాదని ఏవేవో ఉటంకిస్తూ అసందర్భోచిత వ్యాఖ్యానం చేశారు. ఉన్న అధికారంతో ఏమేమి చేయబోతున్నారో చెప్పకుండా అప్పట్లో ఏవో తప్పులు జరిగాయంటూ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటజూస్తున్నారు. ఇది ముమ్మాటికీ తప్పుడు విధానం. చరిత్ర కారులందరూ గొప్పవారేనన్న భావనను యువతరంలో చొప్పించకుండా తప్పుదోవ పట్టించడం మంచిది కాదు. నిజానికి జవహర్ లాల్ నెహ్రూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న అందరికన్నా ఎక్కువ కాలం, పదిహేడేండ్ల మూడు నెలలు జైలులో గడిపారు. ఇంత కాలం వేరెవ్వరూ గడపలేదు. తన భార్య 36 ఏండ్ల వయసులో టీ.బీ జబ్బుతో మంచంబట్టి ఖాట్మండులో ఉంటే బ్రిటిష్ వారి కారాగారంలో ఉండిపోయాడే తప్ప కనీసం చివరి చూపునకు కూడా నోచుకోలేదు. రాజకీయంగా భిన్న ధృక్కోణాలుండవచ్చు. తప్పు లేదు. కానీ స్వాతంత్ర్య సమరయోధుణ్ణి ఇంత చులకనగా భావితరాలకు పరిచయం చేయడం సభ్యత కాదు. ఇలా చేయడం వల్ల బీజేపీ లేదా దాని పూర్వాశ్రమ సంస్థలేవీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని అందుకే మిగతా వారి చరిత్రకు మసిపూస్తున్నారన్న సత్యం బయట పడకుండా ఉండదు.



మైకు పట్టుకుంటే ప్రధాని చెప్పేవి మూడే అంశాలు. ఒకటి కాంగ్రెస్ దేశానికి చాలా నష్టం చేసింది. రెండు, అ నష్టం పూడ్చడానికి బీజేపీ చాలా కష్ట పడుతుంది. మూడు దేశం ముందడుగు వేస్తుంది. కాంగ్రెస్, బీజేపీల గురించి పక్కన పెడితే దేశం ముందడుగు ఏ రంగాల్లో వేస్తుందో సూటిగా చెప్పగలరా? బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తులకు కారణం కాంగ్రెస్ అంటూ ఆడి పోసుకుంటారు. 2013లో నాలుగున్నర లక్షల కోట్లున్న నిరర్థక ఆస్తులు నేడు తొమ్మిదిన్నర లక్షల కోట్లు అనగా ఈ నాలుగేండ్లలో నిరర్థక ఆస్తులు రెండింతలుగా పెరిగాయి. మరి ఇది ఎవరి నిర్వాకమో! అధికారం చేతిలో ఉండి కంట్రోల్ చేయకుండా, విజయ మాల్యాను దేశం విడిచేలా ప్రోత్సహించి, బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందెవరు? రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్లో కలిపి అత్యంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ, అత్యధిక, పది కోట్ల పైబడిన ప్రజలకు రోజూ సేవలందిస్తున్న రైల్వేనూ దాని స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేశారు. డిఫెన్స్ రంగంలోకి మొత్తం ప్రయివేటు పెట్టుబడిని ఆహ్వానించి రాఫెల్ యుద్ధ విమానాలను ఖతార్ వంటి దేశాలు 650 కోట్లకు ఒకటి కొంటే మనం 1550 కోట్లకు కొంటున్నామని పత్రికలు కోడై కూస్తున్న ఘనత ఎవరిది సార్? ఈ విధంగా ఎయిర్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అవసాన దిశకు చేరుకుంటుంటే కేంద్రం ఏ నిర్ణయం చేసి వాటిని ఆదుకుంటుందో జాతికి వివరించకుండా ప్రతిపక్షాలపై భావోద్వేగంతో విరుచుకుపడటంలో అర్థమేముంది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ కూడా ఇదే తరహా విమర్శనాత్మక ఉపన్యాసమే చేశారు. ప్రయివేటు రంగం కూడా ఈ నాలుగేండ్లలో విస్తరించలేదు. కేవలం రిలయన్స్ తప్ప టెలికం రంగంలో పని చేస్తున్న అన్ని ప్రొవైడర్లు పోటీని తట్టుకోలేక నష్టాలు చూస్తున్నాయి. ఐటీ రంగంలో 2017 ఒక్క ఏడాదిలోనే 15 లక్షల ఉద్యోగాలు కోల్పోయారు. ఈ అంశాలన్నీ పార్లమెంటులో ప్రస్తావనకూ నోచుకోకూడదా?

జనవరి 23న ఆక్స్‌ఫామ్ అనే సంస్థ తెలిపిన వివరాల ప్రకారం 1శాతం అత్యంత ధనికులైన భారతీయుల చేతుల్లో 73శాతం దేశ సంపద ఉన్నదని, భారత జనాభాలోని అట్టడుగు 67శాతం మంది సంపద కేవలం 1శాతం మాత్రమే పెరిగిందని తెలిసింది. ఇవి వెల్లడైన రోజున ప్రధాని మోడీ స్విట్జర్లాండులో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొంటుండె. విదేశీ గడ్డపై మన బండారం బయట పెట్టుకోవడం సబబు కాదని. అది సరే. మరి భారత పార్లమెంటులోనైనా ఈ వ్యత్యాసాన్ని గురించి ఎందుకు ప్రస్తావించకూడదు? ఆ బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఈ వ్యత్యాసం 2015లో 47శాతం, 2016లో 58శాతం, 2017లో 73శాతంగా నమోదైంది. దీనిని బట్టి మోడీ హయాంలోనే సంపద ఒక వైపు తరలిపోతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పోకడలను కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటుందా? ఒకవేళ సమర్థించుకున్నా కారణాలను ప్రజలకు ఎందుకు వివరించకూడదు? ఈ ధోరణిని వివరించాలంటే తమ విధానాలను తామే తప్పు పట్టినట్టు అవుతుంది. ఇలాంటి వ్యత్యాసాలు ఇలాగే కొనసాగితే అతికొద్ది రోజుల్లోనే దేశ సంపదంతా కొద్దిమంది చేతుల్లో చేరడం ఖాయం. ఇక పార్లమెంటులో ప్రధాని ప్రస్తావించాల్సిన మరో అంశం పెరుగుతున్న సామాజిక అంతరాలు. కోరేగావ్ ఘర్షణల్లో దళితులు ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి సంఘటనలపై ప్రధాని స్పందిస్తే పరిస్థితులు త్వరితంగా కుదురుకుంటాయి. కానీ అట్లాంటి ప్రయత్నాలేవీ చేయకుండా కేవలం ప్రతిపక్షాన్ని విమర్శించే ఎన్నికల ఉపన్యాసాలు మాత్రమే చేయడం సబబు కాదు. పార్లమెంటున్నది వాద ప్రతివాదనలకు కాదు ప్రభుత్వ ప్రతిపాదనలు ప్రతిపక్షాల సూచనలతో చట్టాలుగా మారేందుకనే నమ్మకం కలిగించడమే ప్రజా స్వామ్య కర్తవ్యం.

**సెల్: 9951300016**

# రక్తదానంలో రికార్డు...

**ఆగస్టు 2016... బెంగళూరు జిల్లా రోటరీ టీమ్ ఒక్క రోజు కర్ణాటకలోని 13 ప్రాంతాల్లో, ఎనిమిది గంటల్లో 3034 లీటర్ల రక్తాన్ని సేకరించి చరిత్ర సృష్టించింది. అది రక్తదానంలో అదో గిన్నిస్ వరల్డ్ రికార్డు. ఇంతవరకు దాన్నెవరూ బ్రేక్ చేయలేదు. ఆ బృందంలోని వాలంటీర్ లతా అమాషి.64 ఏండ్ల ఈ మహిళ 17 ఏండ్లుగా నిరాదరణకు గురవుతున్న వారికి సేవ చేస్తోంది. తన శక్తి, మార్పుకోసం అంకితభావంతో మహిళలు ఏదైనా చేయగలరని నిరూపిస్తోంది.**

ఢిల్లీలో పుట్టి పెరిగిన లత తల్లిదండ్రులు కర్ణాటకకు చెందినవారు. తండ్రి యునైటెడ్ నేషన్స్‌లో సీనియర్ అధికారి. తల్లిదండ్రులు ఇద్దరూ సామాజిక సేవలోనే ఉన్నారు. ఏదో చేయాలన్న తపన బాల్యం నుంచే ఉంది. ఫైనాన్స్‌లో డిగ్రీ పూర్తి చేయగానే కొంతకాలంపాటు సిండికేట్ బ్యాంక్‌లో పనిచేసింది. సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగానే... స్థానిక మార్కెట్లకు వెళ్లి... తను పొదుపు చేసిన డబ్బులతో అక్కడి వాళ్ల పిల్లలకు ఫీజులు చెల్లించేది. కుటుంబ బాధ్యతల వల్ల ఉద్యోగాన్ని వదిలేయాల్సి వచ్చింది. బెంగళూరు యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరింది. అది మళ్లీ ఆమె క్షేత్ర స్థాయిలో సేవలందించడానికి ఉపయోగపడింది. బెంగళూరు రావడంతోనే... రోటరీ క్లబ్‌లో చేరింది. అంధత్వంతో ఉన్నవారికి చూపు తెప్పించేందుకు కృషి చేసింది. ఎనిమిదేండ్ల కాలంలో 30వేల కాటరాక్ట్ సర్జరీలు చేయించింది. కమ్యూనిటీస్‌లో పనిచేస్తుండగా రక్త అవసరాన్ని గుర్తించింది. బెంగళూరు వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసింది. రోటరీ క్లబ్‌లో రకరకాల కార్యక్రమాలు ఉంటాయి. కానీ రక్తదానాన్ని మాత్రం సీరియస్‌గా తీసుకుంది. టీటీకే బ్లడ్‌బ్యాంక్‌తోకలిసి రక్తదానం, పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలకు సహాయం అందించడం కొనసాగించింది. బైకర్ అసోసియేషన్ నుంచి ఆటో డ్రైవర్స్ వరకు... చిన్న దర్జీ కూడా ఆమె ఏర్పాటు చేసే రక్తదాన శిబిరాల్లో పాల్గొనేవారు.

అలా ఒకరోజు క్యాంప్‌లో ఉండగా ఓ పదేండ్ల బాబుకు డెంగ్యూ సోకింది. హాస్పిటల్లో చావు బతుకుల మధ్య ఉన్నాడు. వెళ్లి కలిసింది. అంతకుముందే ఆమె గురించి తెలిసిన బాబు... 'నా బర్త్‌డే కేక్ కావాలి' అని ఆమెను అడిగాడు. ఐసీయూలో పుట్టిన రోజు వేడుకలా కుదరదంటే కుదరదన్నాయి హాస్పిటల్ వర్గాలు. పట్టుబట్టి కేక్ తెచ్చి బాబు బర్త్‌డే జరిపించింది. కానీ పరిస్థితి విషమంగా ఉండటంతో తెల్లారే అ బ్బాయి మరణించాడు. ఆ ఘటన ఆమెను కుదిపేసింది. ఆపదలో ఉన్నవారికి చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుంది. స్థానికంగానే కాదు... తన పరిచయాలతో స్థానికంగానే కాదు... ఇతర రాష్ట్రాల్లోనూ రక్తదానం నిర్వహిస్తున్నది. అయితే 'పదేండ్ల కిందట తాను రక్తదానం కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నానో ఇప్పుడు అదే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజల్లో రక్తదానానికి సంబంధించిన అవగాహన పెంపొందడం లేదు' అంటోందామె. రోటరీ క్లబ్ బెంగళూరు రక్తదానానికి ఆమె ఛైర్ పర్సన్. ఒక్క ఫోన్ కాల్‌చేస్తే చాలు.. ఇట్లా రక్తం అందించి సాయపడుతోంది. డయాబెటిస్‌పై అవగాహన కల్పించడం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వీటన్నింటికోసం రోటరీ క్లబ్ సొంత సాయం చేస్తుంది. మిగిలినదంతా తన బ్యాంక్ బ్యాలెన్సు నుంచే తీస్తోందామె. ఇప్పటిదాకా 15 లక్షల సొంత డబ్బులను ఉపయోగించింది. దాంతో కుటుంబం నుంచి కొంత వ్యతిరేకత కూడా మొదలైంది. అయినా ఆమె వెనుకడుగు వేయలేదు. తలసేమియా రోగులకోసం స్టెమ్ సెల్ రీసర్చ్ కూడా మొదలుపెట్టింది. బోన్‌మారో డొనేషన్ కోసం ప్రయత్నిస్తోంది.

'ఎవరైనా వచ్చి ఏదైనా అడిగితే 'నో' చెప్పడం నాకు తెలియదు. నా ఆరోగ్యం సహకరించినంతవరకు నేను ఇతరులకు సాయం చేయాలనుకుంటున్నా. ఇతరులకు మరో జీవితాన్ని అందించడానికి మించిన ఆనందం మరేముంటుంది' అంటుంది లతాజీ! ❄







**జీవితమంటే ఆనందం... ఆనందమంటే ఆరోగ్యం. ఆరోగ్యమంటే రకరకాల వంటకాలను ఆస్వాదించడం. సాయంత్రం కాగానే రోడ్డు పక్కన చిరుతిళ్లు తినడానికి ఇష్టపడతారు చాలా మంది. వాటి వాళ్ల ఆరోగ్యం త్వరగా పాడవుతుంది. కాబట్టి ఇంట్లోనే రుచికరమైన వంటకాలను పరిచయం చేస్తే ఆసక్తిగా అందరూ తినిపెడతారు. అలాంటి టేస్టీ స్నాక్స్ మీ కోసం... ఓ సారి ప్రయత్నించి చూడండి!**

# సాయంత్రం సరదాగా...

## వెజిటబుల్ మంచూరియా...



**కావాల్సిన పదార్థాలు:** క్యారెట్ తురుము–ఒక కప్పు, క్యాబేజ్ తురుము–ఒక కప్పు, క్యాప్సికం ముక్కలు–సగం కప్పు, ఉప్పు–తగినంత, ఉల్లిపాయ ముక్కలు–సగం కప్పు, అల్లం, వెల్లుల్లి పచ్చిమిర్చి పేస్టు–కొద్దిగా, స్ప్రింగ్ ఆనియన్స్ ముక్కలు–సగం కప్పు, కొత్తిమీర–కొద్దిగా, సోయాసాస్–రెండు చుక్కలు, అజీనామోటో–చిటికెడు, మైదా పిండి–ఒక కప్పు, కార్న్ ఫ్లోర్–రెండు చెంచాలు, నూనె–సరిపడా, అల్లం, వెల్లుల్లి ముక్కలు–కొద్దిగా, టమాటా సాస్.

**తయారీ విధానం:** ముందుగా ఒక మిక్సింగ్ బౌల్ తీసుకొని దాంట్లో క్యాబేజ్ తురుము, క్యారెట్ తురుము, సన్నగా తరిగిన క్యాప్సికం ముక్కలు, అల్లం, వెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయ ముక్కలు, చిటికెడు అజీనా మోటో, కొద్దిగా ఉప్పు, సోయాసాస్ రెండు చుక్కలు, మైదా పిండి, కార్న్ ఫ్లోర్ వేసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నూనె పోసుకోవాలి. అది కాస్త వేడి కాగానే దాంట్లో మంచూరియా ఉండలు వేయించుకోవాలి. ఆ తర్వాత మరో స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో అల్లం, వెల్లుల్లి ముక్కలు, కొద్దిగా సోయాసాస్, టమాటా కెచప్, కొన్ని నీళ్లు, కొద్దిగా ఉప్పు కలపాలి. ఈ మిశ్రమం కాస్త చిక్కబడగానే ముందుగా నూనెలో వేయించుకున్న మంచూరియాను వేసుకోవాలి. చివరగా స్ప్రింగ్ ఆనియన్స్ ముక్కలు, కొత్తిమీర తురుము, ఉల్లిముక్కలతో గార్నిష్ చేస్తేచాలు వెజ్ మంచూరియా రెడీ!

## బ్రెడ్ పకోడ...



**కావాల్సిన పదార్థాలు:** సోంపు–ఒక చెంచా, ధనియాలు–ఒక చెంచా, ఎండు మిర్చి–రెండు, ఉప్పు–తగినంత, జీడి పప్పు ముక్కలు–కొద్దిగా, కరివేపాకు రెమ్మలు–రెండు, పుదీనా– ఆకులు, కొత్తిమీర తురుము–కొద్దిగా, శనగ పిండి–ఒక కప్పు, బేకింగ్ సోడా–చిటికెడు, వెన్న–మూడు చెంచాలు, బ్రెడ్ ముక్కలు–నాలుగు.

**తయారీ విధానం:** బ్రెడ్ పకోడ తయారు చేసేకన్న ముందు ఒక మసాలా పొడిని తయారు చేసుకోవాలి. దానికి కొద్దిగా సోంపు, ధనియాలు, ఎండు మిర్చి, ఉప్పు వేసి గ్రైండ్ చేసుకోవాలి. ఆ మసాలా పొడిలో జీడిపప్పు, కరివేపాకు, పుదీనా, కొత్తిమీర తురుము వేసి కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక బౌల్ లో శనగ పిండి, కొద్దిగా ఉప్పు, బేకింగ్ సోడా చిటికెడు, వెన్న, నీళ్లు పోసుకొని చిక్కగా పిండి కలుపుకోవాలి. ఆ తర్వాత బ్రెడ్స్ తీసుకొని సైడ్స్ కట్ చేసుకోవాలి. చివరగా బ్రెడ్‌ను నాలుగు ముక్కలుగా చేసుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత శనగ పిండిలో ముంచాలి. చివరగా మసాలా పొడిని బ్రెడ్‌కు అద్ది పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ఇక స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో బ్రెడ్ ముక్కలను దోరగా వేయించుకుంటే చాలు బ్రెడ్ పకోడ రెడీ!

## పెరుగు సగ్గు బియ్యం వడలు...



**కావాల్సిన పదార్థాలు:** పెరుగులో నానబెట్టిన సగ్గు బియ్యం–ఒక కప్పు, క్యారెట్ తురుము–కొద్దిగా, సన్నగా తరిగిన కరివేపాకు–కొద్దిగా, వెల్లుల్లి–కొద్దిగా, ఉప్పు–తగినంత, కొత్తిమీర–తురుము, సన్నగా కట్ చేసిన పచ్చిమిర్చి–మూడు, కారం–ఒక చెంచా, ఉల్లిపాయ–ఒకటి, అల్లం ముక్కలు–కొద్దిగా, బియ్యం పిండి–కొద్దిగా, నూనె– వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం:** పెరుగులో ఎనిమిది గంటలు నానబెట్టిన సగ్గు బియ్యంలో క్యారెట్ తురుము, కరివేపాకు తురుము, వెల్లుల్లి పేస్టు, ఉప్పు, కొత్తిమీర, పచ్చిమిర్చి, కారం, ఉల్లిపాయ ముక్కలు, అల్లం ముక్కలు, బియ్యం పిండి వేసి మెత్తగా కలుపుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి దాంట్లో నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో ముందుగా తయారు చేసుకున్న పిండిని వడలు వేసుకుంటే సరిపోతుంది. సగ్గు బియ్యం వడలకు అంచుకు చట్నీ పెట్టుకొని తింటే చాలా రుచిగా ఉంటాయి.

## ఫ్రైడ్ మిల్క్...



**కావాల్సిన పదార్థాలు:** పాలు–200 మి.లీ, కార్న్ స్టార్చ్–35 గ్రా॥, చక్కెర–40 గ్రా॥, బటర్–ఒక కప్పు, జాజికాయ పొడి–చిటికెడు, నిమ్మరసం–చిటికెడు, నూనె– వేయించుకోవడానికి సరిపడా, గుడ్డు–ఒకటి, బ్రెడ్ పౌడర్– కొద్దిగా.

**తయారీ విధానం:** ముందుగా స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి దాంట్లో పాలు, కార్న్ స్టార్చ్, చక్కెర, బటర్, జాజికాయ పొడి వేసి పాలను చిక్కగా మరిగించుకోవాలి. కాస్త చల్లారాక దాంట్లో నిమ్మరసం కలుపుకొని మరో పాత్రలోకి మార్చుకోవాలి. పాల మిశ్రమాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. మరో పాత్రలో గుడ్డును బాగా కలుపుకోవాలి. ఇలా చేసుకున్న గుడ్డు మిశ్రమంలో చిన్నగా కట్ చేసుకున్న ముక్కలను ముంచి బ్రెడ్ పొడిని చల్లుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత నూనెలో వేయించుకుంటే సరిపోతుంది. చివరగా ఫ్రైడ్ మిల్క్ మీద చక్కర పొడి, యాలకుల పొడితో గార్నిష్ చేసుకుంటే సరి!

# పనులు నేర్పించండి...



**చిన్నారులకి ఏ పనులు చెప్పకుండా, అసలు కష్టం తెలియకుండా పెంచుతున్నారు ఈ తరం. దీనివల్ల పిల్లలు పెరుగుతున్న పనులు బాధ్యత తెలియకుండా పోతోంది. పనుల్లో భాగస్వాముల్ని చేయడం వల్ల మీ కష్టం అర్థం కావడం మాత్రమే కాదు.... వ్యక్తిత్వ పాఠాలు నేర్చుకుంటారు.**

- పిల్లల్ని ఒక్కసారిగా 'నువ్వు ఈ పని చెయ్.. ఆ పని చెయ్' అని ఆర్డర్లు వేయకూడదు. వారికి అసలు అమ్మగా మీ దిన చర్య ఏంటో తెలియజేయాలి. చిన్నారులకి అన్నీ అమర్చి.. సమయానికి బడికి పంపుతున్నారంటే దాని వెనక పడే కష్టం వారికి అర్థమయ్యేలా చూడాలి. అలా వివరించే క్రమంలో చిన్నారులు అడిగే సందేహాలను తప్పకుండా తీర్చాలి. అంతేకాదు ఇంటి పనుల కోసం ఎలాంటి ప్రణాళిక వేసుకుంటారు. అందుకోసం అన్నీ ఎలా సమన్వయం చేసుకుంటారనేది వాళ్లకి అర్థమయ్యేలా చూడాలి.
- ఎలాంటి పనులు చిన్నారులు చేయొచ్చో వారికి తెలియజెప్పాలి. తమ గది తాము సర్దుకోవడం, దుస్తులు మడత పెట్టుకోవడం... దగ్గర్లో ఉన్న దుకాణానికి వెళ్లి కావల్సినవి కొనుక్కురావడం, కూరగాయలు కడగడం, కోసివ్వడం.. పుస్తకాలూ, పత్రికలూ ఒక క్రమ పద్ధతిలో సర్దడం, మొక్కలకు నీళ్లుపోయడం.. వంటివి చేయొచ్చని వివరించాలి.
- ముఖ్యంగా పిల్లలకు పోటీలూ, బహుమతులూ అంటే చాలా ఇష్టపడతారు. మీ ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే గనుక మీలో ఎవరు ఫలానా పని త్వరగా చేస్తారో చూద్దాం అంటూ చిన్న పోటీ పెట్టండి. 'నేను చేస్తా.. నేను చేస్తా' అంటూ పనిలో నిమగ్నమవుతారు. అలా చిన్నారులు ఏ పనిచేసినా వెంటనే 'ఎంత బాగా చేశావో..' అంటూ పొగిడినా, చిన్న బహుమతి ఇచ్చినా.. వారిలో ఉత్సాహం మరింత రెట్టింపవుతుంది.
- పిల్లలకు ఏదైనా పని అప్పగించినప్పుడు... ఒక్కోసారి పొరబాటు చేయొచ్చు. అలాంటప్పుడు వారి మీద అరిచి కోప్పడితే పనుల్లో భాగస్వాములు కావడానికి ఆసక్తి చూపరు. పొరబాటుకి కారణం అడిగి ఎంత జాగ్రత్తగా చేయాలో వివరించాలి.
- మీ చిన్నారికి బ్రెడ్ శాండ్‌విచ్, పండ్లతో సలాడ్స్ వంటి సాయంకాలపు అల్పాహారం తయారుచేసేటప్పుడు అదెలా చేస్తున్నారో చూపించండి. అలాగే పండ్ల రసం తయారీలో కూడా పండ్లను శుభ్రపరచడం వంటి చిన్నచిన్న పనులు వాళ్లతో చేయించాలి. దీని ద్వారా శుభ్రతతో పాటు పనిని పంచుకోవడం కూడా అలవడుతుంది.
- టిఫిన్ లేదా భోజనం ముగించిన తరువాత వారి పళ్లాలను వారే సింకులో పెట్టడం నేర్పించాలి. అలాగే భోజనబల్లపై మంచినీళ్లు, పళ్లాలు సర్దడం వంటి చిన్నచిన్న పనులను వారికి అలవాటు చేయాలి.
- మీరు పెంచే మొక్కలకు సాయంత్రం పూట నీళ్లు పోయమని చెప్పండి. అలాగే వాటికి పూలు, కాయలు వస్తే, వారి వల్లే ఆ మొక్క ఆరోగ్యంగా ఉందని ప్రశంసించండి. వారి మనసుల్లో మొక్కలపై ప్రేమ మొదలవుతుంది. ఆ తరువాత మరిన్ని రకాల మొక్కలను పెంచుదామని వారే మిమ్మల్ని అడుగుతారు.
- పాఠశాల నుంచి వచ్చిన వెంటనే విడిచిన దుస్తులు, పుస్తకాల సంచీ, బూట్లూ వంటివాటిని ఎక్కడపడితే అక్కడ కాకుండా, ఓ చోట సర్దేలా అలవాటు చేయండి. భవిష్యత్తులో వారికి ఇదొక క్రమశిక్షణ అవుతుంది. మీకు పని తగ్గుతుంది, వారి పుస్తకాల బీరువాను నెలకొకసారి సర్దుకోవడం వారికి నేర్పించండి. అలాగే ఇంట్లో ఎక్కడ్కైనా చెత్త ఉంటే తీసి చెత్తబుట్టలో వేయించండి. ఇవి వారిని ఓ క్రమశిక్షణ ఉన్న వ్యక్తిగా తీర్చి దిద్దుతాయి. ❄

# కచ్చితంగా తినాల్సిందే కానీ...



జిమ్‌కు వెళ్లే ముందు కొంతమంది ఏమీ తినరు.. మరి కొందరు ఎలాగో కసరత్తులు చేస్తాం కదా అని ఇష్టమైన ఆహారం లాగించేస్తారు. కానీ ఆ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే జిమ్ ప్రయోజనం ఉండదు.

- ఓట్స్‌ను తీసుకోవడం వల్ల పిండిపదార్థాలు శరీరంలోకి నెమ్మదిగా విడుదలవుతాయి. అంటే కసరత్తులు చేస్తున్నంత సేపు ఉత్సాహంగా ఉండటానికి కావల్సిన శక్తి వస్తూ ఉంటుంది. ఒకేసారి అలిసిపోయినట్లు అనిపించదు. అందుకే జిమ్‌కు వెళ్లే ముందు ఒక గిన్నె నిండా ఓట్స్ తిని చూడండి.
- అరటిపండ్లలో పొటాషియం, త్వరగా జీర్ణమయ్యే పిండిపదార్థాలు పుష్కలంగా ఉంటాయి. పైగా కావల్సిన శక్తి కూడా అందుతుంది.
- గుడ్డులోని తెల్లసొన తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన మాంసకృత్తులు అందుతాయి. రెండు గుడ్ల తెల్లసొనలో 8 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి. పైగా కొవ్వు సమస్య ఉండదు.
- నిద్ర లేవగానే జిమ్‌కు వెళ్తుంటే ఖాళీకడుపున కాకుండా ఒక గిన్నెనిండా పెరుగు తిని చూడండి. దీనివల్ల శరీరం చురుగ్గా ఉంటుంది.
- గుడ్డు తినని వారు కూరగాయలూ, సెనగపిండీ కలిపి దోసెలా వేసుకుని తినొచ్చు. దీంట్లో వీలైనన్ని ఎక్కువ కూరగాయల ముక్కలు ఉండేలా చూసుకోవాలి.
- యాపిల్‌ముక్కలూ, పీనట్ బటర్ కలిపి తింటే ఒక కొత్త రుచి మన నోటికి పరిచయం చేసినట్లే. ఇవి తినడం వల్ల శరీరానికి కావల్సిన పిండిపదార్థాలూ, మాంసకృత్తులు శరీరానికి అందుతాయి. ❄

## అమ్మాయిలు సెల్‌ఫోన్ వాడొద్దు..

- మధ్యప్రదేశ్‌లోని మహా పంచాయితీ ఆదేశాలు

**భోపాల్ :** మహిళలు సెల్‌ఫోన్ వాడకంపై ఓ గిరిజన పంచాయితీ నిషేధం విధించింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని షోపూర్ జిల్లాలోని 27 గ్రామాల్లోని సహారా గిరిజనులకు చెందిన పంచాయితీ ఈ ఆదేశాలు జారీచేసింది. సమాజాన్ని సంస్కరించే పని పేరుతో పంచాయితీ సభ్యులు ఇటీవల పలు నిర్ణయాలు చేశారు. ఆ నిర్ణయాల్లో ఒకటి.. అమ్మాయిలు, మహిళలు ఫోన్ వాడకంపై నిషేధం. తమ ధిక్తాను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆ మహాపంచాయితీ నిర్ణయించింది. అమ్మాయి గానీ, మహిళగానీ.. ఫోన్‌వాడుతూ మొదటిసారి పట్టుబడితే భారీ జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే కమ్యూనిటీ నుంచి వెలివేయాలని నిర్ణయించారు. 'మొబైల్ ఫోన్లు మహిళలపై చాలా చెడు ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. మొదటిసారి పట్టుబడితే.. జరిమానా విధిస్తాం. రెండోసారి ఫోన్ వాడుతూ కనిపిస్తే సమాజం నుంచి వెలివేసేందుకు కూడా వెనుకాడం' అని 27 గ్రామాలకు చెందిన మహా పంచాయిత్ సభ్యుడు రామ్ స్వరూప్ అద్వాసీ చెప్పారు. 'మా పంచాయితీ గత నెలలో మూడు సార్లు సమావేశమైంది. మద్యంపై కూడా నిషేధం విధించాం. విద్యా అవసరంపై అవగాహన పెంచాలని కూడా నిర్ణయం చేశాం' అన్నారు.

## టోల్‌ప్లాజా ఉద్యోగిని చితకబాదిన బీజేపీ నేత కుమారుడు

**మధుర :** ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేత, ఆయన కుమారుడు, మద్దతుదారులు కలిసి టోల్ ప్లాజాలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని మంగళవారం చితకబాదిన దృశ్యాలు సీసీటీవీలో చిక్కాయి. బీజేపీ ఎమ్మెల్యే పూర్ణ ప్రకాశ్ కారు టోల్ ప్లాజా మీదగావెళ్తుండగా ఒక బారికేడ్ కారు పై భాగాన పడింది. దీంతో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు, మద్దతుదారులు కారు నుంచి దిగి అక్కడ ఉన్న ఉద్యోగిని చితకబాదారు. ఈ సంఘటన మౌహన్ టోల్‌ప్లాజా వద్ద జరిగింది. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో ప్రకాష్ కారులోనే కూర్చున్నాడు. అంతే కాకుండా ఈ మొత్తం సంఘటనకు టోల్ ప్లాజా ఉద్యోగులే కారణమని ఆయన ఆరోపించారు.

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లను ముంచెత్తిన వర్షాలు

- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- నష్టాల్లో రైతులు

**భోపాల్ :** మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. గత రెండు రోజులుగా ఈ రెండు రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. వడగళ్ళు కూడా పడుతున్నాయి. మహారాష్ట్రలోని విదర్భ, మరత్వాడా ప్రాంతాలలోని ఉద్యాన పంటలపై భారీ వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. మధ్య ప్రదేశ్‌లోని దాదాపు 8 జిల్లాల్లో రబీ పంటలైన గోధుమ, శనగలపై కూడా వర్షాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. రెండు రాష్ట్రాల్లోను పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్య ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లోని దాదాపు 175 గ్రామాల్లో 95 శాతం పంట నష్టపోయింది. ముఖ్యంగా ద్రాక్ష, తీపి నిమ్మ పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. మహారాష్ట్రలో మొత్తం 46,474 హెక్టార్ల పంట దెబ్బతిన్నది. ఇందులో 43, 824 హెక్టార్లలో 33 శాతం పంట దెబ్బ తిన్నదని ఔరంగాబాద్ డివిజనల్ కమిషనర్ పురుషోత్తమ్ తెలిపారు. పొరుగునే ఉన్న మధ్య ప్రదేశ్‌లోని 400 గ్రామాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాయి.

**ప్రేమికుల రోజునా.. తప్పని దాడులు**

## పెండ్లికి నిరాకరించిందని యాసిడ్ దాడి

**జైపూర్ :** ప్రేమికుల రోజున విస్మయకర ఘటన చోటుచేసుకుంది. పెండ్లికి నిరాకరిండంతో ఓ మహిళపై ఆ దుర్మార్గుడు యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. రాజస్థాన్‌లోని జైపూర్ శివారు ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఆటో రిక్షా నడుపుకునే మహబూబ్ (41) ఈ దాడికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. మహబూబ్ ఇప్పటికే ఇద్దరికి విడాకులిచ్చాడు. మూడో వివాహం చేసుకోగా.. అక్రమ సంబంధాల కారణంతో మూడో భార్య కూడా అతడిని విడిచిపెట్టిందని చెప్పారు. ఆ తర్వాత మరో అమ్మాయి వెంట పడటం మొదలుపెట్టాడనీ, ఆమె పెండ్లికి నిరాకరించడంతో బుధవారం ఆమెపై యాసిడ్ పోశాడని పోలీసులు తెలిపారు. ఆమెకు 15 శాతం కాలిన గాయాలు కాగా, మహబూబ్‌కు కూడా 20 శాతం కాలిన గాయాలయ్యాయి. ఇద్దరికీ స్థానిక ఎస్ఎంఎస్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

**'గోరఖ్‌పూర్ దుర్ఘటన'లో**

## ఆక్సిజన్ సప్లయర్‌కు బెయిల్ నిరాకరణ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో పదుల సంఖ్యలో చిన్నారులు చనిపోయిన కేసులో ఆక్సిజన్ సప్లయర్ మనీశ్ బండారికి బెయిల్ ఇచ్చేందుకు అలహాబాద్ హైకోర్టు నిరాకరించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున అతడికి బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ యశ్వంత్ వర్మ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. గతేడాది ఆగస్టులో బీఆర్‌డీ ఆస్పత్రిలో వారం రోజుల్లోనే 60 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కృత్రిమ ఆక్సిజన్ అందకే చిన్నారులు చనిపోయారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆస్పత్రికి ఆక్సిజన్‌ను సప్లయ్ చేస్తున్న పుష్పా సేల్స్ కంపెనీకి ఇచ్చే బిల్లులు పెండింగ్‌లో ఉండటమే దీనికి కారణమని తెలిసింది. ఈ నేపథ్యంలోనే పుష్పా సేల్స్ యజమాని బండారిని పోలీసులు అరెస్టు చేశారు.

దళిత విద్యార్థి హత్య కేసు

## ప్రధాన నిందితుడి అరెస్టు

**లక్నో :** న్యాయ శాస్త్ర దళిత విద్యార్థిని దారుణంగా హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు విజయ్ శంకర్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తానాపూర్‌లో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు అలహాబాద్ జోన్ అడిషనల్ డైరెక్టర్ పోలీసు జనరల్ (ఏడీజీ) ఎస్ఎన్ సబత్ బుధవారం తెలిపారు. న్యాయశాస్త్ర విద్యార్థి దిలీప్ సరోజ్ (26)ను హత్య చేసేందుకు ఉపయోగించిన ఐరన్ రాడ్, ఇటుక రాయిని నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్ననట్టు తెలిపారు. సుల్తానాపూర్‌లో చంద్ర భద్ర సింగ్ అనే రాజకీయ నాయకుడి నివాసంలో తలదాచుకున్న శంకర్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. జ్ఞాన ప్రకాష్ అవస్తి, రామ్‌దీన్ మౌర్య, మున్నా చౌహాన్‌అనే ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేశారు. గత వారంలో ఒక రెస్టారెంట్ వద్ద ఒక చిన్న విషయమై ఘర్షన జరిగిన నేపథ్యంలో విజయ్ శంకర్ నేతృత్వంలో నలుగురు దుండగులు సరోజ్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిలో తీవ్రంగా గాయపడిన సరోజ్ కోమాలోకి వెళ్ళి తరువాత మృతి చెందాడు. సరోజ్‌పై దాడి చేస్తున్న సంఘటనను అటుగా పోతున్న ఒక వ్యక్తి కెమెరాలో చిత్రీకరించాడు. అది సామాజిక మాధ్యమంలో వైరలై అయ్యింది.

## అమెరికాలో కాల్పుల కలకలం

- ఇద్దరు మృతి, ముగ్గరికి గాయాలు

**వాషింగ్టన్:** అమెరికాలో కాల్పుల కలకలం రేగింది. న్యూ ఓర్లీన్స్‌లోని లోవర్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్ప త్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సెయింట్ క్లాడ్ ఎవెన్యూ 5100 బ్లాక్ సమీపంలోని పెట్రోల్ పంపు పక్కన ఆగి ఉన్న కారులో ఓ మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనకు ముందు కొందరు వ్యక్తులు అక్కడ ఘర్షణ పడినట్టు స్థానికులు పేర్కొన్నారు. అయితే వారెందుకు ఘర్షణ పడ్డారన్న విషయంపై స్పష్టత రాలేదని, దాడికి పాల్పడిన వారిని ఇంకా గుర్తించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

## సుబాబుల్ రైతులను పట్టించుకోవాలి : మంత్రి తుమ్మల

**నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్**

సుబాబుల్ రైతుల కష్టాలు, మద్దతు ధరపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఇందులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐ.టి.టి.టి.సి అధికారులు, ఖమ్మం ఎం.పీ. శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మదన్‌లాల్, పలువురు సుబాబుల్ రైతులు పాల్గొన్నారు.



# హోదా... గోదా!

### రాష్ట్రంలో రాజకీయ వేడి

- పైచేయి కోసం పరస్పర విమర్శలు
- కేంద్రం ప్యాకేజీ ఇస్తుందన్న నమ్మకం ఉంది : చంద్రబాబు
- ప్రజల్ని టీడీపీ మోసం చేస్తోంది : వైసీపీ
- అంబానీ రాకతో మారిన టీడీపీ తీరు

**అమరావతి :** వైసీపీ ఎంపీల రాజీనామా ప్రకటనతో రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాజకీయంగా పై చేయి సాధించేందుకు టీడీపీ, వైసీపీలు పరస్పర ఆరోపణలకు దిగుతున్నాయి. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఇరు పార్టీల నేతలు పోటీలు పడి విమర్శలకు దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదు కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పాదయాత్రలో ఉన్న వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అంటే చంద్రబాబుకు భయమని, అందువల్లే తెలుగుదేశం పార్టీ ప్రత్యేకహోదా అంటే భయపడుతోందని, చట్టం ప్రకారం రావాల్సిన నిధులను గట్టిగా అడగడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మాట్లాడిని వైసీపీ నేతలు ఆరోపించారు. మరోవైపు టీడీపీ మంత్రులు, ఎంపీలు వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**నమ్మకం ఉంది ... అయినా పోరాటం :సీఎం**

బుధవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. టీడీపీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వంపై తమకు ఇప్పటికీ నమ్మకం ఉందని చంద్రబాబు అన్నారు. ' ప్రత్యేక ప్యాకేజిని కేంద్రం ఇస్తుందన్న నమ్మకం ఉంది. అయినా, దీనికోసం నిరంతర పోరాటం చేస్తాం' అని ఆయన ఈ సమావేశంలో చెప్పారు. ప్రత్యేకహోదా రాష్ట్ర ప్రజల హక్కని ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో ప్యాకేజి వస్తుందంటూ బాబు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మకం ఉందంటూనే పోరాటం చేయాలనడం దేనికి సంకేతమన్న ప్రశ్నలూ వస్తున్నాయి. ఈ సమావేశం తరువాత మీడియాతో మాట్లాడిన పలువురు మంత్రులు, టీడీపీ నేతలు కూడా ఇదే విధంగా స్పందించారు. అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి చంద్రబాబు అంటే మోడీకి ద్వేషమని వ్యాఖ్యానించడం విశేషం. గతంలో తృతీయ ఫ్రంట్‌ను నిర్వహించిన అనుభవం బాబుకు ఉందని, భవిష్యత్‌లో బాబు తనకు పోటీ అవుతారని మోడీ భావిస్తుండవచ్చని ఆయన అన్నారు.

**మార్చి 5 తరువాత ఊహించని నిర్ణయం : మంత్రులు**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడిన మంత్రులు అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి, నక్కా ఆనందబాబు, గంటా శ్రీనివాసరావులు వైసీపీ పై విరుచుకుపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వైసీపీ రాజీనామాల అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చిందని వారు అన్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్ 6వ తేదివరకు ఆగాల్సిన అవసరం లేదని, తక్షణమే రాజీనామాలు చేయాలని అన్నారు. తాము వైసీపీ మాదిరి డ్రామాలు ఆడమని చెప్పిన వారు, సరైన సమయం కోసం ఎదురు చేస్తున్నామని, ఆ సమయం రాగానే సరైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మార్చి 5 తరువాత ఊహించని నిర్ణయాలు ఉంటాయని వారు తెలిపారు.

**టీడీపీకి భయం పట్టుకుంది : వైసీపీ**

ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కని, దానికోసం ఎంత పోరాటం చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని నెల్లూరు జిల్లా పాదయాత్రలో ఉన్న వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో మాట్లాడిన ఆ పార్టీ నేతలు తమ ఎంపీల రాజీనామాల ప్రకటనతో తెలుగుదేశం పార్టీకి భయం పట్టుకుందని వ్యాఖ్యానించారు. హోదా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు రాజీనామాల నిర్ణయాన్ని ప్రకటించామని అంబటి రాంబాబు తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు. ఆంధ్రుల పౌరషాన్ని చాటిచెప్పేందుకే రాజీనామాల నిర్ణయం తీసుకున్నామని, దీంతో తెలుగుదేశం పార్టీకి భయం పట్టుకుందని ఎంపీ వైవి సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. మరో నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ బడ్జెట్ పై మాట్లాడటానికి చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

**అంబాని పర్యటనతో మారిన టీడీపీ వైఖరి**

కేంద్రంపై నమ్మకం ఉందంటూ ముఖ్యమంత్రితో పాటు, పలువురు మంత్రులు బుధవారం మాట్లాడటం వెనుక ముఖేశ్ అంబాని ప్రభావం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అంబాని మంగళవారం అమరావతికి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన పర్యటనకు ముందు టీడీపీ నేతలు కొంతమేరకైనా గట్టిగా మాట్లాడారని, బుధవారం వారి తీరు పూర్తిగా మారిందన్న అభిప్రాయాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

# అర్చకుల ఆకలి కేకలు

- 16న ఏపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం
- కనీస వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు: అర్చక సంక్షేమ నిధి ఏర్పాటుకై డిమాండ్



తిరుపతి గంగమ్మ గుడి ఎదుట నల్లరిబ్బన్లతో నిరసన తెలియజేస్తున్న అర్చకులకు మద్దతు తెలియజేస్తున్న సిటు నాయకులు సుబ్రమణ్యం (ఫైల్)

**తిరుపతి:** దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు కనీస వేతనాల్లేక అర్ధాకలితో అర్చకత్వ విధులను నిర్వహిస్తున్నారు. చాలీచాలని ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టసాధ్యంగా మారిందని, తెలంగాణా తరహాలో తమకూ పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ బాట పట్టారు. ఈ నెల 16 రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. రాష్ట్రంలో 23 వేల ఆలయాలు ఉన్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ వెల్లడిస్తోంది. వీటిలో విజయవాడ కనకదుర్గ, శ్రీకాళహస్తీశ్వర, కాణిపాక వరసిద్ధి వినాయక, శ్రీశైలం మల్లికార్జున, ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వర, సింహాచల నరసింహ, అన్నవరం సత్యనారాయణ, మహానంది వంటివి ప్రధాన ఆలయాలు కాగా.. ఏడాదికి రూ. 25 లక్షల నుంచి కోటి పైబడి ఆదాయం వచ్చే ఆలయాలు 115 ఉన్నాయి. రూ. 2 లక్షల నుంచి రూ.25 లక్షల లోపు ఆదాయం వచ్చేవి 794 ఉండగా, రూ.2 లక్షలకు లోపు వచ్చేవి 22,788 ఆలయాలు ఉన్నట్లు అధికారిక అంచనా. ఇవి కాకుండా ధూపదీప నైవేద్య పథకం కింద మరో 1,406 ఆలయాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిలోనూ లక్షా10 వేల మంది అర్చకులున్నట్లు ఎపి అర్చక సమాఖ్య వెల్లడిస్తోంది.

**సమాన పనికి సమాన వేతనం ఎక్కడ?**

కోటి రూపాయల పైబడి ఆదాయం వస్తున్న 8 ప్రధాన ఆలయాల్లో మాత్రమే అర్చకులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం వస్తోంది. 25 లక్షలకు పైబడి ఆదాయం వస్తున్న ఆలయాల్లో రూ. 7 వేల నుంచి 15 వేల వరకు జీతం ఇస్తున్నారు. మిగిలిన 22 వేల ఆలయాల్లో అర్చకులకు కేవలం రూ.3 వేల నుంచి రూ.6 వేలు మాత్రమే వస్తోంది. ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తున్న ఆలయాల్లో అర్చకుల వేతనంతో పాటు పూజా సామగ్రి, నైవేద్యం అన్నింటికీ కలిపి నెలకు కేవలం రూ. 5 వేలు అందుతోంది. ఈ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకు రూ. వెయ్యి కూడా వేతనంగా మిగలకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచకవడంపై అర్చకులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమయ్యారు. అర్చక సమాఖ్య జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. 16న విజయవాడలో అర్చక ఆత్మావలోకన సదస్సును నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను పెద్దఎత్తున చేపట్టేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం.

**తెలంగాణ తరహాలో పీఆర్‌సీని అమలు చేయాలి – పెద్దింటి రాంబాబు, అర్చక సమాఖ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలోనే అర్చకులందరికీ 2015 పీఆర్‌సీని అమలు చేయాలి. అర్చకులందరికీ సమాన వేతనాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ఈ ప్రభుత్వానికి, పాలకులకు పట్టకపోవడం దురదృష్టకరం. నిత్యం భగవంతుని సేవలో తరించే వేలాది మంది అర్చకులు మూడుపూటలా తినే పరిస్థితిలేక పస్తులు ఉంటున్నారు. ధూపదీప నైవేద్య పథకం ద్వారా ఒక్కో ఆలయానికి 5 వేలు ఇస్తే ఏం సరిపోతుంది?. పూజా కైంకర్యం, ప్రసాదాలకే రూ.4 వేల నుంచి రూ. 4,500 వరకూ ఖర్చవుతోంది. మిగిలిన రూ. 500లతో అర్చకులు ఎలా బతకాలి? ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణా తరహా అర్చకులందరికీ పే స్కేల్ ఇవ్వాలి.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ల వేతనం పెంపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల కమిషనర్‌ల వేతనాలు దాదాపు రెండున్నర రెట్లు పెరిగాయి. ఇప్పటివరకు నెలకు రూ. 90,000గా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ సహా మరో ఇద్దరు కమిషనర్ల జీతం రూ. 2.5లక్షలకు పెరిగింది. వీరందరికీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానమైన వేతనం చెల్లించాలని 1991నాటి ఎన్నికల సంఘం చట్టం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వేతనం పెంచిన నేపథ్యంలో అవే నిబంధనలను కేంద్ర ఎన్నికల సంఘం సైతం అమల్లోకి తెచ్చింది. 2016 జనవరి 1 నుంచి వేతన పెంపును వర్తింపచేయాలని నిర్ణయించింది. ఫలితంగా మాజీ ఎన్నికల కమిషనర్లకు సైతం లబ్ది చేకూరనుంది.

## వామపక్షాలకు జనసేన అధినేత ఫోన్



**హైదరాబాద్:** విభజన హామీల సాధన విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన పోరాటాన్ని స్పీడు పెంచారు. ఇప్పటికే లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు మేధావులు, విశ్లేషకుల అభిప్రాయాలు సేకరిస్తూ వారితో సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్న పవన్ తాజాగా ఏపీ సీపీఐ(ఎం)ఏపీ సీపీఐ, రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, రామకృష్ణలకు ఫోన్ చేశారు. నిజనిర్ధారణ కమిటీ వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 16న హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# బ్యాంకుల్లో డబ్బుల్లేవ్

- అష్టకష్టాలు పడుతున్న సామాన్య జనం
- సమస్యపై వివరాలు సేకరిస్తున్న సీఎం పేషీ
- సత్వర చర్యలకు ఆర్థిక శాఖకు ఆదేశాలు
- బాదుడు వద్దంటూ రిజర్వ్‌బ్యాంకుకు విజ్ఞప్తులు




**అమరావతి:** బ్యాంకుల్లో నగదు కొరత రాష్ట్ర ప్రభుత్వాన్ని వేధిస్తోంది. ఏటీఎంలలో నగదు లేకపోవడం, ఖాతాల్లో ఉన్న నగదుపై బ్యాంకులు విధిస్తున్న ఆంక్షలు, సర్‌చార్జీల రూపంలో అదనపు వసూళ్ల జనంపై భారంగా మారిపోతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనం నుంచి ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు కూడా వాస్తవ పరిస్థితులపై నివేదికల్ని సిద్ధంచేశారు. ముఖ్యంగా మూడు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారుల నుంచి వచ్చిన నివేదికలతో వాస్తవాలు వెలుగులోకొస్తున్నాయి. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉన్నట్లు గుర్తించడంతో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అందుకే తక్షణమే అప్రమత్తం కావాలని నిర్ణయించింది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే దీనిపై స్పందించడం గమనార్హం. ఇదే సమయంలో కేంద్రం ప్రవేశపెట్టనున్న ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న భయాన్ని కూడా ప్రభుత్వం వ్యక్తంచేస్తోంది. ప్రజల సమస్యలపై కాకుండా కేంద్రం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుకు ఎక్కడ ఇబ్బందులు కలుగుతాయోనన్న ఆందోళనే రాష్ట్ర ప్రభుత్వంలో కనిపిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఆ మూడు జిల్లాల్లో పరిస్థితి మరింత దిగజారకుండా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు రిజర్వ్‌బ్యాంకుతో చర్చించాలని ఆర్థికశాఖ అధికారుల్ని సీఎంఓ ఆదేశించింది. ఇవే అంశాల్ని నేరుగా రిజర్వ్‌బ్యాంకు దృష్టికి, తద్వారా కేంద్రానికి వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఆర్థికశాఖకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక ఆదేశాల్ని కూడా జారీచేసింది. అధికారులు తయారుచేసిన నివేదిక, వివిధ జిల్లాల్లో బ్యాంకర్ల నుంచి అందుతున్న వివరాల మేరకు కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లోని బ్యాంకుల్లో నగదు కొరత ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఒక్కో జిల్లాలో రోజుకు 50 కోట్ల వరకు ఏటీఎంల ద్వారా లావాదేవీలు జరుగుతుండగా, అందులో 40 శాతం వరకు స్టేట్ బ్యాంకు ఎటిఎంలలోనే జరుగుతున్నాయి. అయితే ఈ జిల్లాలకు రిజర్వ్‌బ్యాంకు నుంచి తక్కువ నిధులు వస్తున్నట్లు బ్యాంకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ నగదు వల్ల వినియోగదారులపై నియంత్రణ విధించడం, అనేక ఎటిఎంల వద్ద నగదు లేదు అంటూ బోర్డులు కనిపిస్తుండడంతో ప్రజల నుంచి కూడా విమర్శలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ పరిస్థితి మూడు జిల్లాలకే పరిమితం కాకుండా ఇతర జిల్లాల్లో కూడా నో క్యాష్ బోర్డులు తరచూ దర్శనమిస్తు న్నాయి. గత మూడు రోజులుగా రాజధాని నగరాలైన గుంటూరు, విజయ వాడల్లో కూడా స్టేట్‌బ్యాంకు ఎటిఎంలలో నగదు సమస్య తీవ్రంగా వేధిస్తోంది.

**సామాజిక పింఛన్లలపైనా..**

సామాజిక పింఛన్లు తీసుకుంటున్న వారి నుంచి కూడా వ్యతిరేకత మరింత ఎక్కువవుతోంది. ఖాతాల్లో కనీస నిల్వ 2500 రూపాయల వరకు ఉండాలన్న నిబంధన కూడా విమర్శలకు తావిస్తోంది. అదనంగా చేసుకుంటున్న విత్‌డ్రాయల్స్‌పైనా సర్‌ఛార్జీని వసూలు చేయడం, కనీస నిల్వ లేదంటూ అదనపు రుసుంను వసూలు చేయడంపైనా ఖాతాదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన స్థాయిలో నగదు ఆర్బీఐనుంచి రాకపోవడమేనని ఈ సమస్యలకు కారణమని బ్యాంకర్లు వివరిస్తున్నారు. అందుకే ప్రజలు కూడా తమ నగదును బ్యాంకుల్లో ఉంచడం కన్నా విత్‌డ్రా చేసుకోవడమే మంచిదన్న భావానికి కూడా వస్తున్నారు. ఇది బ్యాంకర్లలో కూడా వ్యాపార ఆందోళనకు కారణమవుతోంది.

**ఎఫ్‌ఆర్‌డీఐ కారణంగానే**

2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు సమయంలో నెలకొన్న పరిస్థితే నేడూ దర్శనమిస్తోంది. అప్పట్లో ఒక్క బ్యాంకులో కూడా నగదు లభించని పరిస్థితి నెలకొనగా, తరువాత కాలంలో కొంత పరిష్కరించగలిగారు. అయితే తాజాగా ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం తీసుకున్న చర్యలు మరోసారి నగదు కొరతకు దారితీస్తోంది. ఈ బిల్లు వల్ల నష్టం జరుగుతుందని సామాజిక మాధ్యమం, ఇతర ప్రసార సాధనాల్లో జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో నగదు కొరత తీవ్రమైంది.

# సీఎం ఢిల్లీ పర్యటనపై గోప్యతెందుకు?

- ఎంపీలకు సీఎం కేసీఆర్ సూచనలు
- ప్రధాని అపాయిమెంట్ అడిగిన ముఖ్యమంత్రి
- స్నేహహస్తం ఇస్తామని సంకేతాలు !
- నియోజకవర్గాల సంఖ్య పెంపుపైనే పట్టు
- కేంద్రమంత్రి సుజన మంతనాలు

**నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటనపై ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వం ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. వారం రోజులుగా ఢిల్లీలో ఎవరెవరిని కలుసుకున్నది ఎవరితో సమావేశం అయింది కూడా ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు తెలియజేయలేదు. సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళుతున్నారని వారం రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా తెలియజేసింది. దంత పరీక్ష కోసం ఢిల్లీ వెళుతున్నారని, దాంతో పాటు రాష్ట్ర సమస్యలపై అక్కడ కొంతమంది కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు అందిస్తారని మీడియాలో లీకులు వచ్చాయి. అంతకుమించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. అయినా ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనను రహస్యంగా ఉంచాల్సిన అవసరమేంటన్న చర్చ నడుస్తున్నది. అసలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏమైందన్న ఆందోళన కూడా ప్రజల్లో ఒకవైపు ఉంది. ఇలాంటి విషయాలను రహస్యంగా ఉంచడం సరికాదని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అయితే ఇదిలావుండగా, దంతపరీక్ష కోసం ఢిల్లీ వెళ్లినా ఈ సందర్భంగా అనేక అంశాలపై సీఎం కేసీఆర్ కొంతమంది కేంద్రపెద్దలతో చర్చిస్తున్నట్టు తెలిసింది. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించారు. ఎంతగా స్నేహ హస్తాన్ని అందించినా నిధులు కేటాయించలేదు. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించలేదు. ఈ విషయంలో ఆచితూచి అడుగు వేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అందులో భాగంగానే ఆయన ఢిల్లీ వెళ్లారని, డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర పెద్దలను ఒప్పించడమే ముఖ్యమంత్రి ముందున్న లక్ష్యమని టీఆర్ఎస్‌పార్టీ వర్గాలు అంటున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సమావేశం అయ్యేందుకు కేసీఆర్ అపాయిమెంట్ అడిగినట్టు తెలిసింది. రెండురోజులక్రితం ఎంపీలతో సమావేశమైనప్పుడు, విభజన హామీలతో పాటు కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలపైనా పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాలని సూచించినట్టు



తెలిసింది. కేంద్రప్రభుత్వంతో గొడవలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్రానికి రావాల్సిన వాటి గురించి పట్టుబట్టాలని ముఖ్యమంత్రి ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి వినతులతోనే సరిపెడతారని తెలుస్తోంది. ఒకవేళ ప్రధానమంత్రి అపాయిమెంట్ లభిస్తే, రాజకీయ అంశాలపైనే పూర్తిగా చర్చిస్తారని తెలిసింది. తమకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలూ లేవని, రాష్ట్రానికి పూర్తిగా సహకారం అందించాలని, కేంద్రానికి పూర్తి మద్దతు ప్రకటించేలా పీఎంకు సీఎం భరోసా కల్పిస్తారని తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షంతో భేటీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్ల పెంపు, కొత్త జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపు, వ్యవసాయానికి ఆర్థికసాయం తదితర అంశాలను ప్రస్తావిస్తారని అంటున్నారు. ప్రత్యేకంగా టీఆర్ఎస్‌పార్టీ ఎదురుచూస్తున్న నియోజకవర్గాల పెంపు గురించే గట్టిగా కోరతారని తెలిసింది. బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కేంద్రమంత్రి సుజనా చౌదరి సమావేశమై, ఆయనతో రాజకీయాలపై చర్చించినట్టు తెలిసింది. నియోజకవర్గాల పెంపు గట్టిగా కోరాలని సూచించినట్టు తెలుస్తోంది. ఏపీ చంద్రబాబు చెప్పిన విషయాలను ఈ సందర్భంగా ఆయన చెవిన చేరవేసినట్టు వినికిడి.

**కీలకంగా మారిన తుమ్మల !**

టీఆర్ఎస్‌పార్టీలోనూ, రాష్ట్ర ప్రభుత్వంలోనూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలకంగా మారారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ తుమ్మల నాగేశ్వరరావు సహకారం తీసుకుంటున్నారని తెలిసింది. ప్రతీ మీటింగ్‌లోనూ వారిద్దరూ తుమ్మలను పొగడ్తలతో ముంచెత్తడం చర్చనీయాంశం అవుతున్నది. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు వచ్చినా తుమ్మల సహకారం తమకే ఉండాలన్న ఉద్దేశంతో ఆ ఇద్దరు నేతలు ఉన్నారని తెలిసింది.

# కరాటే చాంపియన్‌షిప్‌లో గురుకుల బాలికల సత్తా



● అభినందించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఏషియన్ ఇంటర్నేషన్ కరాటే చాంపియన్‌షిప్-2018లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. మూడు బంగారు, ఒక వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలు ఈనెల 10,11 తేదీల్లో ముంబయిలో జరిగిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లాల్లోని కల్లూరులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన బాలికలు ఎం మనీషా, ఎ దివ్య, ఎం శిరీష బంగారు పతకాలు సాధించారు. కె కృష్ణవేణి వెండి పతకం సాధించారు. కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన అమ్మాయిలను గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు. బాలికలు సాధించిన విజయం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో 500 మంది బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. బాలికలు ఆత్మరక్షణకు సంబంధించి అనేక మెళకువలు నేర్చుకుంటున్నారని తెలిపారు. బాలికల సాధికారతకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కేజీ టు పీజీలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి బలహీనవర్గాల పిల్లల కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

## లాభదాయక పదవుల వ్యాజ్యంపై హైకోర్టు స్పందన

**నవతెలంగాణ-హైదరాబాద్**

రాష్ట్రంలో పలువురు రిటైర్డు అధికారులు, అధికారపార్టీ నేతలు లాభదాయక పదవుల్లో క్యాబినెట్ ర్యాంకుల్లో కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలు 20 మందిపై కేంద్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పలువురికి క్యాబినెట్ హోదా ఇవ్వడాన్ని విపక్ష శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డి సవాల్ చేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు న్యాయమూర్తులు వి.రామసుబ్రమణియన్, అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ప్రతివాదులంతా తమ వాదనలతో వచ్చే నెల 14లోగా కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని బెంచ్ ఆదేశించింది. గతంలో నోటీసులు జారీ చేసినవి అందని వారికి పిటిషనర్ రేవంత్‌రెడ్డే అందజేసేందుకు బెంచ్ అనుమతించింది.

**కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదు**

హైదరాబాద్ గన్‌ఫౌండ్రీ ఏరియాలో ఉన్న ఏపీ ఎన్జీవో సంఘ భవనంలో నాలుగు గదులు, ఒక హాలు భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి ఇవ్వాలన్న తమ గత ఆదేశాల్ని అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదో స్పష్టం చేయాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబుకు హైకోర్టు నోటీసు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల్ని అమలు చేయలేదంటూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. విచారణ నెలరోజులకు వాయిదా వేసింది

## 'వేసవిలో గొర్రెలకు గ్రాసం కొరత లేకుండా చర్యలు'

**నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్**

రానున్న వేసవిలో గొర్రెలకు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. 70 ఏండ్లుగా పేదరికంలో ఉన్న పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖలు తెలంగాణ ఏర్పడినంక సీఎం కేసీఆర్ చొరవతో ధనిక శాఖలుగా మారాయన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తున్నదన్నారు. ఇప్పటివరకు 2లక్షల గొర్రెలు పంపిణీ చేశామని, 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గ్రామాల్లో గొర్రెలకు నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని తలసాని అధికారులకు నిర్దేశించారు. 90 శాతం సబ్సిడీపై గొర్రెల షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించనున్నట్టు చెప్పారు. మత్స్యకారుల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు ఈ ఏడాది 51 కోట్ల చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలినట్టు వెల్లడించారు. ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో రొయ్యల పెంపకం చేపట్టామన్నారు. చేపల విక్రయాల కోసం హోల్‌సేల్, రిటైల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు

## అవినీతి ఉచ్చులో ఇజ్రాయిల్ ప్రధాని

### రెండు కేసుల్లో నెతన్యాహ్యూ నిందితుడు

**జెరూసలెం :** ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రెండు కేసుల్లో నెతన్యాహూకు సంబంధాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుల్లో పోలీసులు ఆయనను నిందితుడిగా భావిస్తున్నారు. నెతన్యాహూ, ఆయన భార్య, ప్రముఖ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల నుంచి చాలా ఖరీదైన బహుమానాలు అందుకున్నారనే ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు. అయితే పోలీసులు ప్రధానిని నిందితుడిగా చేర్చాలని కేవలం సిఫార్సు మాత్రమే చేయగలరు. దీనిపై ఇజ్రాయిల్ అటార్నీ జనరల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# సింగరేణిలో సీఎం హామీలు అమలు చేయాలి

## గని ఏరియాల్లో కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలు



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

సింగరేణి కాలరీస్ కార్మికులు, ఉద్యోగులకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని గనుల వద్ద సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ధర్నాలు నిర్వహించింది. కొత్తగూడెం ప్రధాన కార్యాలయంతో పాటు రామగుండం, భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, మణుగూరు తదితర ఏరియాల్లో ధర్నాలు జరిగాయి. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల్ని పర్మినెంట్ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని, రోడ్స్ అండ్ బిల్డింగ్ జీవో (అన్‌స్కిల్డ్ రూ.13,630)ను సైతం విడుదల చేయలేదని ఈ సందర్భంగా ధర్నాల్లో పాల్గొన్న నాయకులు తెలిపారు. కోల్ ఇండియాలో ఒప్పందాలు జరిగి అమలౌతున్న వేతనాలను ఐదేండ్లుగా అమలు చేయట్లేదని పేర్కొన్నారు. దీనిపై కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరుమెదపట్లేదని చెప్పారు. 2017 మార్చి 15 నుంచి 23 వరకు జరిగిన సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని తెలిపారు. పై ప్రాంతాల్లో ధర్నాలకు కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రగాని కృష్ణయ్య, బండి రాజేష్, బుర్ర తిరుపతి, ఓదేలు, సంకె రవి, గోమాస ప్రకాష్, నెల్లూర్ నాగేశ్వరరావు, వెంకన్న, ఉల్లిమెగిళి తదితరులు నాయకత్వం వహించారు.

# ఉగాది నుంచి 'మన తెలంగాణ' పుస్తకాల పంపిణీ

## ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి



**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

తెలంగాణ చరిత్రను ప్రతి కుటుంబానికి తెలిపేందుకు మన తెలంగాణ - మన చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి తెలిపారు. అరచేతిలో ఉండే ఈ పుస్తకాన్ని ఉగాది (మార్చి 18) నుంచి పంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. సచివాలయంలో బుధవారం సీఎం కార్యాలయం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొన్ని పుస్తకాలు ముద్రించామని, వాటిలో పాకెట్ సైజ్‌లో ఉండే మన తెలుగు అనే పుస్తకం విశేషంగా ఆకట్టుకుందని చెప్పారు. సీఎం ఆదేశాలతో ఆ పుస్తకంలో మరింత సమాచారం జోడించి, కొత్త పుస్తకాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కోటి మూడులక్షల కుటుంబాలకు ఈ పుస్తకాన్ని చేరవేస్తామని అన్నారు.

# ఎర్రజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: ఎంపీ కవిత



**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రైతులు సాగుచేసిన ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆర్మూర్ శాసనసభ్యులు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ చైర్మెన్లు బుధవారం నిజామాబాద్ ఎంపీ కవితను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారితో చర్చించిన ఎంపీ ఎర్రజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎర్రజొన్న రైతులపై కాల్పులు జరిపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తుచేశారు. ఎర్రజొన్న రైతులు అధైర్య పడొద్దని హామీనిచ్చారు.



# పసుపు, ఎర్రజొన్న రైతులను ఆదుకోవాలి

## తెలంగాణ రైతు సంఘం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా పసుపు, ఎర్రజొన్న పంట పండించిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. జంగారెడ్డి, టి. సాగర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పసుపు, ఎర్ర జొన్న పండిస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

పసుపుకు క్వింటాలుకు రూ. 15 వేలు, ఎర్రజొన్నకు రూ. 4500 ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతము మార్కెట్లో పసుపుకు రూ. 6వేలకు మించి రావడం లేదని. ఎర్రజొన్నకు రూ. 1500కు మించి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**మిర్చి రైతులదీ అదే పరిస్థితి**

రాష్ట్రంలో మిర్చి పండించిన రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని తెలిపారు. 2018 జనవరిలో క్వింటాలు మిర్చి రూ. 11,300 వద్ద ప్రారంభమై ఆకస్మాత్తుగా వారం రోజులోనే రూ. 9000లకు పడిపోయిందన్నారు గత సంవత్సరం నిరసనగా రైతులు పంటను తగులబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**Response Informatics Limited**
3-10-20/7A, Gokhale Nagar, Ramanthapur, Hyderabad-500013.
CIN No. L72200TG1996PLC025871
EXTRACT OF STATEMENT OF UNAUDITED STANDALONE FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31ST DECEMBER, 2017
(Amt. Rs. in lakhs)

| S. No. | Particulars | Quarter Ended 31.12.2017 Unaudited | Quarter Ended 31.12.2016 Unaudited | 9 Months Ended 31.12.2017 Unaudited |
|---|---|---|---|---|
| 1. | Total Income from Operations | 10.00 | 26.22 | 16.50 |
| 2. | Net Profit/(Loss) from Ordinary activities after tax | 8.85 | 0.49 | 0.08 |
| 3. | Net Profit/(Loss) for the period after tax (after Extraordinary items) | 8.85 | 0.49 | 0.08 |
| 4. | Equity Share Capital (of Rs. 10/- each) | 597.64 | 597.64 | 597.64 |
| 5. | Reserve excluding Revaluation Reserve as shown in the Balance Sheet of previous year | -171.93 | -110.43 | -171.93 |
| 6. | Earnings Per Share (before extra-ordinary items - not annualised) | | | |
| | a) Basic | 0.1 | 0.003 | 0.00 |
| | b) Diluted | 0.1 | 0.003 | 0.00 |
| 7. | Earnings Per Share (after extra- ordinary items - not annualised) | | | |
| | a) Basic | 0.1 | 0.003 | 0.00 |
| | b) Diluted | 0.1 | 0.003 | 0.00 |

The above is an extract of the detailed format of unaudited results for the quarter ended 31st, December 2017 filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the unaudited results for the quarter ended 31st December, 2017 are available on the stock Exchange website (www.bseindia.com) and on the Company's website(www.responseinformaticsltd.com).

For RESPONSE INFORMATICS LIMITED
Sd/- D.Swayam Prabha Nair
Director
Place: Hyderabad
Date: 14-02-2018

# సైన్యం బాధ్యత ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎందుకు?

## టీమాస్ చైర్మెన్ కంచ ఐలయ్య




మాట్లాడుతున్న కంచ ఐలయ్య

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

భారత సైన్యం బాధ్యతను ఆర్‌ఎస్‌ఎస్ ఎందుకు తీసుకుంటుందని టీ మాస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతున్న చర్యల వల్ల శూద్ర, ఓబీసీ, దళిత, ఆదివాసీలకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత సైన్యం బహుళ సాంస్కృతిక, కులాల, లౌకిక శక్తులు ఈ దేశాన్ని రక్షించడానికి ఆరు నెలలు పడుతుందని, అదే ఆర్‌ఎస్‌ఎస్ సైన్యం బ్రాహ్మణ దళాల వ్యవస్థ అయితే కేవలం మూడు రోజుల్లోనే రక్షిస్తుందని మోహన్ భగవత్ మాట్లాడడాన్ని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాలని కోరారు. మోహన్ భగవత్ మాట్లాడిన తీరును గమనిస్తే ఇప్పటికే ప్రధాన యుద్ధ ఆయుధాలను కలిగి, దళాలకు తగిన శిక్షణ ఇచ్చినట్టు స్పష్టమవుతుందన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల గురించి ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడైనా మాట్లాడిందా, అందులో అధికార ప్రతినిధులుగా ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీలు ఉన్నారా అని ప్రశ్నించారు. టీ మాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ మనుధర్మాన్ని విస్తరింప చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. భారత రాజ్యాంగానికి అనుగుణంగా పని చేస్తున్న సైన్యాన్ని అవమానించడం సరైంది కాదన్నారు. టీ మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 20 శాతం ఆర్మీ సైన్యానికి ఖర్చు చేస్తుందని అలాంటి సంస్థను అవమానపర్చే విధంగా మాట్లాడుతున్నప్పుడు కేంద్రం ఎందుకు నోరుమెదపడం లేదని అన్నారు. ఈ సమావేశంలో సభ్యులు ఆర్. శ్రీరాంనాయక్, ఎం. ధర్మానాయక్ పాల్గొన్నారు.

# పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- బాధ్యులపై చర్యలు తీసుకోండి : దాసోజు శ్రవణ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కోరారు. బుధవారం హైదరాబాద్ సిటీ క్రైమ్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ మొహంతికి మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌తో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అందుకే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు, ఈ రెడ్ల ఆధిపత్యంలో ఇమడ లేక పోతున్నానంటూ...గత రెండు రోజులుగా తన ట్విట్టర్ అకౌంట్‌లో దుష్ప్రచారం' చేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ మాట్లాడుతూ శ్రవణ్ ఇమేజీని తగ్గించేందుకు టీఆర్‌ఎస్ తప్పుడు ఆరోపణలకు దిగుతోందన్నారు.

**COUNTRY CLUB HOSPITALITY & HOLIDAYS LIMITED**
CIN: L70102AP1991PLC012714
రిజిస్టర్డు ఆఫీస్: 'అమృత క్యాస్టిల్', 5-9-16, సైఫాబాద్, సెక్రటేరియట్ ఎదురుగా, హైదరాబాద్-500063.
Tel: 040-66848888, Fax: 040-66360609 E-mail: contact@countryclubmail.com,
Website: www.countryclubindia.net
అనుబంధం 11
31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు నివేదిక
స్టాండ్‌అలోన్: (రూ.లక్షల్లో)

| వివరాలు | 31.12.2017తో ముగిసిన 3 నెలలు | 31.12.2017తో ముగిసిన 9 నెలలు | 31.12.2016తో ముగిసిన 3 నెలలు |
|---|---|---|---|
| పూర్తి ఆపరేటింగ్ ఆదాయం(నికర) | 6,211.06 | 17,923.80 | 7,082.68 |
| పన్ను తరువాత సాధారణ కార్యక్రమాల నుండి నికర లాభం/ (నష్టం) | -155.56 | -1,427.58 | -330.11 |
| పన్ను తరువాత(అసాధారణ ఐటంల తరువాత) కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) | -155.56 | -1,427.58 | -330.11 |
| ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 3,269.30 | 3,269.30 | 3,269.30 |
| రిజర్వులు (గత సం॥ యొక్క బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లు రివాల్యూయేషన్ రిజర్వు మినహా) | | | |
| వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంలకు ముందు) రూ.2/- చొ॥న | | | |
| బేసిక్: | -0.10 | -0.87 | -0.20 |
| డిల్యూటెడ్: | -0.10 | -0.87 | -0.20 |
| వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంల తరువాత) రూ.2/- చొ॥న | | | |
| బేసిక్: | -0.10 | -0.87 | -0.20 |
| డిల్యూటెడ్: | -0.10 | -0.87 | -0.20 |

గమనిక: పైవి, సెబి (లిస్టింగ్& ఇతర డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజితో పూరించిన త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం. త్రైమాసిక/వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మెట్ స్టాక్ ఎక్ఛేంజి వెబ్‌సైట్ (www.bseindia.com& nseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.countryclubindia.net పై అందుబాటులో ఉంటాయి.

For COUNTRY CLUB HOSPITALITY & HOLIDAYS LIMITED
సం/-
కె. ఫణీంద్ర రావు
చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్
ప్రదేశం: హైదరాబాద్
తేది: 13 ఫిబ్రవరి, 2018

**గౌ॥ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో: హైదరాబాద్ వద్ద**

సిఎ (సిఎఎ)నం.194/230/హెచ్‌డిబి/2017
కంపెనీల చట్టం, 2013 యొక్క విషయంలో
మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 230తో చదువగల సెక్షన్ 232 మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క ఇతర వర్తించు నియమాల విషయంలో
మరియు
ఫ్లాగ్‌షిప్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అమాల్గమేషన్ యొక్క పథకం విషయంలో
('ఎఫ్‌డిపిఎల్' లేదా 'ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ')
మరియు
విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్
('విజిటిపి' లేదా 'ట్రాన్స్‌ఫెరీ కంపెనీ')
మరియు
వారి సదరు వాటాదారులు

విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: ది V, అడ్మిన్ బ్లాక్, మారినర్, ప్లాట్ నం.17, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, మాధాపూర్, హైదరాబాద్-500081, తెలంగాణ, ఇండియా వద్ద కలిగియుండి ప్రతినిధియైన దీని కంపెనీ సెక్రటరీ& లీగల్
శ్రీ వివిఎంఎస్ రావు .... ట్రాన్స్‌ఫెరీ కంపెనీ

ఫారం నం.సిఎఎ2
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 230(3) మరియు కంపెనీల (కాంప్రమైజ్, అరెంజ్‌మెంట్స్& అమాల్గమేషన్స్)రూల్స్, 2016 యొక్క రూల్స్ 6&7 అనుసరించి)

**విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సభ్యులు మరియు అన్‌సెక్యూర్డ్ క్రెడిటర్స్ యొక్క సమావేశం యొక్క నోటీసు యొక్క ప్రకటన**

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, గౌ॥ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వద్ద తేది 9 జనవరి, 2018 మరియు 1 ఫిబ్రవరి, 2018నాటి ఉత్తర్వుల ద్వారా విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సభ్యులు మరియు అన్‌సెక్యూర్డ్ క్రెడిటర్స్ యొక్క సమావేశం విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు: ది V, అడ్మిన్ బ్లాక్, మారినర్, ప్లాట్ నం.17, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, మాధాపూర్, హైదరాబాద్-500081, తెలంగాణ, ఇండియా వద్ద ఫ్లాగ్‌షిప్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ('ఎఫ్‌డిపిఎల్' లేదా 'ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ') మరియు విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ ('విజిటిపి లేదా ట్రాన్స్‌ఫెరీ కంపెనీ') మరియు వారి సదరు వాటాదారులు ('స్కీమ్') యొక్క అమాల్గమేషన్ యొక్క పథకం, పరిగణించుట, ఇఫ్ థాట్ ఫిట్, లేదా మార్పుచేర్పులతో లేదా లేకుండా ఆమోదం నిమిత్తం సోమవారం 19 మార్చి 2018 ఉ.11గం.లకు మరియు మ.12గం.లకు వరుసగా నిర్వహించబడును. సదరు ఉత్తర్వులు మరియు దాని ఆదేశాలుగా అనుసరించి, ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సభ్యుల మరియు అన్‌సెక్యూర్డ్ క్రెడిటర్స్ యొక్క సమావేశం విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు: ది V, అడ్మిన్ బ్లాక్, మారినర్, ప్లాట్ నం.17, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, మాధాపూర్, హైదరాబాద్-500081, తెలంగాణ, ఇండియా వద్ద సోమవారం 19 మార్చి 2018 ఉ.11గం.లు మరియు మ.12గం.లు వరుసగా నిర్వహించబడును, ఎప్పుడైతే, సభ్యులు మరియు అన్‌సెక్యూర్డ్ క్రెడిటర్స్ హాజరవవలసిందిగా కోరబడుచున్నది.
పథకం యొక్క కాపీ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 230(3) క్రింద నివేదికను ఉచితంగా విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు వద్ద పొందవచ్చును. వ్యక్తులు సదరు సమావేశానికి వారు స్వయంగా లేదా వారి ప్రతినిధి ద్వారాకాని హాజరయి మరియు ఓటువేయవచ్చును. ప్రతినిధులందరు నిర్ణీత ఫారంలో విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు: ది V, అడ్మిన్ బ్లాక్, మారినర్, ప్లాట్ నం.17, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, మాధాపూర్, హైదరాబాద్-500 081, తెలంగాణ, ఇండియా వద్ద సమావేశానికి 48(నలుపది ఎనిమిది)గంటలు ముందు ఆలస్యం కాకుండా డిపాజిట్‌చేయవలెను. ప్రాక్సీఫారాలు విజిటిపి ప్రైవేట్ లిమిటెడ్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు వద్ద పొందవచ్చును. గౌ॥నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ సదరు సమావేశపు చైర్మన్‌గా శ్రీ రాహుల్ సరెల్లా, అడ్వకేట్‌ని నియమించారు. పై పేర్కొన్న పథకం, ఒకవేళ సమావేశంలో ఆమోదించబడిన, గౌ॥ట్రిబ్యునల్ యొక్క తగిన ఆమోదం ప్రాతిపదికన ఉంటుంది.

(సం) శ్రీ రాహుల్ సరెల్లా
అడ్వకేట్
సభ్యుల మరియు అన్‌సెక్యూర్డ్ క్రెడిటర్స్ సమావేశానికి నియమించబడిన చైర్మన్
తేది: 12 ఫిబ్రవరి, 2018
హైదరాబాద్ వద్ద

# హరితహారం పేరిట ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలి

- బలరాం నాయక్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరిట పోడు భూములు లాక్కుంటుందని, ఈ క్రమంలో గిరిజనులను వేధింపులకు గురి చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ చేయడం జరిగిందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బయ్యారం, గూడూరులలో ఈ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. పోడు భూములను లాక్కోవడం వల్ల బాధిత గిరిజన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు సర్కార్ రూ 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రాములు నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున సెలవు దినం ప్రకటించాలని, బంజారాహిల్స్‌లో నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : కేఆర్ సురేష్ రెడ్డి**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఆర్మూర్ రైతులు రోడ్ల మీదకు వస్తున్నారన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, పార్టీ నేత రాజారాం యాదవ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులతో కుమ్మక్కయాయని చెప్పారు. మద్దతు ధర కోసం బడ్జెట్‌లో రూ 2000 కోట్లు పెడతామని టీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ దానిని అమలు చేయలేదన్నారు. ఎర్రజొన్న, పసుపు రైతుల కోసం 15 రోజులుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

# ఊడిన విమాన ఇంజిన్ కవచం

**హోనోలులు:** విమానం గాల్లో ఎగురుతున్నప్పుడు ఓ ప్రమాదకర దృశ్యాన్ని చూసి ప్రయాణికులు హడలెత్తిపోయారు. విమానం ఇంజిన్లలో ఒకదాన్ని కప్పిఉంచే కవచం గాలికి ఎగిరిపోయింది. వెంటనే పైలట్ల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హోనోలూలుకు బయలుదేరింది. విమానం పసిఫిక్ మహాసముద్రంపై వెళ్తున్నప్పుడు అకస్మాత్తుగా విమానం కుడి ఇంజిన్‌ను కప్పి ఉంచే కవచం ఊడి ఎగిరిపోయింది. ప్రమాదకరంగా కనిపిస్తున్న ఇంజిన్‌భాగాన్ని విమానంలోని ప్రయాణికులుచూసి ఆందోళనకు గురయ్యారు.

**POWER MECH PROJECTS LIMITED**
రిజిస్టర్డు& కార్పొరేట్ ఆఫీస్: ప్లాట్ నం.77, జూబ్లీ ఎన్‌క్లేవ్, మాధాపూర్, హైదరాబాద్-500 081, తెలంగాణ. ఫోన్:040-30444418
CIN: L74140TG1999PLC032156, Email - cs@powermech.net, Website: www.powermechprojects.com
31 డిసెంబర్ 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు స్టాండ్‌అలోన్ & కన్సోలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (రూ. మిలియన్లలో)

| క్ర. సం. | వివరాలు | స్టాండ్‌అలోన్ 31.12.2017తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | స్టాండ్‌అలోన్ 30.09.2017తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | స్టాండ్‌అలోన్ 31.12.2016తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | స్టాండ్‌అలోన్ 31.12.2017తో ముగిసిన తొమ్మిది నెలలకు (ఆడిట్‌చేయని) | స్టాండ్‌అలోన్ 31.12.2016తో ముగిసిన తొమ్మిది నెలలకు (ఆడిట్‌చేయని) | స్టాండ్‌అలోన్ 31.03.2017తో ముగిసిన సంవత్సరానికి (ఆడిట్‌చేసినవి) | కన్సోలిడేటెడ్ 31.12.2017తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | కన్సోలిడేటెడ్ 30.09.2017తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | కన్సోలిడేటెడ్ 31.12.2016తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్‌చేయని) | కన్సోలిడేటెడ్ 31.12.2017తో ముగిసిన తొమ్మిది నెలలకు (ఆడిట్‌చేయని) | కన్సోలిడేటెడ్ 31.12.2016తో ముగిసిన తొమ్మిది నెలలకు (ఆడిట్‌చేయని) | కన్సోలిడేటెడ్ 31.03.2017తో ముగిసిన సంవత్సరానికి (ఆడిట్‌చేసినవి) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం | 2,895.16 | 2,937.74 | 3,064.03 | 9,074.11 | 9,517.37 | 12,988.44 | 3,565.47 | 3,471.31 | 3,156.03 | 10,648.57 | 9,702.81 | 13,459.04 |
| 2 | కాలవ్యవధిలో నికర లాభం (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు) | 206.15 | 212.97 | 227.48 | 664.22 | 732.30 | 982.74 | 286.36 | 274.59 | 222.78 | 869.67 | 723.67 | 997.70 |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత) | 206.15 | 212.97 | 227.48 | 664.22 | 732.30 | 982.74 | 285.77 | 274.11 | 222.85 | 868.58 | 727.24 | 1,003.26 |
| 4 | పన్ను తర్వాత కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తర్వాత)(కన్సోలిడేటెడ్ విషయంలో పేరెంట్ యొక్క ఈక్విటీ హోల్డర్స్‌కు ఆట్రిబ్యూటబుల్) | 134.15 | 139.04 | 148.13 | 429.80 | 476.78 | 636.78 | 181.44 | 170.14 | 145.95 | 533.50 | 475.91 | 646.75 |
| 5 | కాలవ్యవధిలో పూర్తి ఆదాయం (కాలవ్యవధిలో (పన్ను తర్వాత) సమగ్ర లాభం మరియు ఇతర సంపూర్ణ ఆదాయం (పన్ను తర్వాత)(కన్సోలిడేటెడ్ విషయంలో పేరెంట్ యొక్క ఈక్విటీ హోల్డర్స్‌కు ఆట్రిబ్యూటబుల్) | 135.22 | 140.05 | 148.12 | 432.90 | 476.81 | 640.87 | 182.51 | 171.15 | 145.94 | 536.59 | 476.24 | 650.84 |
| 6 | చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం | | | | | | 147.11 | | | | | | 147.11 |
| 7 | ఇతర ఈక్విటీ | | | | | | 6,024.54 | | | | | | 6,065.43 |
| 8 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొ॥న) (వార్షికంకాని) బేసిక్& డిల్యూటెడ్ | 9.12 | 9.45 | 10.07 | 29.22 | 32.41 | 43.29 | 12.33 | 11.57 | 9.92 | 36.27 | 32.35 | 43.96 |

గమనిక:
సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్ & డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బిఎస్‌ఇ లిమిటెడ్ మరియు నేషనల్ స్టాక్ ఎక్చేంజి ఆఫ్ ఇండియాలకు సమర్పించిన 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నవి. సదరు ఫైనాన్షియల్ ఫలితాల యొక్క పూర్తి ఫార్మెట్ www.powermechprojects.com వద్ద కంపెనీ యొక్క వెబ్‌సైట్ పై మరియు స్టాక్ ఎక్చేంజి యొక్క వెబ్‌సైట్ www.bseindia.com & www.nseindia.comపై కూడా అందుబాటులో ఉంటాయి.

తరఫున
POWER MECH PROJECTS LIMITED
DIN : 00971313
ప్రదేశం: హైదరాబాద్
తేది: 14.02.2018

**INFRONICS SYSTEMS LIMITED**
Plot No.16, SRILA REALTY LAYOUT, NEAR LANDMARK TOWERS, MIYAPUR, HYDERABAD-500044
CIN: L72200TG2000PLC033629
STATEMENT OF UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 31.12.2017 (₹ in Lakhs)

| Sl. No. | Particulars | Quarter ended 31.12.17 Unaudited | Quarter ended 30.09.17 Unaudited | Quarter ended 31.12.16 Unaudited | Nine Months ended 31.12.17 Unaudited | Nine Months ended 31.12.16 Unaudited | Year ended 31.03.17 Audited |
|---|---|---|---|---|---|---|---|
| I | Revenue from operations | 10.22 | 97.29 | 493.84 | 657.01 | 602.96 | 953.48 |
| II | Other Income | - | - | - | - | - | 0.50 |
| III | Total income | 10.22 | 97.29 | 493.84 | 657.01 | 602.96 | 953.98 |
| IV | Expenditure | | | | | | |
| | (a) Cost of materials consumed | - | - | - | - | - | - |
| | (b) Purchase of stock-in-trade | - | - | - | - | - | - |
| | (c) Change in inventories of finished goods,work in progress | - | - | - | - | - | - |
| | (d) Employee benefit expense | - | - | 67.38 | 30.14 | 72.51 | 146.96 |
| | (e) Finance Cost | - | - | - | - | 18.87 | 18.87 |
| | (f) Other Expenses | 73.85 | 94.76 | 430.75 | 550.03 | 514.49 | 711.38 |
| | (g) Depreciation and amortization expense | 1.95 | 1.87 | 12.34 | 149.73 | 37.03 | 49.37 |
| | **Total expenses** | **75.80** | **96.63** | **510.47** | **729.90** | **642.90** | **926.58** |
| V | **Profit before exceptional items and Tax (III-IV)** | **(65.58)** | **0.66** | **(16.63)** | **(72.89)** | **(39.94)** | **27.40** |
| VI | Exceptional Items | - | - | - | - | - | 23.44 |
| VII | **Profit / (Loss) before tax (V-VI)** | **(65.58)** | **0.66** | **(16.63)** | **(72.89)** | **(39.94)** | **3.96** |
| VIII | Tax Expenses (incl.deferred tax) | (33.60) | 33.60 | - | - | (13.90) | 66.99 |
| IX | **Net Profit / (Loss) tax (VI-VII)** | **(31.98)** | **(32.94)** | **(16.63)** | **(72.89)** | **(26.04)** | **(63.03)** |
| X | Other Comprehensive income | | | | | | |
| | Items that will not be reclasified to Profit or Loss | | | | | | |
| | Items that will be reclasified to Profit or Loss | | | | | | |
| XI | **Total Comprehensive Income** | **(31.98)** | **(32.94)** | **(16.63)** | **(72.89)** | **(26.04)** | **(63.03)** |
| XII | Paid-up equity share capital (Face value of Rs.10/- each) | 792.65 | 792.65 | 792.65 | 792.65 | 792.65 | 792.65 |
| XIII | Earnings per Equity share of face value of Rs.10/- each | | | | | | |
| | (a) Basic & diluted | (0.40) | (0.42) | (0.21) | (0.92) | (0.33) | (0.80) |

1 The above results were reviewed by the Audit Committee of Directors and taken on record by the Board of Directors at their meeting held on 14.02.2018
2 The company adopted the Indian Accounting standards (Ind AS) from 01.04.2017 and accordingly these results have been prepared in accordance with the recognition and measurent principles laid down in the Ind AS- 34 "Interim Financial Reporting" prescribed under Section 133 of Companies Act, 2013 read with teh relevant rules issued thereunder and other accouting propouncements generally accepted in India. The Ind-AS Compliant Standardlone Financial results for the corresponding quarter ended Dec 31, 2016 have been stated in terms of SEBI Circular dated July, 05, 2016.
3 Reconciliation of results between previously reported ( referred to as "Previous GAAP") and Ind-AS for the corresponding quarter and Half Year ended December 31, 2016 is as under;

| Particulars | Quarter ended 31st Dec, 2016 |
|---|---|
| Net Profit/(Loss) after Tax under Indian GAAP | -16.63 |
| Net Profit for the period as per Ind-AS | -16.63 |
| Add: Other Comprehensive Income | - |
| Total Comprehensive Income for the Period as per Ind-AS | -16.63 |

4 The results are also available on the webiste of the Company www.infronics.co.in.
5 The Company is not operating hence there are no separate reportable segments as per Ind AS -108 "Operating Segments"

For and on behalf of the Board
for INFRONICS SYSTEMS LIMITED
Sd/-
M.V.S.RAMESH VARMA
DIRECTOR
Place: Hyderabad
Date: 14-02-2018

**డిక్యూ ఎంటర్‌టైన్‌మెంట్ (ఇంటర్నేషనల్) లిమిటెడ్**
CIN: L92113TG2007PLC053585
రిజిస్టర్డు ఆఫీస్: 644, అరోర కాలనీ, రోడ్ నం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034, తెలంగాణ-ఇండియా.
Website: www.dqentertainment.com, email: investors@dqentertainment.com, Tel: +91-40-23553726 & 27, Fax: +91-40-23552594
31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని (కన్సోలిడేటెడ్ & స్టాండ్‌అలోన్) ఆర్థిక ఫలితాల సారాంశం (రూ. మిలియన్లలో)

| వివరాలు | కన్సోలిడేటెడ్ 31 డిసెంబర్ 2017తో ముగిసిన త్రైమాసికం | కన్సోలిడేటెడ్ 31 డిసెంబర్ 2017తో ముగిసిన తొమ్మిది నెలలు | కన్సోలిడేటెడ్ 31 డిసెంబర్ 2016తో ముగిసిన త్రైమాసికం | స్టాండ్‌అలోన్ 31 డిసెంబర్ 2017తో ముగిసిన త్రైమాసికం | స్టాండ్‌అలోన్ 31 డిసెంబర్ 2017తో ముగిసిన తొమ్మిది నెలలు | స్టాండ్‌అలోన్ 31 డిసెంబర్ 2016తో ముగిసిన త్రైమాసికం |
|---|---|---|---|---|---|---|
| ఆపరేషన్ల నుండి మొత్తం (ఆదాయం) | 176.18 | 544.73 | 203.95 | 145.66 | 598.91 | 196.50 |
| కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు) | (328.97) | (998.95) | (229.65) | (134.70) | (275.56) | (87.84) |
| పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (257.72) | (371.80) | (500.77) | (171.65) | (262.13) | (67.90) |
| పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (278.49) | (376.16) | (500.77) | (192.42) | (266.49) | (67.90) |
| కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు ప్రయోజిత లాభం(నష్టం)(పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) | (278.49) | (378.85) | (500.77) | (192.42) | (269.18) | (67.90) |
| ఈక్విటీ వాటా మూలధనం | 792.83 | 792.83 | 792.83 | 792.83 | 792.83 | 792.83 |
| గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్‌షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహా) | 114.90 | 114.90 | 4,302.29 | 1,645.55 | 1,645.55 | 3,930.98 |
| వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) | - | - | - | - | - | - |
| బేసిక్: | (3.51) | (4.74) | (6.32) | (2.43) | (3.36) | (0.86) |
| డైల్యూటెడ్: | (3.51) | (4.74) | (6.32) | (2.43) | (3.36) | (0.86) |

గమనిక:
1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బిఎస్‌ఇ లిమిటెడ్ & ఎన్ఎస్ఇ లిమిటెడ్‌తో దాఖలుచేయబడిన 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు (కన్సోలిడేటెడ్& స్టాండ్‌అలోన్) యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్: (www.nseindia.com and www.bseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: (www.dqentertainment.com)పై అందుబాటులో వుంటాయి.
2. 01 ఏప్రిల్, 2017 (ట్రాన్సిషన్ తేది: 01 ఏప్రిల్ 2016) నుండి ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి-ఎఎస్)ను కంపెనీ ఆమోదించింది మరియు తదనుగుణంగానే 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆర్థిక ఫలితాలు అనునవి కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015 మరియు కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) అమెండ్‌మెంట్ రూల్స్, 2016 యొక్క రూల్ 3తో చదవబడు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద నిర్దేశించినట్లుగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి-ఎఎస్)ను అనుసరించి సిద్ధం చేయబడినవి.
3. మినహాయింపుగల ఐటంలు అనునవి అకౌంటింగ్ స్టాండర్డ్-11 ప్రకారం మనీటరి ఐటంల యొక్క ట్రాన్స్‌లేషన్‌పై లెక్కించిన విదేశీ మారక అస్థిరతపైవచ్చిన జాతీయ విదేశీ మారకం లాభం/(నష్టం).

డిక్యూ ఎంటర్‌టైన్‌మెంట్ (ఇంటర్నేషనల్) లిమిటెడ్ తరఫున
బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున
తపాస్ చక్రవర్తి
చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
ప్రదేశం: హైదరాబాద్
తేది: ఫిబ్రవరి 14, 2018

# తవ్వకాలే కాదు..పునరావాసమూ ముఖ్యమే




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

గనులు, ఖనిజాలు తవ్వకాలు చేయడమే కాదు, వాటి బాధితులకు పునరావాసమూ ప్రధానమేనని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ వ్యాఖ్యానించారు. మైనింగ్ అనేది అక్షయపాత్ర కాదని, అప్రమత్తత, జాగ్రత్తలు అవసరమన్నారు. గనుల తవ్వకాలు స్థానిక ప్రజల భద్రతను ప్రశ్నార్థకం చేయకూడదన్నారు. తవ్వకాలతోపాటు తోడ్పాటును అందించాల్సి ఉందని చెప్పారు. పరిహారంగా స్థానికులకు ఎంత ఇస్తున్నామనేది కాకుండా , ఎంత తవ్వుతున్నామో ఆమేరకు పారదర్శకత పాటిస్తూ, బాధితులకు అదే పద్ధతిలో న్యాయం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ హెచ్ఐసీసీలో మూడవ అంతర్జాతీయ మైనింగ్ సదస్సు-2018తోపాటు ప్రదర్శనను ప్రారంభించారు. ఫిక్కీ, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ సదస్సును నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. దీనికి కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మైనింగ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, రాష్ట్ర ఐటీ, మైనింగ్ శాఖ మంత్రి కె.తారకరామారావు, టీఎస్ఎండీసీ చైర్మెన్ శేరి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మైనింగ్ తవ్వకాల్లో సమీప ప్రాంతాల ప్రజల భద్రత ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని చెప్పారు. ఇందులో అనేక సవాళు ఇమిడి ఉన్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని గనుల్లో స్థానికుల పునరావాసం కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు అన్యాయం జరగకుండా కచ్చితమైన పునరావాసం అవసరమన్నారు. ఇది ఏ ఒక్కరి కోసమే కాదు, దేశం కోసం, మానవత్వం కోసం చేయాలి అని స్పష్టం చేశారు. అలా చేయకపోతే ప్రభుత్వాలు సంబంధిత సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. మైనింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో ముందు ఉందన్నారు. మైనింగ్‌లో జరిగే అన్ని కార్యకలాపాలు, చర్యలను వెబ్‌సైట్‌లో పెట్టాలని, పూర్తి పారదర్శకతను పాటించాలని చెప్పారు. మైనింగ్ ప్రాంతాల్లో మైనర్ల(చిన్నారులు)కు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరమని సదస్సు దృష్టికి తెచ్చారు. సంపద ఆరోగ్యం కాదని, ఆరోగ్యమే సంపద అని గుర్తు చేశారు.

**వేలం ద్వారానే ఆదాయం:తోమర్**

గనులు, ఖనిజాల తవ్వకాలను వేలం వేయడం ద్వారానే ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నదని, ఇది పారదర్శకతకు నిదర్శనం కూడా అని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మైనింగ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. దేశంలో 32 లక్షల కిలోమీటర్ల మేర ఖనిజాలు వ్యాపించి ఉన్నాయని వివరించారు. జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)లో మైనింగ్ తవ్వకాల ఆదాయంగా ప్రధానంగా ఉందన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారిందని చెప్పారు. దేశంలో దాదాపు 32 రకాల గనులు, ఖనిజాలను వేలం వేసినట్టుగా వివరించారు. గతంలో రూ. 1.35 లక్షల కోట్ల ఆదాయం వచ్చేదని, వేలం వేసిన తరువాత రూ.1.4 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. ఎక్కడైతే బంగారం, బాక్సైట్, ఇతర ఖనిజాలు ఉన్నాయో, అక్కడే పేదరికం ఉందన్నారు. ఈ అసమానతలను రూపుమాపాల్సి అవసరం ఉందని చెప్పారు. ఖనిజాలు ప్రకృతి సంపద అని, వాటిని కాపాడుకోవాలన్నారు. మార్గదర్శకాలు, నిబంధనలు ఉల్లంఘించకుండా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా చూసుకోవాల్సి బాధ్యత కూడా ప్రభుత్వాలపై ఉందని వివరించారు. ఇందుకోసం ప్రణాళిక స్థాయి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తే, కేంద్రం మద్ధతు ఇస్తుందని వివరించారు.

**రాష్ట్రంలో రూ.3500 కోట్ల ఆదాయం: కేటీఆర్**

రాష్ట్రంలో మైనింగ్ కార్యకలాపాల ద్వారా ఈ ఏడాది రూ.3500 కోట్ల ఆదాయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మైనింగ్ శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. ఇది గత ఏడాది రూ.3170 కోట్లుగా ఉందని వివరించారు. విభజన చట్టం ప్రకారం సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త మైనింగ్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దీన్ని కేంద్రం సైతం ప్రశంసించిందన్నారు. సదస్సుకు వచ్చిన ప్రతినిధులు అన్ని అంశాలపై చర్చించి నిర్ణయాలు చేయాలని సూచించారు. సామాజిక కర్తవ్యాలను సైతం మరచిపోరాదని అభిప్రాయపడ్డారు. దక్షిణ భారత దేశంలో అత్యధికంగా గనులు, ఖనిజాల నిల్వలు ఉన్న రాష్ట్రం మనదేనని చెప్పారు. ఈ సదస్సులో టీఎస్ఎండీసీ చైర్మెన్ శేరి సుభాష్‌రెడ్డి, కేంద్ర మైనింగ్ శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఫిక్కీ డైరెక్టర్ దిలీప్ షెనాయ్, ఇతర ఉన్నతాధికారులు ఎకె కోఠారి, రాష్ట్ర మైనింగ్ శాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ మంగీరామ్, ఇతర ఉన్నతాధికారులు రఫీ అహ్మద్, రామచంద్రయ్య, శామ్యూల్ జాకబ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కోదండరామ్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మి ప్రసాద్, శ్యామ్‌ప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.

**శేరి సుభాష్‌రెడ్డికి అవమానం**

టీఎస్ఎండీసీ చైర్మెన్ శేరి సుభాష్‌రెడ్డికి ఈ సదస్సులో అవమానం జరిగింది. ఆయన్ను తొలుత వేదికపైకి ఆహ్వానించలేదు. అందరిని పిలిచాక కొద్దిసేపటికి రమ్మన్నారు. అంతేగాక వేదికపై ఆయన పేరు మీద నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయలేదు. దీనిపై సదస్సుకు హాజరైన ప్రతినిధులు, మీడియాలో చర్చకు ఆస్కారం కలిగింది.

## 19 నుంచి టీఆర్టీ హాల్‌టికెట్లు


### దరఖాస్తుల సవరణకు నేడు మరోసారి అవకాశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కొందరు ఇంకా వారి బయోడేటా, జిల్లా మార్పు, ఇతర వివరాలను సరిచేసుకోలేదు. దీంతో అలాంటి అభ్యర్థుల కోసం దరఖాస్తుల సవరణకు మరోసారి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అవకాశం కల్పించింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు 24 గంటలపాటు దరఖాస్తుల్లో తప్పులను సరిదిద్దుకోవాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులను సరిదిద్దుకోలేకపోయామని మరోసారి అవకాశం కల్పించాలని కొందరు అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీని ఆశ్రయించారని పేర్కొన్నారు. వారి విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. తప్పులను సరిదిద్దుకోవడానికి ఇది మూడో అవకాశమని పేర్కొన్నారు. కొందరు అభ్యర్థులు 31 జిల్లాలకు దరఖాస్తు చేసినప్పుడు ఉన్న వివరాలనే అలాగే కొనసాగించారని తెలిపారు. వారు తమ వివరాలను పది జిల్లాల వారీగా మార్చాలని కోరారు. టీఆర్టీ అభ్యర్థులకు హాల్‌టికెట్లు ఈనెల 19వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 24 నుంచి టీఆర్టీ రాతపరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

## జస్టిస్ లోయా గుండెపోటుతో చనిపోలేదు...

- వివిధ వైద్య నివేదికల్లో ఆ అభిప్రాయం లేదు : ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణుడు ఆర్‌కే.శర్మ



**న్యూఢిల్లీ :** సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి బీహెచ్. లోయా సహజ మరణం పొందలేదు..అన్న వాదన బలపడుతోంది. ఆయన గుండెపోటుతో చనిపోలేదు, మెదడుకు గాయం లేదా విష ప్రయోగం జరగటం లోయా మృతికి దారి తీసిందని ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణుడు ఆర్‌కే.శర్మ అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ, ఎయిమ్స్‌లో ఆయన ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. జస్టిస్ లోయా మృతి కేసులో శవ పరీక్ష, పాథాలజీ నివేదికలు, ఇతర వైద్య పరీక్షల నివేదికలను అధ్యయనం చేసిన ఆయన లోయా గుండెపోటుతో చనిపోలేదు...అని నిర్ధారణ చేశారు. శరీరంలోని అవయవాలపై జరిగిన వివిధ పరీక్షల్లో కూడా ఇదే వ్యక్తమైందని శర్మ చెప్పారు. జస్టిస్ లోయా సహజమరణం పొందారని చెబుతున్న మహారాష్ట్ర ప్రభుత్వ వాదనను శర్మ తోసిపుచ్చుతున్నారు.

ఈ నేపథ్యంలో 'ద కారవాన్' మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కేసుకు సంబంధించి శర్మ పలు విషయాలు ప్రస్తావించారు. "హిస్టో పాథాలజీ' నివేదిక ఆధారంగా లోయాకు గుండెపోటు వచ్చిందని భావించలేం. అలాగే ఇతర పరీక్షలు సైతం...ఆయన మృతి గుండెపోటుతో జరిగినట్టు పేర్కొనలేదు. తెల్లవారుజాము 4గంటలకు లోయా బాగోలేదన్న సంగతి తెలిసింది. ఉదయం 6.15 గంటలకు ఆయన మరణించినట్టు వైద్యులు చెప్పారు. గుండెపోటు వచ్చిన మనిషి 30 నిమిషాలు దాటి బతికితే, గుండెలో జరిగే మార్పులు వైద్య పరీక్షల్లో కనపడతాయి. కానీ అలాంటివేవీ నివేదికల్లో లేవు. కానీ శవ పరీక్ష నివేదికలో మాత్రం లోయా గుండెపోటుతో మరణించి ఉండొచ్చునని పేర్కొన్నారు. అందుకు బలమైన ఆధారాల్ని చూపే అంశం మాత్రం ఇక్కడ లేదు" అని శర్మ చెప్పారు.

## వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతినెలా పింఛన్ అందించండి

### ముఖ్యమంత్రికి జూలకంటి బహిరంగ లేఖ



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా పెన్షన్లు సకాలంలో అందక నానా ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. పెన్షన్ సెంటర్ల వద్ద కనీసం మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల వృద్ధులు కండ్లు తిరిగి పడిపోయిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయన్నారు. వీరికి ప్రతినెల క్రమం తప్పకుండా పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు బుధవారం ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. పెన్షన్ పంపిణీ సెంటర్లు దగ్గర్లో లేక కిలోమీటర్ల కొద్ది ఆటోలో వెళ్ళి తీసుకోవాల్సి వస్తోందన్నారు. మిర్యాలగూడ టౌన్‌లో 36 వార్డులకుగానూ రెండు పోస్టాఫీస్ కేంద్రాల్లో మాత్రమే పెన్షన్ సెంటర్లు పెట్టారని తెలిపారు. దీంతో వందల రూపాయలు ఆటో ఛార్జీలు పెట్టుకుని ప్రతి నెలా నాలుగైదు రోజులు తిరుగుతున్నా పెన్షన్లు అందని దుస్థితి ఏర్పడిందన్నారు. వచ్చే పెన్షన్లు వీరి ఆటో ఛార్జీలకే సరిపోతున్నా యన్నారు. ఈ విషయం పోస్టాఫీస్ సిబ్బందిని అడిగితే మాకు డబ్బులుపై నుంచి అందడం లేదని, పాత మిషన్లు ఉండడం వలన కూడా సరిగా పని చేయక టైమ్‌కు ఇవ్వలేకపోతు న్నామన్నారు. పెన్షన్‌దారులు తమ బాధ తట్టుకోలేక అనేక సార్లు రోడ్లపైకి వచ్చి కూడా నిరసనలు తెలియజేశారన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిం దన్నారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాపితంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఈ అంశంపై తక్షణమే జోక్యం చేసుకుని వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ సమస్యపై మానవ తా దృక్పథంతో ఆలోచించి పెన్షన్ సెంటర్లను అదనంగా పెంచాలని, సెంటర్ల వద్ద త్రాగునీరు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రతి నెలా వీరికి సమయానికి రెగ్యులర్‌గా పెన్షన్లు అందే విధంగా తగు చర్యలు చేపట్టి వారికి న్యాయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈ ఏడాదిలో రూ.457.78 కోట్లు చెల్లించాల్సిందే

- వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూములపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఉత్తర్వులు
- ఆరు విడతల్లో రైతులకు భూ పరిహార చెల్లింపులు

**నవతెలంగాణ-హైదరాబాద్**

పలు అవసరాల కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు ఇవ్వాల్సిన రూ.457.78 కోట్లను ఈ ఏడాది చివరి నాటికి తెలంగాణ సర్కార్ చెల్లించాల్సిందేనని హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 తేదీ వరకూ ఆరు విడతల్లో రైతులకు భూపరిహార చెల్లింపులు చేయాలని ఆదేశాలిచ్చింది. భూపరిహారం చెల్లించాలని తామిచ్చిన ఆదేశాల్ని జిల్లా కలెక్టర్ అమలు చేయడం లేదని, దాంతో రైతులు దాఖలు చేసే ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ) కారణంగా కేసులు పేరుకుపోతు న్నాయని పేర్కొంటూ పాలమూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణ చేపట్టింది. బుధవారం మరోసారి పిల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించి తెలంగాణ సర్కార్ చెల్లించాల్సిన భూపరిహారంపై కీలక ఉత్తర్వులిచ్చింది. గత ఆదేశాల మేరకు తెలంగాణ సర్కార్ తాము రూ.458 కోట్లు చెల్లించాలని తెలిపింది. ఏపీ సర్కార్ రూ.62 కోట్లు మాత్రమే రైతులకు బకాయిలున్నామని చెప్పింది. ఏపీ తెలిపిన సమాచారంపై హైకోర్టు అనుమానాన్ని వెలిబుచ్చింది. పలు ప్రాజెక్టుల పేరుతో భారీగా భూసేకరణ జరుగుతుంటే రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఇంత తక్కువగా ఉన్నాయా అనే అనుమానాన్ని బెంచ్ వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక లాయర్ కల్పించుకుని భూసేకరణ బాగా ఉన్నప్పటికీ అవి ఈపీల దశకు చేరలేదన్నారు. దాంతో, తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఈపీల వివరాలు, రైతులకు ఏమేరకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలో పూర్తి వివరాల్ని వచ్చే మార్చి మాసాంతానికి తమకు నివేదించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తెలంగాణలోని 31 జిల్లాల్లో 1669 ఈపీలు పెండింగ్‌లో ఉన్నవాటికి రూ.457.78 కోట్లు బకాయిలు చెల్లించాల్సి వుందని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైకోర్టుకు నివేదించారు. ఇరిగేషన్, హౌసింగ్, ఆర్అండ్‌బీ శాఖలవే ఎక్కువగా ఉన్నాయని, వచ్చే బడ్జెట్‌లో బకాయిల చెల్లింపులకు నిధుల కేటాయింపులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో గత నెల నాటికి 918 ఈపీలు మాత్రమే పెండింగ్‌లో ఉంటే వాటికి రూ.62.88 కోట్లు బకాయిలు చెల్లించాల్సివుందని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హైకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. విచారణ ఏప్రిల్‌కు వాయిదా పడింది.

## ఉపాధి ఉత్తిదే

(మొదటిపేజీ తరువాయి)

రూ. పది లక్షల వరకు, ఉత్పత్తి రంగంలో రూ. పది లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు రుణాలు తీసుకోవచ్చు. ఈ పథకం కింద 90 శాతం వరకు రుణం మంజూరవుతుంది. ప్రాజెక్టు వ్యయం 25 శాతం, అర్బన్ ప్రాంతాల్లో 15 శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూర్చుతుంది.

**గణాంకాలేమంటున్నాయి.?**

పీఎంఈజీపీ పోర్టల్ ప్రకారం 2017 ఏప్రిల్ నుంచి 2018 ఫిబ్రవరి 13 వరకు 4,03,988 మంది యువకులు ఉపాధిరుణాల కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 3,49,208 దరఖాస్తులు కలెక్టర్ల నేతృత్వంలో ఏర్పడిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీల ముందుంచారు. అందులో 2,52,536 దరఖాస్తులను మంజూరుచేస్తూ.. బ్యాంకులకు పంపారు. వాటిలో కేవలం 49,721 దరఖాస్తులకు ఆయా బ్యాంకు అధికారులు రుణ అనుమతులిచ్చాయి.

**నిపుణులేమంటున్నారంటే..**

ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్(ఫిస్మో) జనరల్ సెక్రెటరీ భరద్వాజ మాట్లాడుతూ..బ్యాంకుల్లో ప్రాసెసింగ్ విధానం సరళతరంగా ఉండదని, దీన్ని నిరుద్యోగ యువత పూర్తి చేయలేకపోతుందని వివరించారు. ఈ ప్రాసెస్‌కు ప్రధానంగా అవినీతి కీలకపాత్ర పోషిస్తున్నది. ఇలాంటి పలు సాకులు చూపించడంతో నిరుద్యోగ యువతకు రుణాలు దక్కటంలేదని తెలిపారు.

**బడ్జెట్‌లో కేటాయింపులున్నా ప్రయోజనమేంటీ..?**

నిరుద్యోగం, ఉపాధి అంశాల్లో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న మోడీ సర్కారు పీఎంఈజీపీ టార్గెట్‌ను గణనీయంగా పెంచేసింది. 2018 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి జైట్లీ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,800 కోట్ల కేటాయిస్తున్నట్టు చెప్పారు. 2017లో ఇది రూ. 1,024 కోట్లు మాత్రమే. ఈ లెక్కన 776 కోట్లు అధికంగా పెంచింది. 2018-19లో 7.04లక్షలమంది ఉపాధికల్పించాలని టార్గెట్ పెట్టుకోగా, గత బడ్జెట్‌లో 56,500 మైక్రో యూనిట్లు, 4.52 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించింది. కానీ బడ్జెట్ కేటాయింపులు పెంచుకుని మోడీ సర్కారు మురిసిపోతే.. యువతకు ఉపాధి ఏ విధంగా దొరుకుతుందో అర్థం కావటంలేదని నిరుద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పథకాల గురించి ప్రచారం చేసుకుంటే సరిపోదు. దాన్ని సద్వినియోగం చేసుకునే గైడ్‌లైన్స్ పట్ల యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది. ఓవైపు బ్యాంకుల వద్ద పేరుకుపోయే మొండిబకాయిలను పరిగణనలోకి తీసుకుంటామంటున్నది. మరోవైపు నిరుద్యోగుల దరఖాస్తులను బ్యాంకులకు పంపి చేతులు దులుపుకుంటున్నది.స్వయం ఉపాధిపట్ల చిత్తశుద్ధి ఉంటే..యువత నిలదొక్కుకునేలా కేంద్రం చొరవ తీసుకోవాల్సిన అవసరమున్నదని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## వంద మండలాల్లో కాలేజీల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదో తెలుస్తున్నది. ఖమ్మం జిల్లాలో కూసుమంచి, తల్లాడ మండలాల్లోనూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు అందుబాటులో లేవు. దీంతో అక్కడి విద్యార్థులు ప్రత్యామ్నాయం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి, గరిడేపల్లి మండలాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, ఊర్కొండ, కడ్తాల్ మండలాల్లోనూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకోవైపు సొంత మండలాల్లో జూనియర్ కాలేజీల్లేనందున పదో తరగతి ఉత్తీర్ణులైనా అమ్మాయిలు చదువు మానేసే పరిస్థితి తలెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కావాలని 20 మంది ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులొచ్చాయి. అందులో హైదరాబాద్ నుంచి ముషీరాబాద్, అంబర్‌పేట్, ఉప్పల్, ఆసిఫ్‌నగర్ (కార్వాన్) నుంచి ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలున్నారు. తెలంగాణలో వంద మండలాల్లో జూనియర్ కాలేజీల్లేవు.

**పది ఉత్తీర్ణత ఆధారంగా కాలేజీ ఏర్పాటు**

పదో తరగతిలో ఉత్తీర్ణత ఆధారంగానే ఏదైనా మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. నిబంధనల ప్రకారం 280 మంది పదో తరగతి ఉత్తీర్ణులైతే జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఆ మండలం అర్హత సాధించినట్టు అవుతుంది. రాష్ట్రంలో 584 మండలాలున్నాయి. అయితే ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీలు లేని మండలాలు వంద ఉండడం గమనార్హం. క్షేత్రస్థాయి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉత్తీర్ణత, డిమాండ్, ప్రజాప్రతినిధుల అభిప్రాయం వంటి అంశాలతో నివేదిక తెప్పించుకునే పనిలో ఇంటర్ అధికారులు ఉన్నారు. ఒక్కో కాలేజీ ఏర్పాటుకు అవసరమైన భూమి, ఎన్ని నిధులు అవుతాయో అంచనాలు పొందుపరచాలని సూచించారు. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన విజ్ఞప్తులు ప్రభుత్వానికి పంపించారు. పరిశీలన పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాల్లోనూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

**అద్దె భవనాల్లో 16 కాలేజీలు**

రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. 388 కాలేజీలకే సొంత భవనాలున్నాయి. ఇందులో 27 కాలేజీల భవనాల నిర్మాణం జరుగుతున్నది. ఇక 16 కాలేజీలు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ఆ 16 కాలేజీలకు సొంత భవనాల్లేవు. మూడున్నరేండ్లయినా ఆ కాలేజీలకు భూమి కేటాయించలేని పరిస్థితి తలెత్తింది.

ఇక 404 కాలేజీల్లో ప్రహరీగోడ ఉన్నవి 211 మాత్రమే. మిగిలిన 193 కాలేజీలకు ప్రహరీగోడ లేదు. ఆర్వో ప్లాంటు ఉన్న కాలేజీలు 168. అంటే 236 కాలేజీల్లో ఆర్వో ప్లాంట్లు లేవు. ఆ కాలేజీల్లో చదివే విద్యార్థులకు కనీస రక్షిత మంచినీరు అందించలేని పరిస్థితి దాపురించింది. మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీరు అందిస్తామని చెప్తున్న ప్రభుత్వం కాలేజీలను విస్మరించిందన్న ఆరోపణలున్నాయి.

## పొత్తు ప్రసక్తే లేదు..




మాట్లాడుతున్న తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

కూటమిలో తమ పార్టీ చేరబోతున్నదంటూ ప్రచారం చేయటం శోచనీయమని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. ఈ మేరకు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు, కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. 'టీఆర్ఎస్‌కు సహకరించేందుకే బీఎల్ఎఫ్ ఏర్పడిందంటూ కొందరు మాట్లాడుతున్నారు. మేమంటే భయపడేవారే ఇలాంటి విమర్శలు చేస్తారు.. అయినా మేం తీసుకునే నిర్ణయాలు కేవలం తెలంగాణకు మాత్రమే వర్తించవు. అఖిల భారత స్థాయిలో తీసుకునే విధానాన్నే మేం రాష్ట్రంలో అమలు చేయాల్సి ఉంటుంది...' అని వివరించారు.

సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో తమ్మినేని విలేకరుల సమావేశం నిర్వహించారు. పొత్తులు, ఎత్తుల కారణంగా 25 ఏండ్లలో పార్టీ నష్టపోయిందని తెలిపారు. అందుకే వామపక్ష, సామాజిక, ప్రజాతంత్ర శక్తులను ఒకతాటిపైకి తీసుకు రావాలని భావించామని అన్నారు. ఇందులో భాగంగా.. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కూటమిలో చేరేందుకు మరికొన్ని పార్టీలు కూడా ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. సీపీఐ కూడా కలిసి వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తాము సామాజిక న్యాయం అనే బలమైన అజెండాతో 2019 ఎన్నికల్లో పోటీ చేస్తామని తమ్మినేని తెలిపారు. బహుజనుల రాజ్యాధికారం కోసం ఏర్పడిన బీఎల్ఎఫ్‌ను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరుసగా నాలుగోసారి కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవటం లేదని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. ఈ విషయంలో సీఎంకు కనీస 'సోయి' కూడా లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ ఫణంగా పెట్టారని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలను కేంద్రం పట్టించుకోవటం లేదన్నారు. సర్కారు చేపట్టిన మిషన్ భగీరథ, కాకతీయ పథకాలకు కూడా కేంద్రం నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ విధంగా తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్.. బీజేపీతో సయోధ్యగానే ఉంటున్నారని విమర్శించారు. కనీసం ఆగ్రహపూరిత వైఖరిని కూడా ప్రదర్శించటం లేదన్నారు. ఎన్డీయేలో భాగస్వామి అయిన చంద్రబాబు మాటల్లో నిజాయతీ లేకున్నా.. కనీసం పార్లమెంటులోనైనా తన పార్టీ ఎంపీలతో ఆందోళనలు చేయిస్తున్నారని గుర్తుచేశారు. ఆ మాత్రం సోయి కూడా కేసీఆర్‌కు లేకపోయిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీలను గురువారం ఖరారు చేస్తామని వివరించారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ సర్కారు కండ్లు తెరవాలని సూచించారు. తక్షణం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. తద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, చెరుపల్లి సీతారాములు, బి.వెంకట్ కూడా పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని అసభ్య ప్రవర్తన

(మొదటిపేజీ తరువాయి)

జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడు అంజయ్య నాలుగేండ్లుగా సాంఘికశాస్త్రం బోధిస్తున్నాడు. పదవ తరగతి విద్యార్థినులను ప్రత్యేక తరగతుల పేరిట పిలిపించి అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో పాటు లైంగికంగా వేధిస్తున్నాడు. విషయాన్ని విద్యార్థినులు ఇన్‌చార్జి హెచ్ఎం రమేష్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దాంతో జిల్లా విద్యాశాఖాధికారులకు తెలియడంతో విచారణ జరిపేందుకు ఈనెల 12న ప్రత్యేక కమిటీని వేశారు.

ఆ కమిటీ పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను విచారించగా విషయం వాస్తవమేనని చెప్పారు. ఈ విషయం ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్‌కు తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు.

దీంతో కమిటీ నివేదికను డీఈఓ చైతన్యజైనీకి అందజేసింది. డీఈఓ ఆదేశాల మేరకు అంజయ్యపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాఠశాల హెచ్ఎం నర్సిరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సైదాబాబు కేసు నమోదు చేశారు.

## ఆన్‌లైన్ డేటింగ్ మత్తు..యువత చిత్తు

- ప్రతి నలుగురిలో ముగ్గురుకి వర్చువల్ డేటింగే వైపు మొగ్గు!
- కొత్త పరిచయాల కోసం 58 శాతం మంది తహతహ..
- పేరు బయటపెట్టి: జీ ఆన్‌లైన్ ఫ్రెండ్స్ తో గడపడమే ఇష్టమంటున్న యంగ్ తరంగ్
- డేటింగ్ వలలో పడి మానసికంగా కుంగిపోతోన్న 64శాతం మంది యువతులు
- అసోచాం, మెక్ అఫీ, బడో.కామ్ సర్వేల్లో తేలిన పలు అంశాలు

సోషల్ మీడియా, వర్చువల్ కమ్యూనిటీ యాప్స్ మూలంగా మనుషుల మధ్య దూరం తగ్గి, ఇంటర్నెట్ స్నేహాలు అంతకంతకూ పెరుగుతున్నాయన్న విషయం తెలిసిందే! ఐతే, పెరుగుతున్న ఆ స్నేహం వింతపోకడలకు దారితీస్తున్నదని వివిధ సర్వేల్లో తేలడం ఆందోళనను కలిగిస్తోంది. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..



**ఆన్‌లైన్ డేటింగ్ కొన్ని అంశాలు**

- దేశంలో ఒక్కో యూజర్ రోజుకు 85 నిమిషాల సమయాన్ని డేటిం గ్ యాప్స్ కోసం కేటాయిస్తున్నారని బడో.కామ్ సర్వే పేర్కొంది.
- ఆన్‌లైన్ డేటింగ్ చేస్తున్న వారిలో 50 శాతానికి పైగా ఆన్‌లైన్ డేటర్లు మానసిక సమస్యలతో సతమతమవుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.
- మన ఇండియన్ అబ్బాయి రోజులో సగటున పదిసార్లు ఏదో ఒక డేటింగ్ యాప్‌ను ఓపెన్ చేస్తున్నట్లు తేలింది.
- దేశంలోని యువతలో సుమారు 38 శాతం మంది ఆన్‌లైన్ డేటింగ్‌లో మునిగితేలుతున్నట్టు నిపుణుల సారాంశం.

**- జై**

నచ్చినవారితో తమ అభిరుచులను పంచుకోవడానికి వర్చువల్ వరల్డ్ ను ఓ మాధ్యమంగా ఎన్నుకొని డేటింగ్ కోసం స్మార్ట్‌ఫోన్‌తో కుస్తీపడుతోన్న యువతీ, యువకుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. దశాబ్దకాలం క్రితం.. విదేశాల్లో మొదలైన ఈ ఆన్‌లైన్ డేటింగ్ ను.. భారత యువత ప్రస్తుతం ఓ మంత్రంలా జపిస్తున్నది.

**మారుపేరుతో డేటింగ్ కి 'సై'**

సినిమా, క్రీడాకారుల వంటి సెలబ్రిటీలతో మొదలైన డేటింగ్ వ్యసనం మన దేశంలో మధ్యతరగతి వర్గానికి సైతం చేరువైందని.. ఆన్‌లైన్ డేటింగ్ బారిన పడి మానవసంబంధ బాంధవ్యాల్లో ఉన్న అనుభూతులను నేటి యువత అర్థం చేసుకోవడం మానేసి, పెడదారి పడుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. తాజాగా, అసోచాం సంస్థ చేసిన ఓ సర్వేలో.. మాట్రిమోనియల్ సైట్ల ద్వారా వివాహబంధంతో ఏకమవ్వడం కన్నా, డేటింగ్ యాప్స్ ద్వారా నచ్చిన వారితో కొంతకాలం గడపడానికే(మారుపేరుతో) ఎక్కువ శాతం యువత ఇష్టపడుతున్నారని రూఢీ అయింది. దేశవ్యాప్తంగా పది నగరాల్లో 20 నుంచి 30 సంవత్సరాల మధ్య గల 1500 మంది యువతీ, యువకులపై నిర్వహించిన సర్వేలో సుమారు 55శాతం మంది ఈ అభిప్రాయాన్ని వెల్లడించడం గమనార్హం.

**నలుగురిలో ముగ్గురికి అదే కావాలి**

ఇంటర్నెట్ పుణ్యమా అని మనుషులు ఎంత త్వరగా కలుస్తున్నారో.. అదే స్థాయిలో మనుషుల మనసుల మధ్య దూరం పెరిగిపోతోందని 'మెక్ అఫీ' సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సంస్థ ఢిల్లీ, ముంబయి, బెంగళూరులకు చెందిన 18ఏండ్లు నిండిన 600 మందిపై నిర్వహించిన సర్వే ద్వారా వెల్లడైంది. ఇక, సర్వేలో పాల్గొన్న ప్రతి నలుగురిలో ముగ్గురు.. తమ ముందు ఉన్నవారి కంటే, నచ్చినవారితో వర్చువల్ డేటింగ్ కోసం తహతహలాడుతున్నట్టు తెల్పగా, కొత్త పరిచయాల కోసం డేటింగ్ యాప్స్, వెబ్‌సైట్లు ఉపయోగపడతాయని 58 శాతం మంది భావిస్తున్నట్టు సర్వే ప్రతినిధులు తెలిపారు. ఇక, మన దేశంలో ఆన్‌లైన్ డేటింగ్ సేవలను వినియోగించుకుంటున్న 64 శాతం మంది మహిళలు, 57 శాతం మంది పురుషులు తాము సెక్యూరిటీ, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నామని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో పేర్కొంటూనే.. తమ డేటింగ్ వ్యసనాన్ని మాత్రం ఆపుకోలేకపోతున్నట్టు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

# రబీలో 19 లక్షల ఎకరాలకు సాగునీరు

## మిషన్ భగీరథ అవసరాలకు తగిన నీటి నిల్వ : మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సీఎస్ ఎస్‌కె జోషిని సన్మానిస్తున్న హరీశ్‌రావు

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

ప్రస్తుత రబీ కాలంలో రాష్ట్రంలో 19 లక్షల ఎకరాలకు సారునీరందిస్తున్నట్టు నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్ తదితర ప్రాజెక్టుల కింద నీటి నిర్వహణ, మిషన్ భగీరథ అవసరాలు తదితర అంశాలపై చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో ఆయన జలసౌధలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రబీలో రాష్ట్రంలో శ్రీరాంసాగర్ కింద 6 ల్యక్షలు , నాగార్జునసాగర్ కింద 5 లక్షలు, నిజాంసాగర్ కింద 2 లక్షలు, మీడియం పాజెక్టులకింద 6 లక్షల ఎకరాలకు మొత్తం 19 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. శ్రీరాంసాగర్ పరిధిలో లోయర్ మానేర్ ఎగువన 4 లక్షల ఎకరాలకు, దిగువన 1.15 లక్షల ఎక్రాలకు సాగునీరం దించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి చెప్పారు. ఈ లక్ష్యాలను సాధిస్తూనే మిషన్ భగీరత పథకానికి కేటాయించిన నీటిని జలాశయాల్లో కాపాడుకోవాలని ఇంజనీర్లకు సూచించారు. శ్రీరాంసాగర్ నుండి ఇప్పటితే 7 తడులకు నీరిచ్చామని మరో నాలుగు తడులకు నీరివ్వాల్సిన అవసరం ఉన్నదని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శంకర్ తెలిపారు. శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న చెరువులను కూడా నింపుతున్నామన్నారు. కాలువలపై రాత్రి వేళల్లో కూడా గస్తీ నిర్వహించాలని , అక్రమంగా తూములు కాలువలు పగులకొట్టకుండా చూడాలని గేట్లను ఎత్తివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. చూడాలని అవసరమైతే పోలీస్, రెవెన్యూ అధికారుల సహాయం తీసుకోవాలని మంత్రి ఇంజనీర్లకు సూచించారు.

**సీఎస్‌కు సన్మానం..**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శైలేంద్ర కుమార్ జోషిని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఇంజినీర్లు సన్మానించారు. జలసౌధలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్ మాట్లాడుతూ జోషి ఒక బ్యూరోక్రాట్‌లా కాకుండా తెలంగాణ పౌరునిగా పనిచేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఆయన అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించటంతో జోషి చేసిన కృషిని ముఖ్యమంత్రి కేసీఆర్ గురించారన్నారు. తన 34 సంవత్సరాల సర్వీస్‌లో ఎందరో మంత్రులను చూసినా హరీశ్‌రావు వంటి వారిని చూడలేదని జోషి అన్నారు. ప్రాజెక్టుల కోసం ఆయన పడుతున్న శ్రమ అసాధారణమన్నారు.

**ఏఐబీపీ ప్రాజెక్టులను పూర్తి చేయండి...**

ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (ఏఐబీపీ) కింద చేపట్టిన ప్రాజెక్టుల పనులను సత్వరం పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఏఐబీపీ ప్రాజెక్టులపై గురువారం ఢిల్లీలో నితిన్ గడ్కరీ అధ్యక్షతన సమావేశం జరగనున్న నేపథ్యంలో వివిధ ప్రాజెక్టులపై మంత్రి సమీక్షించారు. కేంద్రం మంజూరు చేసిన నిధుల వినియోగానికి సంబంధించిన యూసీలను వెంటనే పంపించాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. ఏఐబీపీ పథకం కింద రాష్ట్రంలో 11 ప్రాజెక్టులకు కేంద్రం రూ. 1,000 కోట్ల నిధులు అందిస్తుందని మంత్రి చెప్పారు.

### సీతారామ పనులు వేగవంతం చేయండి

ఖమ్మం జిల్లాలో సీతారామ లిఫ్ట్ పథకంలో పంప్‌హౌస్‌ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు చెందిన భూసేకరణ, అటవీపర్యావరణ అనుమతులు, పంప్ హౌస్‌లు, కాల్వలు తదితర పనుల పురోగతిపై బుధవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతి అనుకున్నంత వేగంగా లేవని, మందకొడిగా సాగుతు న్నాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. 1,2,3 ప్యాకేజిల పనులను వారు సమీక్షించారు. వెంటనే అగ్రి మెంట్లు పూర్తి చేసి అన్ని పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

# టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

## యూటీఎఫ్, టీపీటీఎఫ్ ప్రతినిధులతో సీఎస్ జోషి



**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి అన్నారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూ టీఎఫ్), టీపీటీఎఫ్ సంఘాల ప్రతినిధులు సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనీ, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. భాషా పండితుల అప్‌గ్రేడేషన్, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ టీచర్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరిం చాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. అందుకు సాను కూలంగా స్పందించిన ప్రధాన కార్యదర్శి జోషి...విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ నిచ్చారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి, రాష్ట్ర కార్యదర్శులు మాణిక్‌రెడ్డి, మేడె దేవదాసు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండల్‌రెడ్డి, మీస శ్రీనివాస్ ఉన్నారు.

**పీఆర్‌టీయూటీ ఆధ్వర్యంలో...**

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీ యూటీ ప్రతినిధులు సీఎస్‌ను కలిశారు.


ఈ సందర్భంగా నూతన పీఆర్‌సీ కోసం కమిటీ వేయాలనీ, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ, ఏకీకృత సర్వీస్‌–రూల్స్ సమస్య పరిష్కరించాలని ఆయనను కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో పీఆర్‌టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

## 'హిందువు కాదని ఎలా నోటీసులు ఇస్తారు'

**నవతెలంగాణ–హైదరాబాద్**

తాను హిందువును కాదని చెప్పి ఉద్యోగంలో చేరాక వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ తిరుమల తిరుపతి దేవస్థానం ఎలా నోటీసులు జారీ చేస్తుందని హైకోర్టు ప్రశ్నించింది. తాము హిందూవేతరులనే విషయాన్ని గోప్యంగా ఉంచి హిందువని చెప్పి ఉద్యోగంలో చేరిన వారికి నోటీసు జారీ చేశారంటే అర్థం చేసుకోవచ్చునని హైకోర్టు అభిప్రాయపడింది. హిందూవేతర్లను ఉద్యోగం నుంచి తొలగిస్తామని టీటీడీ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ క్రిస్టియన్, ముస్లిం మతాలకు చెందిన ఉద్యోగులు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ రిట్‌ను విచారస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇన్నేళ్లపాటు ఉద్యోగాలు చేసిన వారిని తొలగిస్తామంటే వారంతా ఎక్కడికి వెళ్లాలని, వారికి ఎవరు ఉద్యోగాలు ఇస్తారని, వారి కుటుం బాలు ఏం కావాలని బెంచ్ టీటీడీని ప్రశ్నించింది.

## హింసకు వ్యతిరేకంగా మహా నిరసన



**మనీలా:** మహిళలు, చిన్నా రులపై జరుగు తున్న హిం సకు వ్యతి రేకంగా ఫిలి ప్పీన్స్‌లో వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన జరిగింది. ప్రపంచ ప్రేమికుల దినో త్సవాన్ని పురస్క రించు కొని రాజధాని మనీ లాలో వేలాది మంది మహిళలు ఒకచోట చేరి నృత్యం చేశారు. 'వన్ బిలియన్ రైజింగ్' పేరుతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో మహి ళలు, చిన్నా రులపై జరుగుతున్న హింస కు వ్యతిరేకంగా గళ్లెం చారు. ఇందులో చిన్నారుల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు అంతా ఏకమై పాల్గొన్నారు. మణిక ట్టుకు పింక్ రిబ్బన్ కట్టుకొని నృ త్యాలు విశేషంగా ఆకట్టుకు న్నాయి.

# నవచిత్రం

## ఆద్యంతం వినోదాత్మకం..


నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై నిఖిత రెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకుడు. పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్ ఖాతా పీకే క్రియేటివ్ వర్క్స్ ద్వారా బుధవారం ఈ చిత్ర టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. సందర్భంగా ఆయన చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. 'ఈ చిత్ర టీజర్‌కు లభిస్తున్న స్పందన ఎంతో సంతోషంగా ఉంద'ని హీరో నితిన్ సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు, అభిమానులకు కృతజ్ఞతలు చెప్పారు. నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు హైదరాబాద్, ఊటీ, అమెరికాలో షూటింగ్ జరిపాం. చివరి పాట చిత్రీకరణ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నితిన్‌పై ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. శేఖర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 5న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. 'ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగాను, సరదాగానూ సినిమా సాగుతుంది' అని దర్శకుడు కృష్ణచైతన్య తెలిపారు. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృత్తిక, మాస్టర్ జోయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్, కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, ఫైట్స్ : స్టంట్ సిల్వ, రవివర్మ.


'ఫన్నీఖాన్' చిత్రంలో ఐశ్వర్యరాయ్

## ప్రేక్షకులను మెప్పించే రచయిత

విద్యా సాగర్ రాజు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత'. సంచిత పదుకొనే కథానాయికగా నటించిన ఈ సినిమాను దుహర మూవీస్ పతాకంపై కళ్యాణ్ ధూళిపాళ్ల నిర్మించారు. ఈ నెల 16న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో అతిథిగా విచ్చేసిన దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటికే పబ్లిక్‌కి చూపించాం. ప్రతి ఒక్కరూ సినిమాను మెచ్చుకున్నారు. చంద్రబోస్ రాసిన పాటలు బాగున్నాయి. హీరో విద్యాసాగర్ కొత్తవాడైనా అతన్ని ప్రోత్సహించి సినిమాను నిర్మించిన నిర్మాతకు అభినందనలు. సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుంది. విడుదల విషయంలో నిర్మాత చాలా ఇబ్బందులెదుర్కొన్నారు. దీంతో మా రంజిత్ మూవీస్‌పై నైజాంలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాం. తోటి నిర్మాతలతోను, థియేటర్ల ఓనర్లతో మాట్లాడి


సంచిత పదుకొనే, విద్యాసాగర్ రాజు

రిలీజ్ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తాం. ఈ చిత్రం కోసం జగపతిబాబు వైజాగ్, విజయవాడ, ప్రకాశం జిల్లాల్లో వాక్ చేసి ప్రమోట్ చేశారు. ఆయన్ని అభినందించాలి' అని అన్నారు. 'ఎమోషనల్ థ్రిల్లింగ్ అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం. ఒక అమ్మాయి మనసు డెప్త్ ఎంత ఉంటుందో ఇందులో చూపించాం. చంద్రబోస్ అందించిన మూడు పాటలకు లిరిక్స్ బాగా కుదిరాయి. నన్ను నమ్మి రాజీపడకుండా నిర్మించిన నిర్మాతకు ధన్యవాదాలు. అన్ని వర్గాల వారిని అలరించే చిత్రమవుతుంది' అని దర్శకుడు తెలిపారు. చంద్రబోస్ చెబుతూ, 'ఈ కథ చెప్పినప్పుడు ఎగ్జైట్ అయ్యా. కథానుగుణంగా పాటలకు సాహిత్యం అందించే అవకాశం ఇచ్చారు నిర్మాత. మంచి సాహిత్యాన్ని అందించానని అనుకుంటున్నాను' అని చెప్పారు. 'సినిమాను నిర్మించడం ఓ ఎత్తైతే, దాన్ని రిలీజ్ చేయడం మరో ఎత్తని ఈ సినిమా విషయంలో తెలిసింది. ఎన్నో అడ్డంకులను అధిగమించడానికి నిర్మాత దామోదర ప్రసాద్, రాందాస్, హీరో జగపతిబాబు కృషి చేశారు. వారికి ధన్యవాదాలు' అని నిర్మాత చెప్పారు.


కిరణ్, సంజయ్ స్వరూప్, మహేష్, జాన్వీ, మంజుల, అమైరా దస్తూర్, సందీప్ కిషన్

## షాక్‌తోపాటు గర్వంగానూ ఫీలయ్యా

### - 'మనసుకు నచ్చింది' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో మహేష్

'అక్క మంజుల డైరెక్షన్ చేస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఈ విషయం చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఓ రకంగా గర్వంగానూ ఫీలయ్యా' అని మహేష్‌బాబు అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్-ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 16న సినిమా విడుదల కానున్న సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు.

అతిథిగా విచ్చేసిన మహేష్‌బాబు మాట్లాడుతూ, 'ఓ సారి హాలీడేస్ టైమ్‌లో మంజుల ఏదో రాస్తుంటే పోయెట్రీ లాంటిది రాస్తుందేమో అనుకున్నా. కానీ సినిమా కోసం కథ రాసుకుంటుందని మాత్రం ఊహించలేదు. సినిమాలో విజువల్స్ నాకు బాగా నచ్చాయి. అందుకే వాయిస్ ఓవర్ ఇచ్చాను. మా కిరణ్ సపోర్ట్, గైడెన్స్ ఉండటం సినిమాకు చాలా ప్లస్ అయ్యింది. తప్పకుండా సినిమా మంచి హిట్ అవుతుందని ఆశిస్తున్నా. భవిష్యత్‌లో మా అక్క మంజులతో నేను సినిమా కూడా చేస్తానేమో' అని అన్నారు.

'కథ రాయటం నుంచి సినిమా పూర్తి చేయడం వరకు ఓ నేచురల్ ప్రాసెస్‌లా జరిగింది. మా తమ్ముడు మహేష్, నాన్నగారు గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా కోసం వాయిస్ ఓవర్ చెప్పరా అని అడిగితే మహేష్ ఒప్పుకున్నాడు. కానీ రెండు, మూడు వేరియేషన్స్‌లో చెప్పమంటే 'వేరే వాళ్ళతో చెప్పించుకో..' అనేవాడు. ఓ సందర్భంలో మహేష్ కొడుకు గౌతమ్ 'నాన్న మంజుల ఆంటీ సినిమాలో ఎప్పుడు యాక్ట్ చేస్తావ్?' అని అడిగితే చాలా సింపుల్‌గా 'అదే నా ఆఖరి సినిమా అవుతుంది' అన్నాడట (నవ్వుతూ). రవియాదవ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాకి పెద్ద అస్సెట్. దినేష్ మాస్టర్ కంపోజ్ చేసిన సాంగ్స్ చాలా స్పెషల్‌గా ఉంటాయి. సందీప్ అద్భుతంగా నటించాడు. అమైరా దస్తూర్ చాలా అందంగా కనిపిస్తుంది. నిర్మాత కిరణ్ ఇచ్చిన సపోర్ట్ మరువలేనిది' అని దర్శకురాలు మంజుల తెలిపారు.

హీరో సందీప్ కిషన్ చెబుతూ, 'ఈ ఈవెంట్‌కు మహేష్‌బాబు వచ్చి మమ్మల్ని విష్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను సెట్స్‌లో ప్రతి ఒక్కరిని చాలా హుందాగా ఆటపట్టిస్తూ ఉండేవాడిని. అలా చేసినప్పుడు 'అచ్చు మహేష్ కూడా ఇలాగే చేసేవాడు' అని మంజుల అనేవారు. ఆమె దర్శకురాలిగా పరిచయమవుతున్న సినిమాలో నేను హీరోగా నటించడం నా అదృష్టం' అని చెప్పారు.

'ఈ వాలెంటైన్స్ డేని సూపర్‌స్టార్ మహేష్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది' అని అమైరా దస్తూర్ తెలిపారు. 'ఈ నెల 16న విడుదల కానున్న మా చిత్రాన్ని ఆదరించాలి' అని నిర్మాత పి.కిరణ్ చెప్పారు.


సోనాక్షి సిన్హా

## ముచ్చటగా మూడోసారి..

'సల్మాన్‌తో మరోసారి కలిసి నటించడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది' అని అంటోంది సోనాక్షి సిన్హా. గతంలో సల్మాన్ ఖాన్, సోనాక్షి 'దబాంగ్', 'దబాంగ్ 2' చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె దిల్జిత్ దోసాంజేతో కలిసి 'వెల్‌కమ్ టూ న్యూయార్క్' చిత్రంలో నటిస్తోంది. చక్రి తోలేటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కరణ్ జోహార్, రానా కీలక పాత్రలు పోషిస్తున్నారు. సల్మాన్ ఇందులో ఓ పాటలో అతిథిగా మెరవనున్నారు. 'నయిన్ ఫిసల్ గయే' అంటూ సాగే ఈ పాటలో సల్మాన్‌తో కలిసి డాన్స్ చేయడం పట్ల సోనాక్షి ఆనందాన్ని వ్యక్తం చేసింది. 'మూడవ సారి సల్మాన్‌తో కలిసి నటించడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. ఈ పాటను మొత్తం న్యూయార్క్‌లో చిత్రీకరించాం. రొమాంటిక్ మెలోడీగా ఈ పాట సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపింది. ఈ పాటకు సాజిద్-వాజిద్ సంగీతం సమకూర్చగా, కౌసర్ మునిర్ సాహిత్యమందించారు. సోనాక్షి ప్రస్తుతం దీంతోపాటు 'హ్యాపీ భాగ్ జాయేగి రిటర్న్స్' చిత్రంలోనూ నటిస్తోంది.

## సమ్మర్ స్పెషల్..

సుమంత్ అశ్విన్, నిహారిక కొణిదెల జంటగా లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో యువి క్రియేషన్స్ సమర్పణలో పాకెట్ సినిమా పతాకంపై రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ వెడ్డింగ్'. త్వరలో టీజర్ విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ, 'వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రతిష్టాత్మక యువి క్రియేషన్స్ సంస్థతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. 'ఫిదా' సినిమాతో మ్యూజిక్ ఛార్ట్‌బస్టర్‌ని అందించిన శక్తికాంత్ కార్తిక్ మా సినిమాకు మంచి బాణీలను అందిస్తున్నారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్ జరుపుకుంటోంది. పెళ్లి కుదిరిన రోజు నుంచి పెళ్ళి జరిగే రోజు వరకూ మధ్యలో రెండు కుటుంబాల మధ్య, రెండు మనసుల మధ్య ఏం జరుగుతుందనే విషయాన్ని దర్శకుడు చాలా అందంగా తెరపై ఆవిష్కరించాడు. ప్రతి ఒక్కరి జీవితంలో ఇలాంటి అనుభవం ఉంటుంది. దీంతో ప్రతి ప్రేక్షకుడు సినిమాలోని పాత్రల్లో తమని తాము చూసుకుంటారు. త్వరలోనే టీజర్‌ను రిలీజ్ చేస్తాం. సమ్మర్ కానుకగా గ్రాండ్‌గా సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం. ఈ సమ్మర్‌కి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని అలరిస్తుందీ చిత్రం' అని అన్నారు. నరేష్, మురళీశర్మ, పవిత్ర లోకేష్, తులసి, ఇంద్రజ, మధుమణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల్‌రెడ్డి.

## క్లైమాక్స్‌లో సాక్ష్యం


పూజా హెగ్డే
బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజును పురస్కరించుకుని బుధవారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అభిషేక్ నామా మాట్లాడుతూ, 'ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డేల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. వారి పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. దర్శకుడు శ్రీవాస్ హీరోహీరోయిన్ల పాత్రల తీరుతెన్నులను రాసిన విధానం ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ద్వారా ఓ కొత్త శ్రీవాస్‌ను చూస్తారు. ఆయన దర్శకత్వ శైలి పూర్తిగా మారిపోయింది. ఆయన ఈ సినిమాను తెరకెక్కించిన తీరు ప్రేక్షకుల్ని సైతం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సినిమాలో ఫైట్ సీక్వెన్స్‌లు చాలా కీలకం. అందుకే పీటర్ హెయిన్స్ మాస్టర్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని వాటిని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో హీరో హీరోయిన్ల కాంబినేషన్ సీన్స్‌తోపాటు కీలక పాత్రధారులైన జయప్రకాష్, పవిత్ర లోకేష్, వెన్నెల కిశోర్‌ల కాంబినేషన్‌లో మరికొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం' అని అన్నారు. జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఎ.విల్సన్. సంగీతం: హర్షవర్ధన్.


నిహారిక
సుమంత్ అశ్విన్

## స్వచ్ఛమైన ప్రేమకథతో మసక్కలి

సాయి రోనక్, శ్రావ్యా, శిరీష హీరోహీరోయిన్లుగా నబి ఎనుగుబాల దర్శకత్వంలో డూ గుడ్ ఫాలో రైట్ ప్రొడక్షన్స్ పతాకంపై సుమిత్ సింగ్ నిర్మిస్తున్న చిత్రం 'మసక్కలి'. ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన తమ్మారెడ్డి భరద్వాజ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కొన్ని కథలను వింటే నమ్ముతాం. కొన్ని కథలను చూస్తే నమ్ముతాం. మరికొన్ని కథలను చూసినా, విన్నా నమ్మలేం. నమ్మలేని కథలు నిజమైనప్పుడు ఎంత అద్భుతంగా ఉంటాయనే డైలాగులు ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి. సినిమా కూడా అలానే అద్భుతంగా ఉంటుందనిపిస్తుంది. చిన్న సినిమాలకు మాలాంటి వాళ్ళు హెల్ప్ చేయాలని కోరతారు. కానీ సరిగా ఉపయోగించుకోరు. సినిమా ఫస్ట్ కాపీ రాగానే విడుదల చేయాలనుకుంటారు. మంచి టైమ్ చూసుకుని విడుదల చేయడం చిన్న సినిమాకు చాలా ముఖ్యం' అని అన్నారు. 'సినిమా అంతా పాజిటివిటీ ఉంది. ట్రైలర్ చూస్తే మంచి లవ్ స్టోరీ అనిపిస్తుంది. ఇందులోని 'ఒక్క క్షణం' నా ఫేవరేట్ సాంగ్. దర్శక, నిర్మాతలు సినిమా కోసం చాలా కష్టపడ్డారు. విజయం సాధించి టీమ్‌కు మంచి పేరు తీసుకురావాలి' అని మధుర శ్రీధర్ తెలిపారు. దర్శకుడు నబి చెబుతూ, 'ప్రతి ఒక్కరికి సోల్ ఉంటుంది. ఆ ఆత్మ స్వచ్ఛంగా ఉంటుంది. ఆత్మలాగే స్వచ్ఛమైన ప్రేమకథతో రూపొందించిన చిత్రమిది. ఆ స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిబింబించే విధంగా 'మసక్కలి' టైటిల్ పెట్టాం. ఎమోషనల్, క్లీన్ లవ్, సెంటిమెంట్ తదితర అంశాల సమాహారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సైకలాజికల్ గేమ్‌గా ఈ సినిమా సాగుతుంది. ప్రతి డైలాగు, పాటలోని ప్రతి అక్షరం వెనకాల ఓ గాథ ఉంటుంది. ట్యూన్స్ కొత్తగా ఉంటాయి. మిహిరామ్ మంచి మ్యూజిక్ అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'ప్రేమ అనేది ఎంత స్వచ్ఛమైనదో తెలిపే చిత్రమిది' అని రవివర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిహిరామ్, శివ శర్వాణి, అలరాజు తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


మధుర శ్రీధర్, సుమిత్ సింగ్, తమ్మారెడ్డి భరద్వాజ, నబి ఎనుగుబాల


## తొలిప్రేమ విజయానందం..


బాపినీడు, రాశీఖన్నా, వరుణ్‌తేజ్, వెంకీ అట్లూరి, దిల్‌రాజు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, థమన్ తదితరులు

వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించిన చిత్రం 'తొలిప్రేమ'. ఇటీవల విడుదలైన సినిమాకు పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన దిల్‌రాజు మాట్లాడుతూ, 'దర్శకుడు వెంకీ ఈ చిత్రాన్ని బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌తో చేస్తున్నామని చెప్పినప్పుడు సరే అన్నా. ఓ అసిస్టెంట్ డైరెక్టర్ వెయిటింగ్‌లో ఉన్నప్పుడు పడే ఆవేదన నాకు తెలుసు. ముందు నుంచి ప్రసాద్‌తో మంచి అనుబంధం ఉంది. అందుకే ఈ సినిమా మళ్ళీ నా చేతుల్లోకి వచ్చింది. పవన్ కళ్యాణ్‌తో కరుణాకరన్ 'తొలిప్రేమ'ను క్రియేట్ చేస్తే, ఇప్పుడు వెంకీ అట్లూరి మళ్ళీ ఆ 'తొలిప్రేమ'ను రీ క్రియేట్ చేశాడు. 'ఫిదా' తర్వాత వరుణ్ తేజ్ మరోసారి అద్భుతంగా నటించాడు. మూడు వేరియేషన్స్‌లో ఆయన చూపించిన వైవిధ్యం, పలికించిన భావోద్వేగాలు అందరినీ మెప్పించాయి. సినిమా ఇంత పెద్ద సక్సెస్ అయినందుకు హ్యాపీగా ఉంది' అని అన్నారు. 'టెక్నీషియన్లందరి సహకారంతో నమ్మి చేసిన చిత్రమిది. అందుకే సక్సెస్ అయ్యింది' అని నిర్మాత చెప్పారు.

వరుణ్ తేజ్ చెబుతూ, 'నమ్మి చేసిన చిత్రమిది. వెంకీ ఈ కథను ఎంతో ఇష్టపడి తయారు చేసుకున్నాడు. ఇంత మంచి విజయాన్ని అందించిన వెంకీకి రుణపడి ఉంటాను. సినిమాలో రాశిఖన్నాతో కెమిస్ట్రీ బాగుందని చాలా మంది ప్రశంసించారు. కెమెరామెన్ జార్జి, మ్యూజిక్ డైరెక్టర్ థమన్, దర్శకుడు వెంకీ మధ్య బాండింగ్ చాలా బాగుంది. వారు సినిమాను ప్రేమించిన విధానం తెరపై ప్రతిబింబిస్తుంది. పెదనాన్న చిరంజీవి సినిమా చూసి డెబ్యూ డైరెక్టర్ ఇంత బాగా చేశాడా అని షాక్ అయ్యారు' అని చెప్పారు. 'నిర్మాత ప్రసాద్ టెక్నీషియన్ల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని చేయిస్తుంటారు. ఈ చిత్ర మ్యూజిక్ సక్సెస్‌లో సగం క్రెడిట్ ఆయనకే ఇస్తాను' అని థమన్ తెలిపారు. దర్శకుడు వెంకీ చెబుతూ, 'నా తొలి ప్రయత్నాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. కెమెరామెన్ జార్జి నాకు చాలా ప్రత్యేకం. సినిమాకు చాలా కష్టపడ్డాడు. వరుణ్ తేజ్ నమ్మడం వల్లే సినిమా పురుడుపోసుకుంది' అని చెప్పారు. 'ఈ చిత్రంతో నాకు మహిళా అభిమానులు బాగా పెరిగారు. ఆడియెన్స్ రిపీటెడ్‌గా సినిమాను చూస్తుంటే హ్యాపీగా ఉంది' అని రాశీఖన్నా తెలిపారు.

# బహుజన నేతలు రాక్షసులా?



జంగిటి వెంకటేష్

బహుజనులం రాక్షసులమా?. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు శూద్రజాతిగా పిలవబడిన వర్గానికి చెందిన రెడ్డి, వెలమ, కమ్మ వీరంతా రాక్షసులేనా? అవుననే అంటున్నాయి మన పుక్కిటి పురాణాలు. రావణాసూరుడు, నరకాసూరుడు, హిరణకశివుడు, హిరణ్యాక్షుడు, బలి చక్రవర్తి వరకూ వీరంతా రాక్షసులే కదా? అని అమాయకగా ప్రశ్నించే వారికి కొదవేలేదు. ఎందుకంటే మనువాదులు మొదటి నుంచీ వీరందరినీ రాక్షసులుగా చిత్రీకరిస్తూ వచ్చారు కాబట్టి. రావణుడైనా, నరకాసురుడైనా, హిరణకశివుడైనా మనకు రాక్షసులుగానే తెలుసు. తాతల తండ్రుల కాలం నుంచీ చిన్నతనంలో చెప్పే కట్టుకథలన్నింటిలో రాక్షసులుగానే పేర్కొన్నారు. సినిమాలు, పాతపుస్తకాలు, కథల పుస్తకాల్లోనూ ఇదే ధోరని కొనసాగింది. కాబట్టి వీరంతా రాక్షసులే. అసలు వీరంతా ఎవరు అని ప్రశ్నించుకుంటే వీరే మనమూ, మనమే వీరు. అంటే బహుజనులం. ఈ గడ్డమీద పుట్టి ఈ గడ్డను పరిపాలించిన రావణాసూరుడు, నరకాసూరుడు, హిరణ్యకశివుడు, హిరణ్యాక్షుడు వంటి రాజులు, చక్రవర్తులను మనువాదులు ఎందుకు రాక్షసులుగా చిత్రీకరించాల్సి వచ్చిందనేది ప్రత్యేకంగా చర్చించాల్సి వస్తుంది. ఆర్యులు ఈ ప్రాంతానికి వలస వచ్చిన తెగలు. ఓ కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చి కుక్క అని ప్రచారం చేయడం తెలిసిందే. అమెరికా సద్దాం హుస్సేన్‌ను గడాఫీని హతమార్చడం వెనుక సామ్రాజ్యవాద కాంక్షతోపాటు తమను ధిక్కరిస్తున్నారనే కారణం దాగి ఉంది. సద్దాం ధిక్కరణతో ఇరాక్ పొరుగు దేశాల్లోనూ తన ప్రాబల్యం తగ్గిపోయి చివరకు పెట్రోల్ కోసం దేబిరించాల్సిన దుస్థితి తలెత్తుతుందని గ్రహించే అమెరికా సామ్రాజ్యవాదులు సద్దాం, గడాఫీ వంటి దేశాధ్యక్షులను హతమార్చారు. ఇదే తరహాలో ఈ దేశంలోని నిజమైన మూలవాసులైన రాజులు తమకు అణిగిమణిగి ఉండటంలేదనే కారణంతో వారిని అత్యంత కిరాతకంగా హతమార్చేవారు. ఆ రాజుల స్థానంలో తమకు విధేయులుగా ఉండేవారిని నియమించుకునేవారు. అయితే ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ఆయా రాజులను రాక్షసులుగా చిత్రీకరిస్తూ విష్ణువు అవతార పురుషుడిగా జన్మనెత్తి వారిని హతమార్చినట్టుగా మనువాదులు కట్టుకథలు సృష్టించారు. ఈ కోవలోనే హిరణ్యాక్షుడిని పంది అవతారంతో హిరణ్యకశివుడిని నరసింహావతారంలో, రావణాసూడిని రాముడి అవతారంలో, కంసుడిని కృష్ణుడి అవతారంలో, బలిచక్రవర్తిని వామనుడి అవతారంలో మొత్తం పది అవతారాలు ఎత్తి రాక్షసులనంతా తుదముట్టించినట్టు మనువాదులు చరిత్రకెక్కించారు. కానీ హిరణ్యాక్షుడు మొదలుకొని రావణుడు, బలిచక్రవర్తి వరకూ చక్రవర్తులంతా చేయరాని నేరం ఏమీ లేదు. మనులు, ఋషుల వేషాల్లో తపస్సు పేరిట రాజ్యానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న మనువాదులను పట్టి బంధించడాన్ని ఈ మనువాద శక్తులు మరో రకంగా ప్రచారం సాగించాయి. మునులు, ఋషులు తమ మానాన ముక్కు మూసుకొని తపస్సు చేసుకుంటుంటే యజ్ఞయాగాదులు నిర్వహించుకుంటుంటే రాక్షసులు వాటిని అడ్డుకునే ప్రయత్నాలు చేశారని కట్టుకథలు అల్లారు. నిజానికి యజ్ఞాలు అనేవి మనువాదుల ఆలోచణలో రాజ్యాన్ని దక్కించుకోవడానికి సాగించే ప్రయత్నాలే. అశ్వమేధ యాగం అంటే ఏమిటి? అశ్వం తిరిగినంత భూమిని పాలించే హక్కు బ్రాహ్మణుల స్వంతమవుతుంది. అశ్వమేధ యాగం మాదిరిగానే ఇతర యాగాల పేరిట మనువాదులు కుట్రలకు పాల్పడేవారు. స్థానిక తెగలు ఈ కుట్రలను తిప్పికొట్టేవారు. తెగల నాయకులు బతికి ఉన్నంత వరకూ తమ ఆటలు సాగవని గుర్తించిన మనువాదులు తమ వ్యతిరేక శక్తులైన వీరిని అవతారాల పేరిట హతమారుస్తూ వచ్చారు. హిరణ్యకశివుడి కొడుకైన ప్రహలాదుడిని తమకు అనుకూలంగా మలుచుకొని హిరణ్యకశివుడిని నరసింహ అవతారం పేరిట కిరాతకంగా చంపడం జరిగింది. నిజానికి భూ ప్రపంచంలో ఎక్కడా సగం మనిషి సగం సింహంలా ఏ ప్రాణీ జన్మించే అవకాశం ఉండదు. చంపడమే ఓ పెద్ద తప్పంటే దానికి పగలు కాదు, రేయి కాదు. ఇంటకాదు, బయట కాదు, మనిషి కాదు, జంతువు కాదు అంటూ కొత్త నిర్వచనాలను మొదలు పెట్టారు. నరసింహ అవతారాన్ని నిదర్శనంగా తీసుకుంటే చాలు మనువాదులు స్థానిక తెగలను ఎట్లా చిత్రీకరించారో అర్థం అవుతుంది. అలాగే రావణాసూరుడు విషయానికి వస్తే రావణుడు ఏం తప్పు చేశాడు. తన సోదరి అత్యంత సౌందర్యవతి అయిన శూర్పణఖ లక్ష్మణిడిని చూసి వివాహం చేసుకుంటానని ప్రతిపాదించింది. ఇందులో తప్పేమీ లేదే. మనువాదులు చెప్తున్నట్టు శూర్పణఖ రాక్షసి కాదు. అందవిహీనురాలు అసలే కాదు. సౌందర్యరాశి అయిన ఆడది పెండ్లీ చేసుకోవాలని కోరితే లక్ష్మణుడికి కోపం ఎందుకంటే శూర్పణఖ ఒక శూద్రురాలు కాబట్టి. అంటే క్షత్రియుడినైన తనను ఓ శూద్రురాలు పెండ్లి చేసుకుంటాననడం లక్ష్మణుడికి కోపం తెప్పించింది. అదే శృంగారంలో గడపమంటే మాత్రం లక్ష్మణుడికి కోపం వచ్చేది కాదు. తమకంటే నీచమైన కులంలో పుట్టిన ఆడది తనను పెండ్లి చేసుకోమనడమా అనే అహంభావం, అహంకారంతో లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసి పంపారు. దీంతో రావవణుడికి కోపం వచ్చింది. స్వంత చెల్లి ముక్కు, చెవులు కోస్తే ఏ అన్నకైనా కోపం రావడం సహజం. ఆ ప్రాంతానికి రాజైన రావణుడికి కోపం రావడంలో తప్పేముంది. అయితే రామలక్ష్మణులకు బుద్ధి చెప్పాలనే ఆలోచనతో రావణుడు సీతను లంకకు తీసుకెళ్లాడు. రావణాసూరిడిలో ఎటువంటి నీచమైన ఆలోచనలు లేవు. కాబట్టే సీతను ఏమీ చేయలేదని మనువాదుల పుక్కిట పురాణాలే చెప్తున్నాయి. ఒకవేళ రావణుడు నిజంగానే నీచుడై ఉంటే సీతను వివాహం చేసుకునేవాడే. శూర్పణఖ విషయంలో తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సీతను ఎత్తుకెళ్లాడనే కసితో రావణుడిని హతమార్చి రాజ్యాన్ని విభీషనుడికి అప్పగించాడు రాముడు. రావణుడిని చంపేందుకు అతని స్వంత సోదరులైన విభీషణుడిని పావుగా వాడుకోవడం ఏ నీతి కిందకు వస్తుంది. ఇక బలిచక్రవర్తి విషయంలో ఇప్పటి వరకూ ప్రచారంలో ఉన్న కట్టుకథల్లోని కుట్రలను అర్థం చేసుకోవాలి. మనువాదులు చెప్పే కథల ప్రకారం మరుగుజ్జు వేషంలోని వామనుడు బలి చక్రవర్తిని మూడు అడుగుల జాగ అడుగుతారు. దానికి బలి సరేనంటాడు. మరుగుజ్జు వామనుడు ఆకాశమంత ఎదిగి ఓ అడుగుతో ఆకాశాన్ని మరో అడుగుతో భూమిని కప్పేస్తాడు. మూడో అడుగు ఎక్కడ పెట్టాలంటూ బలిని ప్రశ్నిస్తాడు. ఇక్కడే అసలు విషయం దాగి ఉంది. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన వామనుడు ఓ అడుగుతో ఆకాశాన్ని మరో అడుగుతో భూమిని కప్పేశాడంటున్నారు. మరి బలి చక్రవర్తి వామనుడి అడుగు కింద నలిగిపోవాలి కదా? అతను గాలిలో తేలడానికి అతీతశక్తులేమైనా ఉన్నాయా? ఒక వేళ ఉండే ఉంటే కపట వామనుడి మాయమాటలకు ఎందుకు మోసపోయేవాడు. దీన్ని బట్టి ఏమర్థం అవుతుంది. వామనుడనేవాడు కేవలం సాధారణ బ్రాహ్మణుడు మాత్రమే. తప్ప అతను ఆకాశమంత ఎత్తుకు ఎదిగే గొప్ప వాడు కాదని. మరి నిజమేంటి? నిజమేంటంటే హిరణకశిడి కొడుకైన ప్రహలాదుడి కొడుకు విరోచితుడు. అతని కొడుకు బలి చక్రవర్తి. హిరణకశివుడి తరువాత ఆ వంశంలోని వారంతా మనువాదులకు తొత్తులుగానే కొనసాగారు. ఇందులో బలి చక్రవర్తి కూడా. అయితే భూమిపైనే రాజుగా కొనసాగుతున్న ఇంద్రుడు బలి చక్రవర్తి సైన్యాధ్యక్షుడిని నరికి చంపాడు. దీంతో అప్పటి వరకూ ఇంద్రుడికి అనుకూలంగా వ్యవహరించిన బలి చక్రవర్తి కోపం పట్టలేక ఇంద్రుడి రాజ్యంపై దండెత్తి తన ఆధీనంలోకి తీసుకున్నాడు. ఇంద్రుడి వంటి రాజులు పారిపోయారు. ఆ తరువాత ఇంద్రుడి ఆదేశాలతో వామనుడనే బ్రహ్మణుడు బలి చక్రవర్తి అనుమతితో తనీ రాజ్యంలో అడుగుపెట్టాడు. తాను వచ్చిందే బలి చక్రవర్తిని మట్టుబెట్టడానికి. కాబట్టి వచ్చీ రాగానే ఆ పనిని మొదలు పెట్టాడు వామనుడు. ఇందులో భాగంగా రావణాసూరిడిని, హిరణ్యకశివుడిని హతమార్చేందుకు వారి సోదరులు, వంశస్థులను ఉపయోగించుకున్న తీరును బలి చక్రవర్తిని చంపడానికి అతని దాయాదులను చేరదీసి బలిని పట్టి దారుణంగా చంపేశారు. అంతే తప్ప మూడగుడుల జాగ అంటూ పాతాళానికి తొక్కేయలేదు. అటువంటి శక్తి ఎవరికీ లేదు. నరకాసురిడి విషయంలోనూ ఇదే జరిగింది. చివరికి బ్రాహ్మణరచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన బుద్ధుడి విధానాలకు ప్రజలు ఆకర్షితులవడంతో బుద్ధుడూ దశావతారాల్లో భాగమంటూ మనకు దూరం చేసే కుట్రలు సాగించారు. ఇదంతా ఎందుకు జరిగిందంటే రాజ్యాధికారం కోసమే అని చెప్పాలి. మన రాజులు, చక్రవర్తులను పూర్తిగా మట్టుబెట్టి ఆ తరువాత మనల్ని నీచులుగా, శూద్రులుగా, అంటరానివారిగా మార్చేశారు మనువాదులు. వేల సంవత్సరాల నుంచి అణిచివేస్తూనే ఉన్నారు. అంతేతప్ప పురాణాల్లో రాసుకున్నట్టు ఎక్కడా రాక్షసులంటూ పుట్టలేదు. రాక్షసులని బహుజనులను మాత్రమే సంబోధించే వారు. వీటిని నమ్ముతూ మనల్ని మనమే రాక్షసులుగా చెప్పుకోవడం సిగ్గుచేటు. నిజానికి మనరాజ్యాలను కొల్లగొట్టి మనల్ని కాళ్లకింద నలిపేసిన మనువాదులే నిజమైన రాక్షసులు. ఎన్నాళ్లని, ఇంకెన్నాళ్లని మనువాదపు మాయల్లో మునిగిపోతాం. ఇకనైనా కండ్లు తెరుద్దాం. మనువాదాన్ని మట్టుబెడదాం.

సెల్ : 9052889696

# పేదరికం నిర్మూలించని అభివృద్ధి ఎవరికోసం?



మేకిరి దామోదర్

భారతదేశ రాజకీయాలలో మనం ఒక వ్యక్తికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ అనే సూత్రాన్ని పాటిస్తున్నాం. కానీ సామాజిక, ఆర్థిక జీవనంలో ఈ సమానత్వాన్ని సాధించలేక పోతున్నాం. నాడు స్వేచ్ఛ కోసం ఉద్యమాలు, నేడు నాది అనే స్వార్థం పెరిగిపోయింది. నాటి స్వాతంత్ర్య పోరాట కాలంలో స్వరాజ్యం కోసం జనాలు తమ ఆస్తులు, ఒంటి మీది ఆభరణాలు ఒలిచి ఇచ్చినారు. నేడు తరతరాలు తిన్నా తరగని సంపదను సంపాదించి విదేశాల్లో దాచుకుంటున్నారు. నాడు స్వాతంత్ర్యోద్యమానికి ప్రశ్నించడమే ఆయుపట్టు, ఒక్కొక్క ప్రశ్న వందల తూటాలతో సమానం. నేడు ప్రశ్నించడాన్ని మరిచిపోతున్నవారు కొందరైతే ప్రజల పక్షాన ప్రశ్నించిన ప్రజా సంఘాల వారిని పాలకులు వారి గొంతులు నొక్కేస్తూ, ప్రశ్నను, ప్రశ్నించేవారిని చంపేస్తున్నారు. ఇదేనా మనం రాసుకున్న రాజ్యాంగంలోని వ్యక్తి గౌరవాన్ని పెంచడమంటే.. ప్రాణం పోయలేని మీకు ప్రాణం తీసే హక్కు ఎవరిచ్చారు. పాలకులు వాళ్ల పీఠాన్ని నిలబెట్టుకోవడానికి సంకుచిత రాజకీయాలు నడుపుతున్నారు. ప్రజాస్వామ్యానికి పునాది లాంటి ఎన్నికలను ప్రజలు, పాలకులు తేలికభావంతో, చులకనగా తీసుకొంటున్నారు. 25-30 శాతం ఓట్లు పొందిన పార్టీలు, రాజకీయాలు చేస్తూ, పాలకులుగా చెలామణి అవుతున్నారు. పంచ భూతాలనే అమ్మేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను సక్రమం చేస్తున్నారు. పాలకుల స్వార్థానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇలా దేశంలో భక్తి మార్గం లేదా వ్యక్తి ఆరాధన తారస్థాయికి చేరింది. ప్రపంచంలో ఎక్కడా లేనంత ఎక్కువ వ్యక్తి, భక్తి ఆరాధన మన దేశంలో ఉంది. అది నియంతృత్వాన్ని పెంచి పోషిస్తుంది. విషమిస్తే అథ:పతనానికి బాటలు వేస్తుందనేది గత అనుభవాలు తెలుపుతున్నాయి. రాజ్యాంగంలో మనం రాసుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సౌభ్రాతృత్వం నానాటికీ క్షీణిస్తున్నాయి. స్వేచ్ఛను సమానత్వం నుండి వేరు చేయలేం. సమానత్వాన్ని స్వేచ్ఛనుంచి దూరం చేయలేం. అలాగని స్వేచ్ఛను, సమానత్వాన్ని, సోదరభావం నుంచి వేరు చేయలేం. కొందరు అంతులేని సంపదలతో తులతూగుతుంటే, దేశంలో ఎంతోమంది కటిక దరిద్రంలో కొట్టుమిట్టాడుతూ పస్తులుంటూ కాలం వెల్లదీస్తున్నారు. పాలకులు ప్రజాస్వామ్యం పాలన పేరుతో నియంతృత్వాన్ని పెంచి పోషిస్తున్నారు. మన దేశంలో చెలామణిలో ఉన్న డబ్బును రద్దుచేసి నల్లధనాన్ని నిర్మూలిస్తామని బీరాలు పలికిన పాలకుల నిర్ణయాలు చివరికి పేదవారికి కష్టాల, కడగండ్లే మిగిల్చి ప్రాణాలను కూడా తీసుకున్నారు. పేదలకు ఇంకా ఈ కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్థిక సమానత్వం ఇదేనా! నాటి త్యాగధనులు, రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నది ఇలాంటి పరిపాలనేనా? అభివృద్ధి, సంక్షేమంలో పున: సమీక్ష చేసుకుంటే మానవాళికి అతి ప్రధానమైన కూడు, గుడ్డ, నీడ అవసరాలను తీర్చలేదనేది నగ్న సత్యం. భారతదేశం అభివృద్ధిలో "ఆర్థిక సూపర్ పవర్" అంటూ పాలకులు ఎంత డబ్బా కొట్టుకున్నా ప్రజాధనంతో ప్రకటనల మోతలు మోగిస్తూ ప్రజలను ఎన్నాల్లో మభ్య పెట్టలేరు. భారత్‌లో ఆకలి బాధితులు అంతకంతకు పెరిగిపోతున్నారు. ప్రపంచ ఆకలి సూచీలో 100వ స్థానంలో ఉంది. ఈ మధ్య ప్రకటించిన 2017 ఇంటర్‌నేషనల్ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఎఫ్‌పీఆర్ఐ) ప్రపంచ ఆకలి సూచిక (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) 119 దేశాల పట్టికలో భారతదేశం 100వ, స్థానం నిజం కాదా! ఉత్తర కొరియా, బంగ్లాదేశ్‌ల కన్నా వెనుబడి ఉన్నాం. ఈ నివేదికలను పాలకులు పట్టించుకోరా! నేటికీ దేశంలో ఏ పల్లెటూరికి వెళ్లినా, అధిక శాతం గ్రామాలు, పట్టణాల్లోని మురికివాడల్లో జీవన ప్రమాణమే మారలేదు. కానీ రాజకీయ నాయకులు సంపన్న దేశాల్లో స్థిరపడుతున్నారు. వారి డబ్బును స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటున్నారు. ఆస్తులు పెంచుకుంటున్నారు. తిరిగి దేశానికి వచ్చి కార్పొరేటు, వ్యాపారంలో మళ్లీ సామాన్యులను దోపిడి చేస్తూనే ఉన్నారు. ఇది నిజం కాదా! ఈ దేశ సంపదపై అందరికీ సమానహక్కు ఉంది. దీనిని పాలకులే దోచుకుంటూ దేశ ప్రజల్ని ఆకలిలో నెట్టివేయడాన్ని ఎలా చూడాలి? ప్రపంచ ఆకలి సూచీని నాలుగు మార్గదర్శకాల ద్వారా నిర్ధారిస్తారు. 1. ఆయా దేశాల మొత్తం జనాభాలో పౌష్టికాహార లోపం ఉన్నవారి శాతం ఎంత? 2. ఐదేండ్లలోపు గల పిల్లల్లో కృషించి పోతున్న వారి శాతం ఎంత? 3. ఐదేండ్లలోపు పిల్లల్లో సరియైన ఎదుగుదల లేని శాతం ఎంత?, 4.ఐదేండ్ల లోపు పిల్లల్లో చనిపోయే వారి శాతమెంత? అనే అంశాల ఆధారంగా ఆకలి సూచిని నిర్ణయిస్తారు. ఇన్నేండ్లైనా ఇంకా బుక్కెడు బువ్వ కోసం, గూడు కోసం, గుడ్డ కోసం వెంపర్లాడుతున్న ప్రజల జీవన విధానం ఎప్పుడు మారుతుంది? ప్రణాళికలు, ధనం, కాలం, కరిగిపోతుంది. కానీ పేదోడికి, ఉన్నోడికి మధ్య ఆర్థిక అగాధాన్ని పూడ్చలేకపోతుంది నిజం కాదా! మన దేశంలోని దాదాపు సగం సంపద కేవలం ఒకే ఒక్క శాతం మంది చేతుల్లో ఉందన్నది కాదనలేని నిజం. ప్రపంచంలోనే అత్యధికంగా ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న దేశాలలో భారత్‌ది రెండో స్థానం. అదే సమయంలో ఎక్కువమంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నవారు ఉన్న దేశాల్లో భారత్‌ది రెండో స్థానం. మన దేశంలో సుమారు 22 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. అదే సమయంలో ప్రపంచ కుబేరుల్లో దాదాపు 84 మంది భారత్‌లోనే ఉన్నారు. (ఫోర్బ్స్ 2016 లెక్కల ప్రకారం) పైన చెప్పుకున్నట్టు, రాజకీయాలు... ఆర్థిక, వ్యాపారమయమై, ప్రభుత్వాల వైఫల్యాలు, సంక్షేమ నిధులు గాడి తప్పడం ఒకవైపైతే, వర్షాధార వ్యవసాయం, తరుచూ కరువులు రావడం, రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పూనుకోవడం, పౌష్టికాహార లోపం, నిరుద్యోగం పెరిగిపోవడం అనేక కారణాల మూలంగా సుస్థిరాభివృద్ధి లేక, ఆకలిని తరిమికొట్టలేక, ఆహార భద్రతలను ఇవ్వలేక పోవుతున్నారు. ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లాల్సిన సమయాన ఈ మధ్య చట్ట సభలు నైతికతకు తిలోదకాలిస్తున్నాయి. కార్యనిర్వాహక వర్గం, గాడితప్పి అవినీతి మయమవుతున్నది. పత్రికలు, పాలకుల, కార్పొరేట్ శక్తుల కౌగిలిలో కొన్ని చిక్కుకుని ప్రజల పక్షాన అడుగులేయలేక పోతున్నాయి. దీనిని ఎలా భావించాలి. సగటు వ్యక్తులకు అర్థం కాకపోవచ్చు. కొన్నింటిని పట్టించుకోకపోవచ్చు. కాని దేశానికి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగాలు చేసిన వారి నుండి స్ఫూర్తి పొంది, ఆ త్యాగాలు వృథాకాకుండా ప్రజలు చైతన్యవంతులవ్వాల్సి ఉంది. పాలకులు స్వార్థం వీడి ప్రజాస్వామ్యానికి, సార్వభౌమాధికారానికి భంగం కలగకుండా, రాజ్యాంగానికి కట్టుబడి భారతదేశ పౌరులు దృఢ దీక్షతో, కర్తవ్య నిర్వహణతో కంకణబద్ధులు కావాల్సిన అవసరముంది. ప్రజల ఆకాంక్షలకు ప్రాణం పోస్తూ ప్రజాధనం పంపిణీలో ప్రణాళికల అమలులో ప్రతి పేదవాడి ఇంట్లోకి చేరేలా పాలనను అందించాల్సిన బాధ్యతలను పాలకులు మరువరాదు. పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ భావ ప్రకటన స్వేచ్ఛనిస్తూ సమానత్వాన్ని వ్యక్తి గౌరవాన్ని పెంచుకుంటూ దేశ సమైక్యత, సమగ్రత రక్షణలో నిబద్ధతతో వ్యవహరించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాలైన విభాగాలు రాజ్యాంగ పరిధికి లోబడి ఏర్పర్చుకున్నవి. అవి 1. చట్ట సభలు, 2. కార్యనిర్వాహక వర్గం, 3. న్యాయ శాఖ, నాలుగవ మూల స్తంభంగా పేరుగాంచింది పత్రికలు (మీడియా). వీటి ప్రధాన లక్ష్యాలను, రాజ్యాంగ పరిధిలో ప్రజల పక్షాన వ్యవహరించాల్సిన తీరుకు విఘాతం కల్గిస్తున్న శక్తులను గుర్తించి కూకటి వేళ్లతో సహా పెకిలించాల్సిన బాధ్యత భారత పౌరులమైన మనందరిపై ఉంది.

సెల్: 9573666650

## బంజార దార్శనికుడు సేవాలాల్



ధీరావత్ రవి నాయక్

బంజారజాతి దార్శనికుడు, ఆరాధ్యుడు సేవాలాల్ మహారాజ్ 279వ జయంతిని పురస్కరించుకొని లంబాడిజాతి ఐక్యత, సంస్కృతి పరిరక్షణ కోసం తాను జీవిత కాలం చేసిన కృషి నేటి యువతకు స్ఫూర్తిదాయకం. లంబాడి ప్రజల్లో మౌఖికంగా ప్రచారంలో ఉన్న కథల ప్రకారం, లంబాడీలు 5వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు ఉత్తర భారతదేశం నుండి దేశవ్యాప్తంగా సంచారం కొనసాగించారు. వివిధ రాజ్యాలకు అవసరమైన సరుకులను రవాణా చేసేవారు. 18వ శతాబ్దం నాటికి భారతదేశ వ్యాప్తంగా లంబాడీ తండాలు సంచార జీవనం కొనసాగించినట్టు చరిత్ర. పశుపోషణ, సరుకుల రవాణా ప్రధాన వృత్తిగా జీవించిన లంబాడీలు, ప్రస్తుత రైల్వేలు రాకపూర్వం ఎడ్లబండ్ల ద్వారా రవాణా నిర్వహించే వారు. సుగంధ ద్రవ్యాల రవాణాతోపాటు, యుద్ధ సమయంలో సైన్యాలకు ఆహార పదార్థాలను సరఫరా చేసేవారు. వేలాదిగా ఉన్న పశువుల సంరక్షణ కోసం సమృద్ధిగా మేత దొరికే ప్రదేశాలు, నీటి వనరులు, అటవీ ప్రాంతాల్లో గుడారాలను ఏర్పాటు చేసుకొని నివసించేవారు. లంబాడీలు పశుపోషణ క్రమంలో అనేక మంది స్థానిక రాజులతో సమస్యలను ఎదుర్కొన్నారు. భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన స్థిరపడుతున్న సందర్భంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పటి వరకు పశుపోషణకు అనుకూలంగా ఉన్న విస్తారమైన భూములపై బ్రిటిష్ వాళ్లు పన్నులు విధించడం, పశువుల మేతకు అనుమతి ఇవ్వకపోవడం వల్ల లంబాడీలు భయభ్రాంతులకు, తీవ్రమైన ఒత్తిడికి లోనైనారు. బ్రిటిష్ భూమి శిస్తు విధానాలను సేవాలాల్ తీవ్రంగా వ్యతిరేకించినాడు. నైజాం, మైసూర్, కటక్ తదితర ప్రాంతాల్లో సేవాలాల్ మహారాజు తండ సంచారం కొనసాగింది. వేలాది పశువుల మందతో సంచరిస్తున్న సేవాలాల్ మహారాజు గుంపు మైసూర్ నుండి నిజాం రాజ్యంలో ప్రవేశిస్తున్న సందర్భంలో నిజాం రాజు సేనలు సేవాలాల్ మహారాజు బృందాన్ని అడ్డుకున్నారు. ఈ దాడులను సేవాలాల్ మహారాజ్ ఆధ్వర్యంలోని లంబాడీలు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. వారి వీరోచిత పోరాటానికి నిజాం రాజు చివరకు దిగి వచ్చి సేవాలాల్ మహారాజ్‌ను తన కోటకు ఆహ్వానించాడు. చర్చోపచర్చల తర్వాత నిజాం రాజుకు సేవాలాల్ మహారాజుకు మధ్య స్నేహపూర్వక బంధం ఏర్పడింది. ఆ సందర్భంలో లంబాడీల అవసరాలను గుర్తించిన నిజాం రాజు హైదరాబాద్ సమీపంలో (ఇప్పటి బంజారాహిల్స్) వేలాది ఎకరాల భూమిని బంజారాల పశుపోషణకు ఇస్తూ ఫత్వా జారీ చేశాడు. దీనికి సంబంధించిన శాసనాలు నేటికీ లభ్యమవుతున్నాయి. నేడు గిరిజనులపై పాలకవర్గాలు చేస్తున్న కుట్రలు సామాన్యమైనవి కావు. తరతరాలుగా గిరిజనులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాయాలని చూస్తున్నాయి. అటవీ హక్కుల చట్టాన్ని, గిరిజన ఉప ప్రణాళిక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుకారుస్తోంది. గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన 10శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా, తండాలను పంచాయతీగా ఏర్పాటు చేసే విషయంలో అశాస్త్రీయ పద్ధతులను ప్రభుత్వం అవలంబిస్తోంది. మరోపక్క గిరిజన భాషా సంస్కృతులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. బంజార వేషధారణ దాదాపు కనుమరుగవుతోంది. మన భాషా, సంస్కృతి అంతరించిపోవడమంటే మన అస్తిత్వం కోల్పోవడమే, మన చరిత్ర కనమరుగవడమే కాబట్టి మన చరిత్రను, మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి. అదే సందర్భంలో వివిధ తెగల మధ్య ఐక్యత సాధించి, హక్కుల కోసం ఉద్యమించాలి. సేవాలాల్ మహారాజు జీవితం భావితరాలకు ఆదర్శనీయం. బంజార సంస్కృతిని కాపాడడంలో సేవాలాల్ కృషి అమోఘమైనది. ఈ స్ఫూర్తితో గిరిజన తండాల అభివృద్ధి కోసం, సంస్కృతి పరిరక్షణ కోసం ఉద్యమించడమే మనముందున్న కర్తవ్యం.

సెల్. 9490300809

# బంజారాలపై సేవాలాల్ ప్రభావం



ఎం.వెంకటేష్ చౌహాన్


సంచార జీవన వెతుకులాట నుండి స్థిర నివాస దశకు చేరిన బంజారాలు భారతదేశంలో 31 రకాల పేర్లతోనూ, మరొక పన్నెండు ఉప పేర్లతోను పిలువబడుతున్నారు. దేశంలో బంజారాలు సుమారు ఎనిమిది నుండి పది కోట్ల వరకు ఉంటా రనేది అంచనా. బంజారాలను గుర్తు పట్టాలంటే వారి మాతృభాష "గోర్‌బోలి", వేషధారణ, వారి సంస్కృతి, సంప్రదాయాలు, అలాగే 'తండా' జీవన విధానం ద్వారా వారిని బంజారాలు అని మనం గుర్తు పట్టవచ్చు. బంజారా జాతి ఒక ప్రత్యేకమైన పండుగలు, పెండ్లిలు, సంస్కృతి సంప్రదాయ లక్షణాలను కలిగి ఉన్నటువంటిది. భారతదేశంలో సుమారు 25 రాష్ట్రాల్లో విస్తరించింది. వలస జీవన సంస్కృతిని కలిగి ఉన్న బంజారాలు మొదట దేశ వ్యాప్తంగా సంచారం సాగిస్తూ ఉప్పుతో పాటు వివిధ ఆహా ర ధాన్యాలను రవాణా వ్యవస్థ స్థిరపడక ముందు ఎడ్ల బండ్లు, ఒంటెలు, గుర్రాలపై అనేక రాజ్యాల కు, సైన్యాలకు ఆహారాన్ని అందించిన జాతి. దట్టమైన అడవుల్లో కొండలు, కోనలు దాటి అనేక గ్రామాలకు, పట్టణాలకు మార్గాలను కనుగొని ప్రజల నిత్యావసర సరుకులను అందించటంలో బంజారాలు ప్రముఖ పాత్ర పోషించారు. ఉప్పును, ధాన్యాన్ని ప్రధాన వ్యాపారాలుగా కొనసాగించటం మూలంగా కాలక్రమేణా వీరిని సంస్కృత పదంలోని 'లమాన్', లభాన్ (లవణం) మూలంగా "లంబాడీ" అని అలాగే "లాంగ్బాడీ" కలిగి ఉండటం మూలంగా బ్రిటిష్ వారు వీరిని "లాంగ్బాడీ పీపుల్"గా పిలుస్తూ కాలక్రమేణా "లంబాడీ"గా పేరొచ్చిందని తెలుస్తుంది. అలాగే ధాన్య వ్యాపారం చేయటం మూలంగా సంస్కృతంలోని "వాణిజ్యం" నుండి "బనజ్" అనే హిందీ శబ్దం దాని నుండి "బంజారా" అని అలాగే వనా లలో సంచరించిన జాతి కాబట్టి వనచరులనే సంస్కృత పదం నుండి "వనచర" శబ్దం. "వంజర" శబ్దం గాను అది "బంజారా"గాను పరి ణామం చెంది ఉండవచ్చని, అలాగే హిందీలో "గవార్" అనగా గ్రామ గ్రామాలుగా తిరిగేవార ని, సంచారం చేసేవారని అర్థం. అలా బంజా రాలు "గోర్ బంజారాలు" అని పిలుస్తున్నట్టు కూ డా చరిత్రకారులు, భాష శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈవిధంగా భారతదేశంలో "బంజారాలు"గా, "లంబాడీలు"గా, "గోర్ బంజారాలు"గా వివిధ పేర్లతో పిలువబడుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. భారతదేశంలోని బంజారాలు దైవంగా భావించే గొప్ప త్యాగమూర్తి, బంజారా జాతిపిత, గొప్ప సంఘ సంస్కర్త, బంజారాలు సంచార జీవన దశ నుండి స్థిర నివాసం ఏర్పాటు చేసే దిశగా వారిని ఏకతాటిపైన తెచ్చి న ఘనుడు, దేశంలోని బంజారాలందరి దగ్గరికి వెళ్లి వారిని సన్మార్గంలో నడిపించిన ఒక శక్తి సం త్‌శ్రీ సేవాలాల్ మహారాజ్. సేవాలాల్ మహారా జ్ కుటుంబ నేపథ్యం చూసినట్టయితే ఆంధ్రప్రదే శ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా, గుత్తి సమీపంలోని రాంజీ నాయక్ తండాలో 1739, ఫిబ్రవరి 15వ తేదీన భీమా నాయక్, ధర్మిణిభాయి దంపతులకు జన్మించారు. అటువంటి క్రమంలోనే 18వ శతాబ్దంలో వచ్చిన కరువు కాటాకాల మూలంగా బంజారా జాతి జీవన మనుగడ ప్రశ్నార్థకమైన సందర్భంలో మొత్తం బంజారా జాతిని సరైన దారిలో వారి జీవనం కొనసాగించే దిశగా దేశం నలుమూలల తిరిగి వారిని చైతన్యపరిచి ఏకతాటిపైకి తెచ్చి బంజారా సంస్కృతి సంప్రదాయాలను కాపాడే ప్రయత్నం చేశాడు.

### సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ బోధించిన ప్రధానమైన సామాజిక అంశాలు

18వ శతాబ్దంలో సంభవించిన కరువు మూలంగా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న బంజా రా జాతికి ధైర్యాన్ని, భరోసానిచ్చి, భవిష్యత్తుకు బాట వేసిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్. బంజా రా జాతిలో ప్రధానంగా ఉన్న మూఢ నమ్మకాల ను పోగొట్టాడు. అప్పటి బ్రిటిష్‌వారు బంజా రాలను "క్రిమినల్ ట్రైబ్స్"గా చిత్రీకరించిన సందర్భంలో సంఘ ద్రోహులుగా, బందిపోట్లుగా ముద్ర వేస్తే అటువంటి వాటికి దూరంగా ఉం డాలని 'దొంగతనాలు' చేయరాదని, జంతువు లను వేటాడరాదని, హింస చేయరాదని, అహిం స వాదిగా ఉండాలని, సంచార జీవనం సాగిం చకుండా స్థిర నివాసం ఏర్పరచుకోవాలని, నలు గురికి మంచి చేయాలే తప్ప చెడు చేయవద్దని, పాశ్చాత్య సంస్కృతి పారదోలాలని, బంజారా ఆటవిక సంస్కృతి ఎంతో గొప్పదని, అలాగే మద్యం (సారా) తాగవద్దని తెలియజేశాడు. అలాగే చిన్న పిల్లలు, గొడ్లు గోధా చనిపోతావుంటే వాటికి నాటు వైద్యం చేసి బతికించే సందర్భంలో తనను దైవంగా భావించే వారు. సామాజిక సేవకుడిగా, తండా తండా తిరిగి వారి ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు చూపగలిగాడు. నాటి నిజాం రాజు, అలాగే సూరజ్ ఖండ్ రాజులు, బంజారాలు అడవుల్లో జీవిస్తున్న అమాయకుల ను బంధిస్తుంటే వారితో పోరాడి వారికి విముక్తి కలిగించాడు. అలా నేటికి హైదరాబాద్‌లోని "మ హారాజ్ గంజ్" అనే ప్రాంతం సేవాలాల్ మహా రాజ్ పేరు మీద ఉందనే చెప్పాలి. అలాగే "బం జారా దర్వాజా" గోల్కొండ కోటలో బంజారా సై న్యం ఆహార ధాన్య రవాణా చేసే ద్వారంగా చెబుతారు. అలా ఆయన దేశ వ్యాప్తంగా బంజారాలను చైతన్యపరుస్తూ తండాల అభివృద్ధికి ఒక ప్రణాళిక చేసుకోవాలని, మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని అలాగే మన హక్కులకై మనమే పోరాడాలని కోరుతూ చివరగా 1806 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని యాత్మల్ జిల్లా డిగ్రాస్ తాలూకాలోని "రుయి తాండా"లో మరణించాడు. అలా మహారాష్ట్రలోని "పోహ్రా దేవిగడ్" సమీపంలో ఆయనను సమాధి చేయడం జరిగింది. అది బంజారాల తీర్థస్థలి. అలా ప్రతి దసరాకు అక్కడ ఉత్సవాలు కూడా జరుగుతాయి. అదే విధంగా బోగ్ కార్యక్రమం సేవాలాల్ జయంతి రోజు జరపడం జరుగుతుంది.

సెల్: 9550553182

## రామప్ప మందిరం - శిల్ప కళా చాతుర్యం



మరింగంటి కష్ణమోహన్

భారతదేశం కాక దాదాపు 9 సాంస్కృతికంగా పేరెన్నికగన్న దేశాలు పర్యటించాను. హిందూ, బౌద్ధ, జైన, క్రైస్తవ, మహ్మదీయ, సిక్కు, పారశీక, గ్రీకు, రోమను, ఈజిప్టు కట్టడాలను దర్శించే భాగ్యం నాకు కలిగింది. ఆ నేపథ్యంలో, రామప్ప మందిర విశేషాల గురించి ఈ రోజు చెప్పుకుందాం. రామప్ప మందిరం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాలంపేట్ గ్రామ పరిసరాలలో, చక్కటి పర్వతం దగ్గర, జనావాసాలకు దూరంగా, మనసుకు ప్రశాంతత కలిగించే ప్రాంతంలో నెలకొని వున్నది. ఈ మందిరం క్రీ.శ.13వ శతాబ్దంలో కాకతీయ వంశ రాజు అయిన గణపతి దేవుని సేనాని రేచెర్ల రుద్రునిచే నిర్మింపబడినది. సాధారణంగా మందిరాల పేర్లు, ఆ మందిర ప్రధాన దైవానికి సంబంధించినవిగా వుంటాయి. కానీ ఈ ఆలయ ప్రధాన శిల్పి అయిన రామప్ప పేరుమీద రామప్ప మందిరంగా ప్రసిద్ధి అయినది. బహుశా దేశంలోనే శిల్పి పేరు మీద వున్న ఏకైక మందిరం ఇదేనేమో! ఆలయ ప్రాంగణంలో మూడు శివ మందిరాలు వున్నాయి. వాటి మధ్యలో తూర్పు అభిముఖముగా ఆలయ ప్రాంగణంలోదే ప్రధాన రామలింగేశ్వర (రుద్రేశ్వర) ఆలయం. ఈ ఆలయం నక్షత్ర ఆకార వున్నత పీఠంపై నిర్మింపబడినది. ఈ ప్రధాన మందిరానికి ముందు, గర్భాలయ శ్రీ రామలింగేశ్వరునికి అభిముఖముగా నల్లని చలువరాతితో నిర్మితమైన నంది విగ్రహం వున్నది. అలంకార భూషితమైన ఆ నంది ఒక పీఠంపై దాదాపు 4-5 అడుగుల ఎత్తుకలిగి గంభీరంగాను, నిశ్చలంగాను అగుపిస్తుంది. ప్రధాన మందిరం - అందమైన శిల్పసంపదతో స్థంభాలు, గోడలు (కుడ్యములు), కప్పుతో కనుల పండుగగా వుంటుంది. ఆయుధాలు ధరించిన దేవతలు, పురుషులు, అందెలతో అంగ సౌష్టవంతో నిలిచిన మూర్తులు, వాయిద్యాలను ధరించి, నాట్య భంగిమలతో, వివిధ పుషములతో, వింజామరలతో స్త్రీలు, ఏనుగులపై చత్రం ధరించినవారు, ఏనుగుల వరుసలతో, వివిధ వస్త్ర ఇంకా శిరోధారణలతో స్త్రీ పురుష శిల్పాలు, నాగినులు, యక్షిణులు, మల్లయుద్ధ దశ్యాలు, ఏనుగు తలపై నిలిచి కప్పును మోస్తున్న సింహములు, అంత బరువైన కప్పును అతి సుందర శిల్పకళతో నిండిన ఆ స్థంభాలు అలవోకగా మోయటం, రామాయణాది పురాణ విశేషాలతో నిండి ఆ శిల్ప కళ మన మనసులను దోచుకొని మనని కట్టిపడేస్తాయి.

ఈ ఆలయ నాట్య భంగిమలు, ప్రఖ్యాత నత్య ఆచార్యుడు శ్రీ నటరాజ రామకష్ణ గారు రూపొందించిన పేరిణి నత్యానికి ప్రేరణగా చెప్పుకుంటారు. నా దష్టిలో పేరిణి నత్య కళాకారులు ధరించే ఆహార్యం కూడా. ఈ మందిరం నుంచే గ్రహించబడినదని వూహ. యుద్ధాలు, దాడులు, ప్రకతి వైపరీత్యాలకు చెక్కుచెదరక గత 700 ఏండ్లకు పైగా నిలిచివున్న ఈ గత వైభవ చిహ్నానికి గల కొన్ని ప్రత్యేకతలు, విశేషాలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఈ ఆలయ నిర్మాణంలో వాడిన ఇటుకలు నీటిపై తేలియాడుతాయంటే ఆ శిల్పులని ఏమని పొగడగలం. ఎక్కువగా ఎర్ర రాయి, కొంత నల్ల చలువ రాతితో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. ఈ ఆలయ కిటికీలు నల్ల చలువరాతితో చేయబడి దానిపై వివిధ నత్య భంగిమలతో, వాయిద్యాలతో కాకతీయ శిల్పకళా ఔన్నత్యం యొక్క ప్రమాణం చాటి చెప్పటమే కాక ఆనాటి సమాజంలో కళల పట్ల ఆరాధనని, కళాకారుల పట్ల గల గౌరవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. గర్భాలయానికి ముందు వున్న స్థంభాల మండపంలో ఒక నల్ల చలువ రాతి స్థంభంపై భారతీయ శిల్ప కళా సంపదకి ప్రతీక అయిన అత్యద్భుత ప్రయోగం వున్నది. ఆ స్థంభంపై 8 మంది నత్యకారులు వివిధ భంగిమలతో, వాయిద్యాలతో, కోలాటాలతో వున్నారు. పరీక్షగా చూస్తే గాని దానిలోని విశేషం మనము గమనించలేము. ఎందుకంటే ఆ శిల్పాలు మాట్లాడవు. మధ్యలో వున్న ముగ్గురు నత్యకారులకి కలిపి మొత్తం 4 కాళ్లే వుంటాయి, వుండాల్సిన 6 కాళ్లకి బదులు. ఆ నాటి కాకతీయ శిల్పుల నైపుణ్యానికి ఇది ఒక మచ్చు తునక. ఇక మనం ప్రధాన మందిరాన్ని ప్రదక్షిణ చేసి చూస్తే మరిన్ని అందాలు అగుపడతాయి. ప్రతి అంగుళం విడువకుండా శిల్పకళా ఫలకాలతో మందిరానికి బాహ్య సౌందర్యాన్ని కలుగచేస్తున్న వింతలెన్నో! వివిధ పుష్పాల వరుసలతో, ఏనుగుల వరుసలతో, దివ్యాంగనల వరుసలతో, లతలతో, దేవతా గణములతో, మల్ల యోధుల సాములతో ఇంకా ఎన్నో విశేషాలతో ఆ కుడ్యాలు నిండి వున్నాయి. ఆలయ ప్రాంగణంలో వున్న నల్లటి చలువరాతి ఫలకలపై రాసిన శాసనాలు ఆ నాటి భాష, చారిత్రక విషయాలను తెలియచేస్తాయి. అందుచేత ఆ శాసనాలను ప్రస్తుత తెలుగు భాషలోకి అనువదించి అందుబాటులో వుంచటం - విద్యార్థులకి, చరిత్ర పరిశోధకులకి, సందర్శకులకి ఎంతో అవసరం. ఆలయ ప్రాంగణంలో అక్కడక్కడ చెల్లాచెదరుగా పడివున్న శిల్ప సంపదను (శకలాలను) సేకరించి దొంగలు, స్మగ్లర్ల భారినుంచి కాపాడి భద్రపరచాల్సిన అవసరం ఎంతైనా వున్నది. అదేవిధముగా పురావస్తు శాఖ అధీనంలో వున్న ఈ మందిరానికి కావలిన రక్షణ చర్యలు(ప్రహరి గోడ మొదలగునవి) చేపట్టాలి. ప్రసిద్ధమైన ఈ రామప్ప గుడి చేరుకోవాలంటే వరంగల్ నగరం చాలా అనుకూలమైనది. వరంగల్ నుండి హన్మకొండ, ములుగుల మీదుగా రామప్ప మందిరం దాదాపు 70 కి.మీ దూరంలో వున్నది. భూపాలపల్లి నుండి ఘణపురం మీదుగా 30 కి.మీ దూరంలో వున్నది. హైదరాబాదు నగరం నుండి జనగామ హన్మకొండల మీదుగా 210 కి.మీ దూరంలో వున్నది. వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి మొదలగు విశేషాలతో విరాజిల్లుతున్న వరంగల్ నగరమే అన్ని విధముల రామప్ప మందిరం చూడటానికి మేలైన బస కలిగి వున్నది. ఈ మందిరాన్ని సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు చూడవచ్చు. చక్కని రోడ్లతో కలుపబడి వున్నది. కాబట్టి ఈ రామప్ప మందిరాన్ని అన్ని కాలములలో చేరుకోవచ్చు. కానీ ఆ ప్రాంత ఉష్ణోగ్రతల దష్ట్యా, చలి కాలం ఆ తర్వాత వర్షాకాలం అనువైనవి.

సెల్ : 9491144121

## పవన్ కళ్యాణ్ ...పొలిటీషియనా? భజనాపరుడా?



శ్రీకాంత్ అంబేరి

2014 మార్చి 14 నాడు సినీ నటుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించారు. అధికారం అంతిమ లక్ష్యం కాదు .. ప్రశ్నించడమే పరమావధి అని నాడు చెప్పారు. తీరా తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీలకు మద్దతు ప్రకటించారు. కానీ నేడు తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబులను పొగుడుతున్నారు. ప్రశ్నించడం మాని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సినిమాలు లేవంటూ తెలంగాణ కొండగట్టు నుండి చలో రే చల్ అంటూ ప్రజా సమస్యల అధ్యయనం పేరుతో చేస్తున్నది ఏమిటి? కరీంనగర్, ఖమ్మం జనసేన కార్యకర్తల సాక్షిగా కేసీఆర్ స్మార్ట్ సీఎం అని ప్రశంసించారు. తద్వారా తెలంగాణ రాష్ట్రంలో జనసేన అవసరం లేదని తానే స్వయంగా ఒప్పుకున్నట్టే, పైగా ప్రసంగాలలో అంతుపట్టని అయోమయం ఉంది. తన కార్యకర్తల సమావేశంలో 35 ఏండ్లు పైబడి న వారు లేరు అంటే అభిమానులే కార్యకర్తలు. తాను నటించిన చిత్రాలు దెబ్బతింటేనే ఏం చేయలేని వారు రాజకీయంలో పార్టీని విజయ తీరానికి తీసుకు వెళ్తారా? ఇక ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన మరో విధంగా అనంతపురం నుండి 2019 ఎన్నికలో పోటీ చేస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ అనంత కరువు ప్రజా సమస్యలపై ఇక్కడ పర్యటించారు. అనంతపురం రైతులతో సమావేశమయ్యారు. 2019లో ఒంటరిగా ఎన్నికల బరిలో ఉంటానని చెప్పకుండా ప్రజల అభీష్టం మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లేదా భారతీయ జనతా పార్టీ దేనికి మద్దతు ఇవ్వమంటే దానికి ఇస్తానంటూ ప్రకటించడం రాజకీయ అస్పష్టత.

ambeerisrikanth@gmail.com

## ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

**మీ రచనలు పంపవలసిన చిరునామా :**

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

| సెన్సెక్స్ ▼145 | నిఫ్టీ ▼39 | డాలరుకు రూపాయి విలువ | బంగారం(10గ్రా) | వెండి (కేజీ) | కోడిగుడ్లు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 34,155 | 10,500 | 64.08 | రూ. 30,973 | రూ. 40,600 | హైదరాబాద్ 368 | ఒక్కగుడ్డుకు 4.30 | వరంగల్ 370 | విజయవాడ 374, చెన్నై 397, ముంబయి 410 |






## షియోమి నుంచి మార్కెట్లోకి కొత్త స్మార్ట్ టీవీ



**న్యూఢిల్లీ:** ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ షియోమి కొత్తగా రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. వీటిని రెడ్‌మి నోట్ 5, రెడ్‌మి నోట్ ప్రొ పేరుతో భారత్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. స్నాప్‌డ్రాగన్625 ప్రాసెసర్ కింద 3జీబీ ర్యామ్+ 32జీబీ అంతర్గాత మెమొరీ, 4జీబీ ర్యామ్+64జీబీ స్టోరేజ్ వేరియంట్లలో మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వీటి ధరలు రూ.9,999గా, రూ.11,999గా ఉన్నాయి. నాలుగు రంగుల్లో రెడ్‌మి నోట్ 5 అందుబాటులో ఉండనుందని కంపెనీ ఇండియా హెడ్ మను కుమార్ జైన్ పేర్కొన్నారు. ఇక వీటిలోని ఫీచర్లు చూస్తే.. 6 అంగుళాల తాకే తెర, 12ఎంపీ వెనుక కెమెరా, 8ఎంపీ ముందు కెమెరా, 2.0 గిగాహెడ్జ్ ప్రొసెసర్, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో లభించనుంది. మరోవైపు షియోమి రెడ్‌మి నోట్ 5 ప్రొను 6జీబీ ర్యామ్‌తో తెచ్చింది. 4జీబీ ర్యామ్+64జీబీ అంతర్గాత మెమొరీ, 6జీబీ ర్యామ్+64జీబీ స్టోరేజ్ వేరియంట్లలో వీటిని ప్రవేశపెట్టింది. వీటి ధరలు రూ.13,999గా,రూ.16,999గా ఉన్నాయి. దీనికితోడు షియోమి తొలిసారిగా భారత్‌లో మిస్మార్ట్ టీవీ4 ను కూడా విడుదల చేసింది. 55 అంగుళాల స్మార్ట్ ఎల్ఈడీ టీవీ ధర రూ.39,999గా కంపెనీ నిర్ణయించింది.

## చిన్న మొత్తాల పథకాల్లో మార్పులు..

**న్యూఢిల్లీ:** చిన్నమొత్తాల పొదుపు పథకాల్లో మార్పులు తీసుకువచ్చినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీములో పెట్టుబడి పెట్టిన వారు అత్యవసర వైద్యం, పిల్లల ఉన్నతవిద్య అవసరాల కోసం ఐదేండ్ల గడవుకు ముందే వారి ఖాతాలను మూసివేసుకునేందుకు ఆర్థిక మంత్రిత్వశాఖ అనువ ుతించింది. నేషనల్ సేవింగ్స్ సర్టిపికెట్స్, పీపీఎఫ్ లాంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల కింద పెట్టుబడి పెట్టిన వారు అత్యవసరమైతే గడవు తీరకముందే మూసివేసుకునేందుకు అనుమతించింది. అదే విధంగా చిన్నమొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టిన వారు మరణిస్తే వారి క్లెయిములను సత్వరం పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. పోస్టాఫీసు పొదుపు ఖాతాలు, జాతీయ పీపీఎఫ్, సుకన్య సమద్ధి యోజన ఖాతాలన్నీ చిన్నమొత్తాల పొదుపు పథకాలుగా పరిగణిస్తారు.

## జీఎంఆర్ ఇన్‌ఫ్రా నష్టం రూ.565 కోట్లు..

**న్యూఢిల్లీ:** మౌలిక రంగ సంస్థ జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిరుహాత్స కరమైన ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర నష్టం రూ.565 కోట్లుగా నమోదు అయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.643 కోట్ల లాభాలను సాధించింది. ఇదే సమయంలో ఆదాయం రూ.2,587 కోట్ల నుంచి రూ.2,295 కోట్లకు క్షీణించింది. మరోవైపు మొత్తం వ్యయాలు రూ.2,623 కోట్ల నుంచి రూ.2,487 కోట్లకు తగ్గాయి. గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీగా ఉన్న జీఎంఆర్ గ్రూపు ప్రస్తుతం విమానాశ్రయాలు, ఇంధన, రవాణ, పట్టణ మౌలిక వసతుల రంగంలో వ్యాపారాలు కలిగి ఉంది.

# బాబోయ్.. పీఎన్‌బీ!!

- ఒకే శాఖలో రూ.11,400 కోట్ల కుంభకోణం
- ఎల్‌వోయూల మాటున భారీ అక్రమాలు
- 'రికార్డులు లేకుండా' జారీ చేసిన సిబ్బంది
- ఆలస్యంగా గుర్తించిన పీఎన్‌బీ అధికారులు
- స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారికంగా వెల్లడి
- 10 మంది క్షేత్రస్థాయి సిబ్బందిపై వేటు
- ఉచ్చులో మరో మూడు బ్యాంకులు
- మళ్లీ వజ్రాల మోడీ పై అనుమానాలు
- చక్రం తిప్పిన ఆయన కుటుంబీకులు!
- ఆందోళన అవసరం లేదు: సర్కారు

**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** దేశంలో బ్యాంకులంటేనే భయపడే రోజులు వచ్చాయి. ఇప్పటికే నిరర్థక ఆస్తులు, మొండి బాకీల కారణంగా నష్టాల్లో నడక సాగిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులపై ప్రజల్లో నమ్మకం క్రమంగా సన్నగిల్లుతుంటే.. వీటికి అదనంగా ఇప్పుడు ఆయా బ్యాంకుల్లో అంతర్గత కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) భారీ కుంభకోణం వెలుగు చూసినట్టు ఆ బ్యాంక్ అధికారులు బుధవారం వెల్లడించారు. ముంబయి బ్రాడీ హౌస్‌లోని పీఎన్‌బీకి చెందిన మిడ్ కార్పొరేట్ శాఖలో దాదాపు రూ.11,400 కోట్ల (1771.69 మిలియన్ డాలర్ల) మోసపూరిత, అనధికారిక లావాదేవీలు చోటు చేసుకున్నట్టుగా ఆ బ్యాంకు స్వయంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీకి వెల్లడించింది. దీంతో పీఎన్‌బీ స్టాక్‌తో సహా బ్యాంకింగ్ రంగ షేర్లు భారీ కుదుపునకు గురయ్యాయి. వీటి రికవరీ కోసం ఈ కేసును లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి అప్పగించినట్టు బ్యాంక్ వెల్లడించింది. ఇక ఈ కుంభకోణంతో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న పీఎన్‌బీకి చెందిన 10 మంది అధికారులను కూడా సస్పెండ్ చేసినట్టు బ్యాంక్ తెలిపింది. కాగా, ఈ స్కామ్‌లో ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ నిరవ్ మోడీతో పాటు ఆయన భార్య, తమ్ముడు, బిజినెస్ పార్ట్‌నర్ మెహల్ చినుబాయి చొక్సికి ప్రముఖ భూమిక ఉన్నట్టు బ్యాంకు ఆరోపిస్తుంది. ఇప్పటికే పీఎన్‌బీకి చెందిన రూ.280 కోట్ల చీటింగ్ కేసులో గత వారం నిరవ్ మోడీని సీబీఐ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.




### మోసం ఇలా బయటపడింది..

మోడీ బంధువులు భాగస్వాములుగా ఉన్న డైమండ్ ఆర్ యూఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ ప్రతినిధులు జనవరి 16న ముంబయి బ్రాడీ హౌస్‌లోని పీఎన్‌బీకి చెందిన మిడ్ కార్పొరేట్ శాఖకు వచ్చారు. విదేశాల్లోని సప్లయర్లకు చెల్లింపులు జరిపేందుకు గాను బయ్యర్స్ క్రెడిట్‌ను జారీ చేయాల్సిందిగా కోరారు. బయ్యర్స్ క్రెడిట్ అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో దిగుమతిదారు వస్తువులు, సేవలను పొందేందుకు గాను బ్యాంకులు వెసులుబాటుగా ఇచ్చే స్వల్పకాలిక రుణ సౌకర్య పత్రం. దీనిని ఆధారంగా చేసుకొని ఎగుమతిదారు దేశంలోని ఆర్థిక సంస్థలు సదరు రుణాలకు తాను పూచికత్తుగా నిలుస్తాయి. అయితే ఈ సంస్థ పేర్లపై రుణ మంజూరీ లావాదేవీలేవీ కనిపించక పోవడంతో బ్యాంకు అధికారులు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌ను (ఎల్‌వోయూ) జారీ చేసేందుకు గాను 100% నగదు మార్జిన్‌ను చూపించాలని కోరారు. దీంతో ఆయా సంస్థల ప్రతినిధులు తాము గత కొంత కాలంగా ఇలా ఎల్‌వోయూలను పొందుతూ వస్తున్నామని ఇప్పుడు కొత్తగా క్యాష్ మార్జిన్ కోరడమేంటని వాదనకు దిగడంతో.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు అధికారులు పాత ఎల్‌వోయూల రికార్డులను పరిశీలించి చూడగా ఈ సంస్థల లావాదేవీలు ఎక్కడా నమోదు కాలేదు. దీంతో జనవరి 28న బ్యాంకు అధికారులు ఎల్‌వోయూల జారీ ద్వారా భారీ కుంభకోణం జరిగినట్టుగా గుర్తించారు. ఎల్‌వోయూల ద్వారా నిధులను సమీకరించిన మోడీ కుటుంబ సభ్యులు ఆ తరువాత సదరు సొమ్ములను దారి మళ్లించి ఇతర చెల్లింపులు జరిపినట్టుగా పీఎన్‌బీ అధికారులు గుర్తించారు. ఇలా మోసం చేసిన మొత్తం విలువ దాదాపు రూ.11,400 కోట్ల వరకు ఉంటుందని బ్యాంకు అధికారులు లెక్క తేల్చారు.

### ఎవరీ వజ్రాల మోడీ..?



విలాసవంతమైన వజ్రాలతో కూడిన ఆభరణాలను అందించే వ్యాపారవేత్తగా నిరవ్ మోడీకి ప్రపంచంలోనే మంచి పేరుంది. ఆయన డిజైన్లకు ప్రపంచ వ్యాప్తంగా వజ్రాభరణ అభిమానులు ఉన్నారు. ఈయన ఫైర్‌స్టార్ ఇంటర్‌నేషనల్ సంస్థ గోడుగు కింద నిరే మోడీ డైమండ్ జ్యువెల్లరీ స్టోర్స్‌ను ప్రపంచ వ్యాప్తంగా నడుపుతూ వజ్రాభరణాలను విక్రయిస్తున్నారు. ఈ సంస్థకు ఆయన చైర్మెన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఫోర్బ్స్ సంస్థ వెల్లడించిన భారత కుబేరుల జాబితాలో మోడీ 57వ స్థానంలో నిలిచారు. అయితే పీఎన్‌బీ నుంచి మోసపూరితంగా నిధులను సమీకరించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన పై ఇప్పటికే సీబీఐ విచారణ జరుగుతోంది. ఇప్పుడు పీఎన్‌బీలో వెలుగు చూసిన మరో భారీ కుంభకోణం కూడా ఇప్పుడు నిరవ్ మోడీతో పాటు ఆయన సోదరుడు నిశాల్ మోడీ, భార్య అవీ నిరే మోడీతో పాటు పలువురు కుటుంబ సభ్యుల చుట్టూనే తిరుగుతుండడం విశేషం.

### 10% పడిపోయిన స్టాక్

కుంభకోణం వార్తల నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్టాక్ బుధవారం దాదాపు 10 శాతం మేర కుంగింది. ఉదయం రూ.160 వద్ద ప్రారంభమైన స్టాక్ ప్రతికూల వార్తల నేపథ్యంలో ఒకానొక దశలో రూ.144.70కు పడిపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి ఈ స్టాక్ కొంత కోలుకొని దాదాపు 9.81 శాతం నష్టంలో రూ.145.80 వద్ద ముగిసింది. పీఎన్‌బీ భయాల నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 144.52 పాయింట్ల మేర పడిపోయి 34155 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా దాదాపు 39 పాయింట్ల మేర కుంగి 10,500 పాయింట్ల వద్ద స్థిరపడింది.

### మూడు బ్యాంకులకు సంబంధం..

పీఎన్‌బీ కుంభకోణం ప్రభావం మరో మూడు బ్యాంకులపైనా కనిపించనుంది. యూనియన్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్‌తో పాటు యాక్సిస్ బ్యాంక్‌కు ఈ కుంభకోణం ద్వారా ప్రభావితం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌వోయూను ఆధారంగా చేసుకొనే ఈ బ్యాంకులు మోడీ కుటుంబీకులకు భారీగా రుణాలను మంజూరు చేసినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీబీఐ ఇప్పుడు తన దృష్టిని ఈ బ్యాంకుల వైపు కూడా మళ్లించింది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో దేశంలోని బ్యాంకింగ్ రంగం ఒక కుదుపునకు గురైంది. బ్యాంకింగ్ రంగ షేర్లు నష్టాల్లోకి జారాయి. నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఆర్థిక సేవల శాఖ సంయుక్త కార్యదర్శి లోక్‌రాజన్ ఈ విషయంపై స్పందిస్తూ పీఎన్‌బీ కుంభకోణం విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరణనిచ్చారు. ఈ కేసు తమ నియంత్రణకు లోబడే ఉందని ఆయన అన్నారు.

## సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభల నిర్వహణ కోసం 20 కమిటీలు




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించబోయే సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభల నిర్వహణ కోసం మొత్తం 20 కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కమిటీలతోపాటు బాధ్యులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. ఈ కమిటీలన్నీ ముందు విడివిడిగా భేటీలవుతాయని చెప్పారు. ఆ తర్వాత పనులను ప్రారంభిస్తాయని వివరించారు. మహాసభలు జరిగే నాటికి ఆయా కమిటీల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సెమినార్లను, క్యాంపెయిన్లను నిర్వహిస్తాయి. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు మహాసభలు జరగనున్న సంగతి విదితమే.

| కమిటీలు | బాధ్యులు |
|---|---|
| కాన్ఫరెన్స్ హాల్ | బి వెంకట్ |
| భోజనాలు | చుక్కరాములు, ఎం.సాయిబాబు |
| వసతులు | జూలకంటి రంగారెడ్డి |
| ట్రాన్స్‌ఫోర్ట్ | ఎం శ్రీనివాస్ |
| ఎగ్జిబిషన్(హైదరాబాద్ ఫెస్ట్) | చెరుపల్లి సీతారాములు |
| కల్చరల్ ఫెస్ట్ | తమ్మినేని వీరభద్రం, నంద్యాల నర్సింహారెడ్డి |
| సెమినార్లు | టి జ్యోతి, జి రాములు |
| వలంటీర్స్, రెడ్‌షర్ట్ మార్చింగ్ | జి నాగయ్య |
| నిధులు | తమ్మినేని వీరభద్రం, డిజి నర్సింహారావు, బి వెంకట్ |
| సాహిత్యం | ఎస్ వీరయ్య |
| ప్రచారం | జూలకంటి రంగారెడ్డి, పి సుదర్శన్ |
| బహిరంగ సభ | నంద్యాల నర్సింహారెడ్డి |
| మీడియా | బి వెంకట్, ఎస్ రమ, జె బాబూరావు |
| ప్రభుత్వ రాయబారాలు | సున్నం రాజయ్య, జూలకంటి రంగారెడ్డి |
| శానిటేషన్ మరియు వాషింగ్ | పి ఆశయ్య |
| సోషల్ మీడియా | ఎస్ వినయకుమార్ |
| హెల్త్ | రమ |
| టెంట్‌హౌజ్ | భూపాల్ |
| సావనీర్ | ఆర్ సుధాభాస్కర్ |
| ప్రచార సామగ్రి | జె వెంకటేశ్, జె బాబూరావు |

## సెలవు అధికారం హెచ్‌ఎంలకే కానీ..!

### సవరణ ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సెలవుల మంజూరు అధికారం తిరిగి ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే అప్పగిస్తూ విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మండల విద్యాశాఖాధికారులతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం కాంప్లెక్స్ హెచ్‌ఎంలకూ సమాచారం ఇవ్వాల్సిందేనని ఆయన ఆదేశించారు. ఈ మేరకు డీఈఓలకు సవరణ ఉత్తర్వులు పంపించారు. ఇటీవలే హెచ్‌ఎంల అధికారాలను కత్తిరిస్తూ, ఎంఈఓలకు సెలవుల మంజూరు అధికారం ఇవ్వడంతో ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. అయితే కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమాచారమివ్వాల్సిన అవసరం లేదని, ఆ పదాలను ఉత్తర్వుల నుంచి తొలగించాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# బహుజనంలోకి బీఎల్ఎఫ్...

- నేడు హైదరాబాద్‌లో కీలక భేటీ
- 20న సంగారెడ్డిలో, 25న పాలమూరులో సమావేశాలు



(ఫైల్)

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యాలుగా.. బహుజనులకు రాజ్యాధికారమే ధ్యేయంగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఇక జనంతో మమేకం కానుంది. ఇందుకనుగుణంగా గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కీలక భేటీ నిర్వహించనున్నారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారు. దీంతోపాటు ఈనెల 20న పాత మెదక్ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. ఇందుకోసం బీఎల్ఎఫ్ రాష్ట్ర నేతలు సంగారెడ్డిలో భేటీ కానున్నారు. 25న మహబూబ్‌నగర్‌లో జరిగే సమావేశంలో పాత పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్ని ఈ సందర్భంగా గుర్తించాలని నిర్ణయించారు.

మరోవైపు హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకనుగుణంగా ఫ్రంట్‌లోని భాగస్వామ్య పక్షాలు కార్యాచరణలో నిమగ్నమయ్యాయి. దీంతోపాటు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించాలని బీఎల్ఎఫ్ నిర్ణయించింది. ఈ క్రమంలో గురువారం నాటి భేటీలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నారు.

# వైద్యవృత్తి 'కమీషన్'గా మార్చొద్దు

**ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు హితవు**



**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

వైద్యవృత్తి ఒక 'మిషన్'లాంటిదని దాన్ని 'కమీషన్'గా మార్చొద్దని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు హితవు పలికారు. తక్కువ ఖర్చుతో అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని అప్పుడే 'ఆరోగ్య భారతం' సాధ్యపడుతుందని చెప్పారు. దేశంలో అత్యధికశాతం నెలకొన్న శిశుమరణాలు, పోషకాహారలోపం ప్రధాన సవాళ్లని చెప్పారు. చిన్నారులే దేశ భవిష్యత్తు అని చెప్పిన ఉపరాష్ట్రపతి.. వాళ్ల కోసం ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని అన్నారు. అయితే ప్రభుత్వ, ప్రయివేటు వైద్యం కలిసికట్టుగా ముందుకు వచ్చినప్పుడే ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఆరోగ్యబీమాపథకం మరింత వేగంగా అమలు సాధ్యమవుతుందని చెప్పారు. బుధవారం ఢిల్లీలో హైదరాబాద్‌కు చెందిన మధుకర్ రెయిన్‌బో పిల్లల ఆస్పత్రిని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కేంద్రమంత్రి జేపీనడ్డా, ఆస్పత్రి ఎండీ రమేష్‌కంచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యంపై కేంద్రం ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తోందని చెప్పుకొచ్చారు. అయితే మారిన జీవనశైలిపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందని వెంకయ్యానాయుడు చెప్పారు. ఇందుకోసం సిలబస్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్నారుల వైద్యంలో దక్షిణ భారతంలో 18 యేండ్ల అనుభవంతో ఢిల్లీలో ఆస్పత్రి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని రమేష్ కంచర్ల తెలిపారు.

# టీచర్స్ యూనియన్స్‌తో సమావేశం వాయిదా

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

విద్యారంగంలోని పలు సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈనెల 10న జరగాల్సిన సమావేశం...రాజ్‌భవన్ హైస్కూల్‌లో గవర్నర్ పర్యటన నేపథ్యంలో సమావేశంలో ప్రారంభసమయంలో ఈనెల 15కు వాయిదా పడింది. గురువారం మధ్యాహ్నం 12గంటలకు జరగాల్సిన సమావేశం కూడా వాయిదా వేస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాల జేఏసీలకు పాఠశాల విద్యాశాఖ అధికారులు మెయిల్ ద్వారా సమాచారమిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ సర్కారుకు చిత్తశుద్ధి లేకనే వాయిదాలు వేస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.



# మినుము.. తక్కువ నీటితో ఎక్కువ పంట

**వేసవిలో మినుము పంట సాగు లాభదాయకమైంది. తక్కువ నీటితో పంట ఏపుగా పెరిగి లాభసాటి దిగుబడిని ఇస్తుంది. ఆరుతడి పంటగా వేసుకుని శ్రమను తగ్గించుకోవచ్చు. మినుము పంటసాగుకు వరి మాగాణులు అనువైన నేలలు. ఇవి తేమను నిలుపు కోగలుగుతాయి. ఈ పంటకు ఫిబ్రవరి-మార్చి నెలల్లో విత్తనం వేసుకోవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలతో సాగు పద్ధతులు పాటిస్తే అనుకున్నంత లాభాలు సాధిస్తారని చెబుతున్నారు.**

### యాజమాన్య పద్ధతులు

వేసవిలో మినుము పంట పండించే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. మెట్ట ప్రాంతాల్లో తేమను నిలుపుకోగలిగేలా ఉండాలి. మురుగు నీరుపారే సౌకర్యం ఉన్న భూములు అనువైనవి, నేలను బాగా దుక్కిదున్ని విత్తనం వేసేముందు ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల బాస్వరం ఎరువులు వేసి గొర్రుతో కలియ దున్నాలి. వరి మాగాణుల్లో మినుము సాగు చేసేటప్పుడు ఎరువులు వాడనవసరంలేదు. విత్తనం విత్తే సమయం ఫిబ్రవరి-మార్చి నెలలు. ఫిబ్రవరిలో విత్తన మోతాదు ఎకరాకు 10 నుంచి 12కిలోలు. మార్చిలో16 నుంచి 18కిలోల విత్తనాలు వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలి.

### విత్తనశుద్ధి

కిలో విత్తనాలకు 30గ్రాముల కార్బోసల్ఫాన్ 2.5గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును వాడి విత్తనశుద్ధి చేయాలి. నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే పంట దిగుబడిని ఎక్కువగా పొందొచ్చు.

### నీటి యాజమాన్యం

వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు ఒకట్రెండుసార్లు నీటి తడి ఇవ్వాల్సి ఉంటుంది. వరి మాగాణుల్లో నీటి తడి ఇవ్వొచ్చు. ఒకట్రెండుసార్లు తేలిక తడులు 30రోజులలోపు, 55రోజుల తర్వాత ఇస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు.

### అంతరకృషి

పెండి మిథాలిన్ 30శాతం ద్రావణం ఎకరాకు 1.0 నుంచి 1.5లీటర్లు లేదా అలాక్లోర్ 50 శా తం ఎకరాకు లీటరు చొప్పున విత్తనం విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. విత్తనం వేసిన 20-25రోజులకు గొర్రుతో దున్ని అంతర కృషి చేయాలి. వరి మాగాణిలో వేసిన మినుములో ఊద, చిప్పెర, గరికె లాంటి గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు ఫెనాక్సోప్రాప్ఇథైల్‌ను 9 శాతం ద్రావణం ఎకరాకు 250మి.లీ లేదా క్విజలాసాప్ ఇథైల్ 5శాతం ద్రావకం ఎకరాకు 400మి.లీ చొప్పున ఏదో ఒకదాన్ని 200లీటర్ల నీటిలో కలిపి విత్తిన 20-25రోజులకు పిచికారీ చేస్తే కలుపును సమర్థంగా నివారించొచ్చు.

### సస్యరక్షణ

**కాండపు ఈగ-చీడ లక్షణాలు :** ఈ పురుగు క్రిమి దశలో కాండంలో చేరి తినటం వల్ల మొక్క ఎండిపోతుంది. ఇది ఎక్కువగా తొలకరి పైరునే ఆశిస్తుంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లీటరు నీటిలో క్లోరిపైరిఫాస్ 2.5మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0మి.లీ లేదా నొవొల్యురాన్ 1మి.లీ లేదా లార్విన్ 1గ్రాము ం డైక్లోరోవాస్ 1.0మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

**మారుకా మచ్చల పురుగు-చీడ లక్షణాలు :** ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశించి ఎక్కువ నష్టం కలిగిస్తుంది. పూత దశలో పూవులను గేడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారు అయ్యేటప్పుడు కాయలను దగ్గరకు చేర్చి గూడు కడుతుంది. కాయకు రంధ్రం చేసి లోపలి గింజలను తినడం



వల్ల ఎక్కువ నష్టం వాటిల్లు తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2గ్రాములు 10రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కార్బన్‌డైజిమ్‌ను వాడొద్దు.

### తెగుళ్లు

**కొరినోస్పోరా (ఆకుమచ్చ):** ఈ తెగుళ్ల సోకిన ఆకులపై చిన్నచిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో పెద్ద మచ్చలు వలయాకారంగా ఏర్పడి ఆకులు ఎండి రాలుతాయి. దీని నివారణకు బుట్ట మినుము ఎల్జీబీ -402, ఎల్జీబీ -611, 22, 648,685, 709, 752 రకాలకు ఈ తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుంది.

**ఎండుతెగులు(విల్ట్):** ఈ తెగులు ఆశించిన మొక్కలు వాడి ఎండిపోతాయి. పంటకు అధిక నష్టం కలుగు తుంది. ఈ తెగులు భూమిలో ఉన్న శిలీంద్రం ద్వారా వ్యాపిస్తుంది. కనుక పైరుపై మందులు చల్లి నివారించడం లాభసాటి కాదు. ఒకే పంటను సంవత్స రాల తరబడి వేయొద్దు. నీరు నిల్వకుండా చూసుకోవాలి.

పక్షికన్ను తెగుళ్ల (అంత్రాక్నోస్) ఈ తెగుళ్ల సోకిన ఆకులపై లేత పసుపు రంగు అంచులతో కూడిన చిన్నచిన్న గోదుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.


**తుప్పు, కుంకుమ తెగుళ్లు :** పైరు పూతదశలో సోకి ఈ తెగుళ్ల లక్షణాలు కనిపిస్తాయి. ఆకు ఉపరితలంపై లేత పసుపు వర్ణం గల గుండ్రని చిన్న మచ్చలు ఉంటాయి. ఆ తర్వాత కుంభాకార స్థితిలో కూడిన గుండ్రని మచ్చలు కుంకుమ, తుప్పురంగును పోలి ఉంటాయి. దీని నివారణకు 3 గ్రాముల మాంకోజెబ్ ప్లస్, ఒక మిల్లీ లీటరు డైనో కాప్, 1 మిల్లీ లీటరు ట్రైడీమార్, ఒకగ్రాము బైలాటాన్ కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**సీతాఫల తెగుళ్లు :** ఇది వైరస్ జాతి తెగుళ్లు. విత్తనం ద్వారా, పేనుబంక ద్వారా వ్యాపిస్తుంది. తెగుళ్లు సోకిన మొక్కల ఆకులు ముడతలుగా ఏర్పడి పెద్దగా పెరుగుతాయి. మొక్కలు పూత, కాత లేకుండా ఉంటాయి. పేనుబంక నివారణకు లీటరు నీటిలో 2 మిల్లీ లీటర్ల డైమిథోయేట్ లేదా 1.5మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్లు సోకిన మొక్కలను పీకి తగలబెట్టాలి.

**పల్లాకుతెగులు :** ఇది జెమిని వైరస్ జాతి వల్ల వస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు కాయల మీద పసుపు పచ్చ మచ్చలు ఏర్పడతాయి. తొలిదశలో ఈ వైరస్ తెగుళ్లు ఆశించినట్లయితే పైరు గిడసబారిపోయి పూత పూయక ఎండిపోతుంది. ఈ వైరస్ తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది.

ఈ తెగుళ్లను తట్టుకునే ఎల్‌బీజీ-752, టీయూ94-2, పీయూ 31 రకాల మినుము పంటను సాగుచేసు కోవాలి. తెల్లదోమ నివారణకు లీటరు నీటిలో మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు, ఏసిఫేట్ 1గ్రాము, డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా ఫాస్ఫామిడాన్ 2మిల్లీ లీటర్లు కలిపి వారం నుంచి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి పిచికారీ చేయాలి. మినుముపై ఆశించే తెల్లదోమ చిత్తా, తామర, పొగాకు లద్దెపురుగు, బూడిద సెర్కోస్పోరా, ఆకుముడత తెగుళ్లను నివారించవచ్చు.

– సేకరణ మోత్కూరి యాదయ్య



# మామిడి పూత పదిలం

**భారతదేశం పండ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. పండ్ల తోటల్లో మామిడి ప్రధానమైనది. ప్రస్తుతం భారతదేశంలో మామిడి 2.297 మిలియన్ హెక్టార్లలో 15,188 మిలియన్ టన్నుల ఉత్పత్తిలో సాగు చేస్తున్నారు. ప్రధానంగా మామిడి పండించే రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, కర్నాటకలో అధికంగా పండిస్తున్నారు. మన రాష్ట్రంలో ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లో అత్యధికంగా సాగు చేస్తున్నారు.**

**నేలలు :** అన్ని నేలలు అనుకూలం. కానీ లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్టు బాగా అభివృద్ధి చెంది చాలా కాలం ఫలిస్తాయి. చౌడు, ఉప్పు, సున్నం నీరు నిల్వ ఉండే బరువైన నల్లరేగడి నేలల్లో నాటకూడదు. ఉదజని సూచిక 7.5-8.0 ఉన్న నేలలు అనుకూలం.

### రకం - లక్షణాలు

**బంగినపల్లి (బనేషాన్):** చెట్టు మధ్యస్థం, పండు పెద్దది. తోలు పల్చగా, పసుపురంగు, కండగట్టిగా ఉండి నార తక్కువగా ఉంటుంది. నాణ్యమైన రకం. నిలకడగా ప్రతి ఏటా కొద్దిగా ఆలస్యంగా కాపు కాసే రకం.

**చీడపీడలు:** బూడిద తెగులు, తేనె మంచు పురుగు గాలులను ఓ మాదిరిగా తట్టుకునే రకం.

**అనుకూలత :** రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అనుకూలం.

**ప్రత్యేక లక్షణాలు :** ముఖ్యమైన వాణిజ్య రకం. ఎగుమతికి అనుకూలం. ఎక్కువ కాలం నిల్వకు అనుకూలం.

**తోతాపురి:** చెట్ట మధ్యస్థం నిటారుగా పైకి పెరుగుతంది. పక్కలకు కొమ్మల వ్యాప్తి తక్కువ. పండు మధ్యమం నుండి పెద్దది. తోలు మందం. బంగారు పసుపు రంగు. కండ గట్టిది. నారలేదు. నాణ్యత తక్కువ. బంగినపల్లి కన్నా ఆలస్యంగా కోతకొస్తుంది. చెట్టు పెలుసు. గాలి దుమారాలకు, పెనుగాలులకు తట్టుకోలేదు. నిలకడగా కాపుకాసే రకం.



**చీడపీడలు:** బంగినపల్లి కన్నా ఎక్కువగా తేనె మంచుపురుగుకు గురవుతుంది. టెంక పురుగు, పండు ఈగ బెడద ఎక్కువ.

**అనుకూలత :** రాష్ట్రంలో అన్ని నేలలు అనుకూలం.

**ప్రత్యేక లక్షణాలు :** బాటా నిల్వ ఉండే రకం. పల్స్ తయారీకి అనుకూలం.

**సువర్ణ రేఖ:** చెట్టు మధ్యస్థం. పండు మధ్యమం. తోలు మరీ మందంగా ఉండదు. ఎరుపు రంగు. కండ మెత్తగా ఉండి, నార ఉండదు. నాణ్యత ఒక మాదిరి. నిలకడగా కాపు కాసే రకం.

**చీడపీడలు :** తేనె మంచు పురుగును ఓ మాదిరిగా తట్టుకుంటుంది. బూడిద తెగులుకు కొంత మేరకు గురవుతుంది.

**కేసర్:** చెట్టు పెద్దదిగా ఉంటుంది. కాయ బరువు 200 గ్రా. పండు ఎరుపు రంగుతో కండ బంగారం వర్ణంతో ఉండి నార ఉండదు. అధిక నాణ్యత కలిగి ఉంటుంది. నిలకడగా కాపుకాసే రకం. మధ్యస్థంగా ఉంటుంది.

**అనుకూలత:** తెలంగాణలోని అన్ని రాష్ట్రాలకు అనుకూలమే. ఇవి కాకుండా...

దశేరి, హిమాయత్, ( రసభరిత రకాలు) పెద్దరసం, చిన్న రసం,చెరకు రసం, (సంకర రకాలు) మంజీరా,దషేరి మహబూడ, నిలేషాన్,అమ్రపాలి,మల్లిక, రత్న, అర్కపునీత్, సంధూ, రాయల్ స్పెషల్,బారమాసి.

**మొక్కలు నాటడానికి అనువైన కాలం:** మామిడి మొక్కలను జూన్ నుండి డిసెంబర్ వరకు నాటుకోవచ్చు. మొక్కలు త్వరగా నాటుకొని అభివృద్ధి చెందడానికి తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో జూన్-జులైలోనూ, ఎక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో అక్టోబరు, నవంబరు మాసాల్లోనూ నాటుకోవాలి.

**నేలను తయారు చేయడం:** వడగాల్పులు, పెనుగాలులు వీచే ప్రాంతాల్లో సురుగుడు, యూకలిప్టస్, ఎర్ర చెందనం మొదలైనవి గాలులు వీచే దిశలో రెండు వరుసల్లో 2 మీటర్ల ఎడంలో నాటుకోవాలి.

నేలను రెండు మూడు సార్లు బాగా దున్ని చదును చేసి 1×1 మీటర్ల గుంతలు తవ్వాలి. మొక్కల్ని గుంతల్లో నాటడానికి ముందు 50కిలోలు బాగా చివికిన పశువుల ఎరువు, రెండు కిలోల సింగిల్ సూఫర్ ఫాస్ఫేట్, చెదలు రాకుండా అరికట్టేందుకు 100గ్రాముల ఫాలిడాల్ 2 శాతం పొడిని తవ్విన మట్టిలో కలిపి గుంతలను నింపి 7-10 లీటర్ల దూరాన నాటాలి. బాగా సారవంతమైన నేలల్లో 12 మీటర్ల దూరంలో కూడా నాటుకోవచ్చు.

**మామిడి అంట్ల ఎంపిక:** చీడపీడలు ఆశించని వెనీర్ గ్రాఫ్టింగ్ అంట్లను మాత్రమే నాటుకోవాలి. వేరుమూలం, సయార్ బాగా అతికి ఉండాలి. అంట్లను నాటేటప్పుడు కొత్త చిగుళ్ల వేరు మూలాలపై ఉండరాదు.అంటు కట్టిన భాగం భూమిపై నుంచి 20 సెం.మీ ఉండి అంటు పై భాగం పచ్చగా ఆరోగ్యంగా ఉండాలి. అంట్లు ఒకటి నుంచి ఒకటిన్నర సంత్సరం వయస్సు కలిగి ఉండాలి.

**మొక్కలు నాటడం:** అంటు మొక్కను మట్టిగడ్డతోసహా తీసి వేర్లు కదలకుండా గుంత మధ్యలో నాటి, మట్టితో గట్టిగా నొక్కి గాలి పోకుండా చిన్న కొయ్యపాతి కదలకుండా కట్టాలి. నాటిన వెంటనే 1.5 అడుగుల వెడల్పు పాదులు చేసి నీరుపెట్టాలి. తర్వాత 8నుంచి 10 రోజులకొకసారి వర్షాలు లేనప్పుడు నీరు పోసి రెండేండ్ల వరకు కాపాడాలి.

**కలుపు నివారణ అంతరకృషి:** వర్షాకాలంలో రెండుసార్లు తోటంత దున్నడం వల్ల కలుపు మొక్కలను అదుపులో ఉంచడమే కాకుండా నేల గుల్లబారి వాన నీరు ఇంకుతుంది. వర్షాకాలంలో తొలకరి వర్షం తర్వాత అట్రటాఫ్ ఎకరాకు 800గ్రా. 240 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. తరువాత వచ్చే గడ్డి, తుంగజాతి కలుపు నివారణకు గ్లైసెల్ లేదా రౌండప్ కలుపు మందును లీటరు నీటికి 8 మి.లీ మందును కలిపి దానితోపాటు 20 గ్రా. అమ్మోనియం సల్ఫేట్‌గానీ 10గ్రా, యూరియాగానీ 20నుంచి 25 రోజుల కలుపుపై పిచికారి చేయాలి. ఈ మందు వాడేటప్పుడు చిన్న వయసు పండ్ల మొక్కల మీద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. (చీనీ, నిమ్మ, ద్రాక్ష,జామ, సపోట,దానిమ్మ,రేగు, సీతాఫలం, పండ్ల తోటల్లో కూడా ఇదే విధంగా కలుపు నివారించుకోవచ్చు.

**అంతర పంటలు :** లేత తోటల్లో కూరగాయలు, తక్కువ ఎత్తు పెరిగే పైర్లు ఫాల్సా, బొప్పాయిలాంటి పండ్ల తోటలను మిశ్రమ పంటలుగా వేసుకోవచ్చు.నేలను త్వరగా నిస్సారం చేసే మొక్కజొన్న, చెరకు, పిండి పురుగు ఎక్కువగా ఆశించే కందిని, జింక్ పొటాష్ లోపాలను పెంచే నేపియర్ గడ్డిని అంతర పంటలుగా పెంచరాదు.

**నీటి యాజమాన్యం:** చిన్న మొక్కలకు 6 నెలల వరకు 3 రోజులకొకసారి నీరు పెట్టాలి. కాపుకు వచ్చిన చెట్లకు పూత, పిందె దశల్లో నీటి ఎద్దడి రాకుండా నీరు పెట్టాలి. మామిడి తోటలకు కాయ పెరిగే దశలో కనీసం రెండుసార్లు అంటే పిందె ఏర్పడిన తర్వాత 25 నుంచి 30 రోజులకు ఒకసారి నెల రోజుల తర్వాత మరో సారి నీరుకట్టి, కాయలు కోయడానికి నెల రోజుల ముందు నీరు పెట్టడం నిలిపివేయాలి. మామడి కోత తర్వాత వెంటనే ఒకసారి నీరుపెట్టాలి. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడితే వేరుకుళ్ల తెగులు ఉధృతి చెంది తోటంతా దెబ్బతింటుంది.

### సస్యరక్షణ పురుగులు :

తేనె మంచు పురుగు, కాండం తొలిచే పురుగు, కాయతొలుచు పురుగుల నివారణకు

- మామిడి పంట పూర్తయిన తర్వాత ఎండు కొమ్మలను తీసివేసి నాశనం చేయాలి
- మామిడి పంటకాలం పూర్తయిన తర్వాత ఎండు కొమ్మలు, కాండం పగుళ్లలో గత స్థబ్ద స్థితిలో ఉన్న గొంగళి పురుగులను నాశనం చేయాలి
- మెత్తని ఎండు పుల్లలను కొమ్మ చుట్టూ గుత్తులుగా కట్టి నిద్రావస్థకు చేరిన గొంగళి పురుగులను ఒకేసారి నాశనం చేయవచ్చు.
- క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, డైక్లోరోవాస్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- వేప గింజల కాషాయం5శాతం గానీ వేపగాని 1శాతం (లీటరు నీటికి 10 మి.లీ ) మందు పిచికారి చేసి ఈ పురుగులను అదుపులోకి తెచ్చుకోవచ్చు.
- డెల్టామిత్రిన్ 28 ఇసి,1 మి.లీ లీటరు నీటికి కలిపి గోళీసైజు కాయ దశలో రెండు వారాలకొకసారి పిచికారి చేయాలి.

డాక్టర్. రావి చంద్రశేఖర్
డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్
శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్
హార్టికల్చర్ యూనివర్సిటీ



# రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

*ప్ర. సోయాచిక్కుడులో పెంకు పురుగు నివారణ చెప్పండి?*

***జానిమియా, మేడారం గ్రా, పెద్దఅడిశర్లపల్లి మం, నల్లగొండ జిల్లా***

*జ. ఈ పురుగు కాండం మీద అర్ధ చంద్రాకారంలో రంధ్రం చేసి లోపలికెళ్లి ప్రధాన కాండాన్ని, పక్క కొమ్మల లోపలి పదార్థాన్ని తినడం వల్ల కొమ్మల చివరి భాగం ఎండిపోతుంది. నివారణకు ట్రైజోఫాస్ 2.0 మి.లీ లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.*

*ప్ర. జొన్నలో బంకకారు తెగులు నివారణ చెప్పండి?*

***శైలు, చంద్రుపర్ర గ్రా, భువనగిరి మం, యాదాద్రి జిల్లా***

*జ. పంట పుష్పించే దశలో ఆకాశం మేఘావృతమై, చల్లని తేమతో కూడిన వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం. తెగులు సోకిన కంకుల నుండి తెల్లటి లేదా గులాబీ రంగుతో కూడిన తియ్యటి జిగురు వంటి ద్రవం కారడం గమనించవచ్చు. దీని నివారణకు లీటరు నీటికి బెనోమిల్ 1 గ్రా. లేదా ప్రొఫికొనజోల్ 1.0 మి.లీ వారం వ్యవధిలో రెండుసార్లు పూత దశలో చల్లాలి.*

*ప్ర. తామర పురుగుల నివారణ చెప్పండి?*

***రామకృష్ణ గౌండపల్లి గ్రా. గాంధేడ్ మం, మహబూబ్‌నగర్ జిల్లా***

*జ. ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూతకూడా వాడిపోయి రాలిపోతుంది. నివారణకు డైమిథోయేట్ లేక ఫిప్రోనిల్ 2.0 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.*

***ప్ర. తోటకూరలో తెల్లమచ్చ తెగులు నివారణ చెప్పండి?***

**4. రాజిరెడ్డి, వేణుగోపాలపురం, సిరిసిల్లా జిల్లా**

*జ. ఆకుల అడుగు భాగాన తెల్లటి బుడిపెల వంటివి ఏర్పడతాయి. ఆకుల పైభాగాన లేత పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 మాంకోజెబ్ మందును కలిపి పిచికారి చేయాలి. ఆకుల అడుగు బాగం బాగా తడిచేలా చేయాలి.*

ప్ర. వరిలో కంకినల్లి నివారణ చెప్పండి?

**మహేందర్, దోమ గ్రా, మం, వికారాబాద్ జిల్లా**

జ. ఆకుల మధ్య ఈనెలపై, ఆకుమట్టల కాండం మీద ముదురు గోధుమ నుండి నల్లటి మచ్చల ఏర్పడతాయి. వెన్నులు పూర్తిగా లేక పాక్షికంగా తాలుగా మారడం లేదా వంకర తిరగడం జరుగుతుంది. గింజల మీద మచ్చలు ఏర్పడతాయి.నివారణకు టైకోఫాల్ 5 మి.లీ లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

## అడగండి.. చెబుతాం!

**రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.**

### మా చిరునామా

**'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్:** 8332995392,
k i s



# అగ్ర స్థానంలో భారత్

- ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్

**న్యూఢిల్లీ:** ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్ర స్థానానికి ఎగబాకింది. దక్షిణాఫ్రికాతో ఐదో వన్డేలో 73పరుగుల తేడాతో గెల్చిన భారత్ 4-1తో సిరీస్ సొంతం చేసుకున్నది. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వెలువరించిన వన్డే ర్యాంకింగ్స్‌లో కోహ్లి సేన 122 పాయింట్లతో అగ్ర పీఠం దక్కించుకున్నది. 121 పాయింట్ల నుంచి 118 పాయింట్లకు పడిపోయిన దక్షిణాఫ్రికా రెండో స్థానంలో నిలిచింది. ఆరు వన్డేల సిరీస్‌లో తొలుత నాల్గో వన్డే విజయంతోనే భారత్ ఒకటో ర్యాంకు చేజిక్కించు కుంటుంది అనుకున్నా.. వరుణుడు దెబ్బ కొట్టటంతో జోహనెస్‌బర్గ్‌లో వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఇక సిరీస్‌లో వైఫల్యాలతో ఇబ్బంది పడిన రోహిత్ శర్మ ఐదో వన్డేలో భారత్ తరఫున కీలక ఇన్నింగ్స్ ఆడగా, బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో టీమ్ ఇండియా మరో మ్యాచ్ మిగిలుండగానే తొలిసారి సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికా గడ్డపై ద్వైపాక్షిక సిరీస్ సొంతం చేసుకున్నది.

# క్వార్టర్స్‌లో హైదరాబాద్

## చత్తీస్‌ఘడ్‌పై హైదరాబాద్ విజయం

- సిరాజ్ మెరుపులు
- సందీప్ అర్ధ శతకం
- విజయ్ హజారే ట్రోఫీ

**హైదరాబాద్:** అంబటి రాయుడు సేన విజయ్ హజారే ట్రోఫీలో మరో విజయం ఖాతాలో వేసుకుని క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నది. హైదరాబాద్ బౌలర్ మహ్మద్ సిరాజ్ (5/37) చెలరేగటంతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్‌ను 84 పరుగుల తేడాతో చిత్తు చేసింది. సికిందరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన పోరులో టాస్ నెగ్గిన హైదరాబాద్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. ఓపెనర్లు స్వల్ప స్కోరుకే పరిమితమైనా.. భవనాక సందీప్ (75, 95 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో రాణించాడు. కెప్టెన్ అంబటి రాయుడు (46), తెల్కుపల్లి రవితేజ (45)లు హాఫ్ సెంచరీ



ముంగిట ఔటయినాఆ.. కీలక ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరును నడిపించారు. నిర్ణీత ఓవర్లలో 280 పరుగులు చేసింది హైదరాబాద్. ఇక ప్రత్యర్థి ఇన్నింగ్స్‌లో హైదరాబాదీ బౌలర్ సిరాజ్ రెచ్చిపోయాడు. చత్తీస్‌ఘడ్ టాప్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. అమన్‌దీప్ ఖారే (71) పరుగులు కాస్త ఇబ్బంది పెట్టినా.. హసన్ బౌలింగ్ లో స్టంప్ ఔట్ అయ్యాడు. సంజీత్ దేశాయ్ (47) మినహా టెయిలెండర్లు నిలువలేకపోవటంతో 44.3 ఓవర్లకే అన్ని వికెట్లు కోల్పోయిన చత్తీస్‌ఘడ్ 196 పరుగులకే పరిమిత మైంది. మొత్తం ఆరు మ్యాచుల్లో ఐదింట నెగ్గిన హైదరాబాద్ 20 పాయింట్లతో గ్రూప్ డి లో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

# రబాడాకు ఫైన్

- ఐసీసీ నిబంధనలు ఉల్లంఘించిన పేసర్

**దుబాయ్ :** దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడాకు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోతం విధించింది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ భారత్‌తో పోర్ట్ ఎలిజబెత్ వేదికగా జరిగిన ఐదో వన్డేలో అత్యుత్సాహం ప్రదర్శించాడు రబాడా. టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్‌ను చూస్తూ అభ్యంతరకర సంజ్ఞలు చేశాడు. భారత ఇన్నింగ్స్‌లో ఎనిమిదో ఓవర్లో ఈ ఘటన చోటు చేసుకున్నది. ధావన్ ఔటయ్యాక మైదానాన్ని వీడుతుండగా.. పెవిలియన్ దారి చూపిస్తూ వీడ్కోలు పలుకుతున్నట్టు చేతిని ఊపాడు రబాడా. ధావన్ ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు సైతం చేశాడు. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ రబాడాకు మ్యాచ్ ఫీజులో కోత విధించటమే గాక ఒక డీమెరిట్ పాయింట్‌ను అతని ఖాతాలో వేసింది. 'రబాడాకు డీమెరిట్ పాయింట్ ఇవ్వటం జరిగింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఒకటో స్థాయి నిబంధనలను రబాడా ఉల్లంఘించాడు.' అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొన్నది.



ఆన్ ఫీల్డ్ అంపైర్లు ఇయన్ గౌల్డ్, షాన్ జార్జ్ సహా మూడో అంపైర్ అలీమ్ దార్, నాల్గో అంపైర్ బొంగానీ జెలెలు ఆర్టికల్ 2.1.7 ప్రకారం రబాడా దూకుడు చర్యను ఐసీసీ ప్యానెల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఆర్టికల్ ప్రకారం 'ఏదేని అంతర్జాతీయ మ్యాచ్‌లో మాటలతో గానీ, సంజ్ఞలు లేదా చేతలతో గానీ ఔటయిన బ్యాట్స్‌మెన్‌కు కోపం తెప్పించేలా ప్రవర్తించ కూడదు.' ఇక ఈ విషయమై రబాడా తప్పొప్పుకున్నాడు. ఐసీసీ మ్యాచ్ రిఫరీ ప్యానెల్ విధించిన శిక్ష (మ్యాచ్ ఫీజులో కోత, డీమెరిట్ పాయింట్)ను స్వీకరిస్తున్నట్టు తెలిపాడు. దీంతో విచారణకు అవసరం లేకుండాపోయింది. గతేడాది ఫిబ్రవరి 8 నుండి రబాడా ఐదు డీమెరిట్ పాయింట్లు తన ఖాతాలో మూటగట్టుకున్నాడు. 24 నెలల వ్యవధిలో రబాడా ఎనిమిది డీమెరిట్ పాయింట్ల పరిమితి దాటితే రెండు టెస్టులు లేదా ఒక టెస్టు, రెండు వన్డేలు/టీ20లు లేదా నాల్గు వన్డేలు/టీ20లు నిషేధం ఎదుర్కొంటాడు.

# మూడ్‌ను బట్టే ఆట

## ఐదో వన్డేలో శతకంపై యిహో శర్మ



మ్యాన్ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో రోహిత్

**పోర్ట్‌ఎలిజబెత్:** టీమ్ ఇండియా ఓపెనర్ రోహిత్ శర్మ మూడ్‌ను బట్టే ఆట ఉంటుందని తెలిపాడు. ప్రత్యేకించి బ్యాట్స్‌మెన్ మూడ్ బాగుంటేనే పరుగుల ప్రవాహం సాధ్యమని అన్నాడు. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో ఇక్కడ జరిగిన ఐదో వన్డేలో రోహిత్ శర్మ శతకంతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న రోహిత్ మీడియాతో మాట్లాడుతూ మంచి మూడ్‌తో ఆడానని, అందువల్లే శతకం సాధించినట్టు తెలిపాడు. భారత్ చారిత్రను తిరగరాసిన ఐదో వన్డేలో ఇద్దరు బ్యాట్స్‌మెన్ రనౌట్లలో రోహిత్‌దే పొరపాటు. అయితే వారిద్దరు రనౌట్ కావటం వల్ల ఒత్తిడి పెరిగిందని, కానీ ఏకాగ్రత కోల్పోకుండా ఆట మీద దృష్టి పెట్టానని అన్నాడు హిట్ మ్యాన్.

'నా కన్నా ముందు ఇద్దరు బ్యాట్స్‌మెన్ రనౌట్ అయ్యారు. అందుకే శతకానంతరం నేను సంబరాలు చేసుకోలేదు. ఏదైనా మన మూడ్‌ని బట్టి ఉంటుంది. మిడిలార్డర్‌లో కీలకమైన ఇద్దరు బ్యాట్స్‌మెన్ రనౌట్ అయి క్రీజును వీడారు. దాంతో నా మనసంతా వికెట్ కాపాడుకుంటూ వీలైనన్ని పరుగులు చేయటం మీదే నిలిపా. సెంచరీ చేయగానే సంబరాలు చేసు కోవాలన్న ఆలోచనే రాలేదు.' అని రోహిత్ వివరించాడు. ఇక దక్షిణా ఫ్రికాతో ఆడిన మొదటి నాలుగు వన్డేల్లో రోహిత్ శర్మ సాధించన పరుగులు కేవలం40. ఫామ్‌లేమిపై రోహిత్ స్పందిస్తూ 'మూడు మ్యాచు ల్లో నేను సరిగా ఆడలేకపోయాను. కేవలం దాన్ని బట్టే నేను ఫామ్ కోల్పోయానని అంచనా ఎలా వేస్తారు? ఒక ఆటగాడు మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతే ఫామ్‌లో లేనట్టేనా? ఫామ్ అనేది కేవలం రెండు, మూడు మ్యాచుల్లో ప్రదర్శనని బట్టి నిర్వచించేది కాదు. ఆ విషయం తెలుసుకోవాలి' అని ఆగ్రహ స్వరంతో రోహిత్ అన్నాడు.

'తొలి మూడు మ్యాచ్‌ల్లో రాణించలేకపోయాను. ఆ విషయం నాకు కూడా తెలుసు, ఒప్పుకుంటా. నెట్ ప్రాక్టీసులో బాగానే బ్యాటింగ్ చేసేవాడిని. అయినప్పటికీ మైదానంలో ప్రతిఫలం దక్కలేదు. ప్రతి క్రీడాకారుడు ఏదో ఒక సమయంలో ఇలాంటి సమస్య ఎదుర్కొంటాడు. ఆటలో ఇలాంటివన్ని సహజం. ఇలాంటి సవాళ్లు ఎదురైతేనే ఒక ఆటగాడిగా మరింత శ్రమిస్తాం. నేను దానికి అతీతం కాదు. విఫలమైనపుడు కుమిలిపో లేదు. ఎందుకిలా జరుగుతోందని ఆలోచించా. లోపం ఎక్కడుందో తెలుసుకొనే ప్రయత్నం చేశా. తర్వాతి గేమ్‌లో అలా జరగ కుండా జాగ్రత్తగా ఆడాలని నాకు నేనే సర్ది చెప్పుకున్నా' అని రోహిత్ తెలిపాడు. అనంతరం తాను సాధించిన శతకం గురించి మాట్లాడుతూ..'ఇప్పుడు నేను సాధించిన శతకం పాతదైపోయింది. తదుపరి మ్యాచ్‌పై ద ష్టి సారించా. నా వంతుగా వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించాలి. జట్టు స్కోరు పెంచటమే నా కర్తవ్యం. ఇప్పటికే 4-1తో సిరీస్‌ను సొంతం చేసుకున్నాం. 5-1 తేడాతో సిరీస్‌లో ఆధిక్యం దక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం' అని వివరించాడు.



# యుకీ ముందంజ

- ప్రీ క్వార్టర్స్‌లో రావత్‌పై విజయం
- చెన్నై చాలెంజర్

**చెన్నై :** గత నెల జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రధాన టోర్నీలో అడుగుపెట్టిన భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ స్వదేశంలో ఏటీపీ చాలెంజర్ టోర్నీలోనూ దూసుకుపోతున్నాడు. తొలి పోరులో అన్‌సీడెడ్ స్పెయిన్ ఆటగాడిని వరుస సెట్లలో మట్టికరిపించిన యుకీ.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సహచర ఆటగాడు సిద్ధార్థ్ రావత్‌పై సునాయస విజయం సాధించాడు. గంటలోపే 6-2, 6-3తో పైచేయి సాధించి, రెండు సెట్లలోనే ఆట ముగించి క్వార్టర్స్‌లో కాలుమోపాడు. తొలి సెట్‌ను 0-1తో ఆరంభించిన రెండో సీడ్ యుకీ రెండు సార్లు రావత్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. 2-1 తర్వాత ఆధిక్యం పెంచుకుంటూ పోయాడు. 3-1తో ఉన్న వేళ 2-3తో రావత్ పోటీలోకొచ్చే ప్రయత్నం చేశాడు. 6-2తో తొలి సెట్ గెల్చిన యుకీ రెండో సెట్‌ను ఉత్సాహంగా ఆరంభించాడు. 1-0, 3-1, 4-2తో కొనసాగి 6-3తో సెట్ కైవసం చేసుకున్నాడు. సెమీస్‌లో స్థానం కోసం ఆరో సీడ్ జపాన్ కుర్రాడు యసుటాకా ఉచియామాతో నేడు యుకీ తలపడనున్నాడు. ఇక రావత్ సహా బుధవారం అర్జున్ కాదే, అభినవ్ సింజీవ్ షణ్ముగం ఇంటిముఖం పట్టారు. నాల్గో సీడ్ ఈజిప్టు ఆటగాడు మొహ్మద్ సాఫ్‌వత్ చేతిలో 4-6, 2-6తో అర్జున్ ఓడగా, మూడో సీడ్ దక్షిణా కొరియా కుర్రాడు లీ డక్‌హీ చేతిలో 2-6, 4-6తో అభినవ్ ఓటమి పాలయ్యాడు. సింగిల్స్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన సాకేత్ మైనేని లూకా మార్గరోలి (స్విట్జర్లాండ్) జతగా సెమీస్‌లో అడుగుపెట్టాడు. నాల్గో సీడ్ సాకేత్ జంట.. సెమీస్ చేరిన రెండో సీడ్ భారత జోడీ విష్ణువర్థన్, ఎన్ శ్రీరాం బాలాజీలతో నేడు తలపడనున్నారు.

### కృష్ణా నీటిలో తెలంగాణకు

# 575 టీఎంసీల వాటా కావాలి

**పట్టిసీమలో 45 టీఎంసీల కోసం డిమాండ్**

- పోలవరం ముంపుపై మళ్లీ సర్వే చేయాలని కేంద్రాన్ని కోరనున్న అధికారులు
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం
- రేపు ఢిల్లీలో కీలక సమావేశం

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

కృష్ణా, గోదావరి నదుల నీటిలో తెలంగాణ రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన వాటా పై గట్టిగా పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిల్లీలో గురువారం కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జరగనున్న రెండు రాష్ట్రాల అధికారుల సాథయి సమావేశంలో అనుసరించవలసిన వ్యూహంపై బుధవారం జలసౌధలో ఇరిగేషన్ అధికారులకు మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగే విధంగా ఆంధ్రప్రదేశ్ చేసే ప్రతిపాదనలను ఎలా తిప్పికొట్టాలన్న అంశంపై కూడా చర్చించారు. కృష్ణా నీటిలో తెలంగాణకు 575 టీఎంసీల వాటా కావాలని పోరాడటానికి నిర్ణయించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఏపీ తరలిస్తున్న గోదావరి నీటిలో 45 టీఎంసీల నీటి వాటా కోసం డిమాండ్ చేయాలని మంత్రి చెప్పారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల జరిగే ముంపు సమస్యలపై మంత్రి సమీక్షించారు. తెలంగాణలోని చారిత్రక భద్రాచలం శ్రీ సీతారామస్వామి దేవాలయం సహా పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ తదితర ముఖ్యమైన ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు. భద్రాచలం పట్టణం దాని చుట్టుపక్కల గోదావరి పరీవాహక ప్రాంతంలో 124 కిలోమీటర్ల మేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావం ఉంటుందని ఆయన అన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించవలసిందిగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఉన్నతాధికారులను మంత్రి హరీశ్ రావు కోరారు. బచావత్ ట్రిబ్యూనల్ అవార్డు ప్రకారం పోలవరానికి కేంద్ర జలసంఘం అనుమతులు ఇచ్చిన తర్వాత నాగార్జున సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 45



టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు దక్కుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం కేంద్రమే జాతీయప్రాజెక్టుగా పోలవరాన్ని చేపట్టినందున ఆ 45 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల కింద 36.45 లక్షల హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూములున్నప్పటికీ కేవలం 5.75 (15 శాతం ) లక్షల హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు అందుతున్నదన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల కింద నీటి వాడకాన్ని లెక్క గట్టేందుకు టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2016 జూన్లో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినప్పటికీ కృష్ణా బోర్డు వాటిని అమలు చేయలేదన్నారు. తొలివిడతలో 19 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు 2017 ఫిబ్రవరిలో బోర్డు ప్రతిపాదించినప్పటికీ ఆ టెలిమెట్రీ స్టేషన్లు పనిచేయడం లేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండో విడత టెలిమెట్రీ స్టేషన్ల జాబితా ను ఇంతవరకు ఖరారు చేయకపోటాన్ని మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. టెలిమెట్రీ స్టేషన్ ల ఏర్పాటులో జరుగుతున్న జాప్యం వల్ల పోతిరెడ్డిపాడు కింద అధిక నీటిని కృష్ణా బేసిన్ అవతలకు ఏపీ అక్రమంగా తరలిస్తున్నట్టు హరీశ్ ఆరోపించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జోషి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, ఈఎన్‌సీలు మురళీధరరావు, నాగేందర్‌రావు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 460 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు

- వచ్చే ఏడాది జనవరిలో గజ్వేల్ రైలులో సీఎం, రైల్వే జీఎం ప్రయాణం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

అక్కంపేట-మెదక్, కొత్తపల్లి-మనోహరాబాద్ రైలు మార్గాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులను మంత్రి హరీశ్‌రావు కోరారు. 2019 కొత్త సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి గజ్వేల్‌కు రైలులో ప్రయాణించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు..రాష్ట్రంలో ఉన్న 460 రైల్వే లెవెల్ క్రాసింగులకు ఆర్వోబిల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. 460 ఆర్వోబీల నిర్మాణం దశల వారీగా చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. రైల్వే పెండింగ్ బ్రిడ్జి నిర్మాణాలపై ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జల సౌధలో బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో రహదారులు భవనములు శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రవాణశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం 52ఆర్వోబీలు నిర్మాణానికి 2700కోట్లతో అంచనాలు సిద్ధం చేసినట్టు రైల్వే జీఎం చెప్పారు. 52 ఆర్వోబీల నిర్మాణానికి రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు 50 : 50 నిష్పత్తిలో నిధులు ఖర్చు చేస్తామన్నారు. రోడ్ ఓవర్ బ్రిడ్జి, రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు. రైల్వే లెవెల్ క్రాసింగుల వద్ద ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించేందుకు కత నిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నాలుగు వరుసల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపడుతున్నందున నాలుగు వరుసల ఆర్వోబిల నిర్మాణానికి ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు మంత్రి తెలిపారు. హైదరాబాద్ శివారు మియాపూర్-పటాన్‌చెరువు ప్రాంతంలో రైల్వే టెర్మినల్ నిర్మాణానికి ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్టు తుమ్మల ప్రకటించారు.

# అమ్మకానికి 'ఎన్‌డీఎస్‌ఎల్'..!

**పునరుద్ధరిస్తామన్నారు.. అమ్మకానికి పెడుతున్నరు**

- అప్పనంగా ఆస్తులమ్మేందుకు సర్కార్ యత్నం!
- పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఇప్పటికే రోడ్డున పడిన కార్మికులు







**నవతెలంగాణ- మెదక్ అర్బన్**

చెరుకు రైతుల బతుకులు చేదెక్కాయి.. కష్టపడి పని చేసిన కార్మికులకు కన్నీళ్లే మిగిలాయి.. ఎన్నికల బహిరంగ సభల్లో చెప్పిన సీఎం కేసీఆర్ హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీని ప్రభుత్వపరం చేసి పునరుద్ధరిస్తామని.. ఇప్పుడు వాటి ఆస్తులను అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమవుతోంది. వందల కోట్ల రూపాయల విలువ చేసే ఫ్యాక్టరీ ఆస్తులను పారిశ్రామికవేత్తలకు అప్పనంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇందుకు ఫ్యాక్టరీల నిర్వహణ పేరుతో దరఖాస్తులు కోరుతూ ప్రకటన ఇచ్చింది.

నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) ఫ్యాక్టరీలు రెండేండ్ల నుంచి లేఆఫ్‌లో ఉన్నాయి తాజాగా ఫ్యాక్టరీల నిర్వహణ చేపట్టడానికి పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచి ప్రకటన జారీ చేయడం అటు రైతుల్లో.. ఇటు కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం పది రోజుల సమయంలోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) పేర్కొంది. దరఖాస్తులిచ్చే పారిశ్రామికవేత్తలు రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టే సామర్థ్యంతో పాటు షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణలో అనుభవం ఉండాలని ప్రకటనలో కోరినట్టు సమాచారం. తెలంగాణలో వరి పంట తర్వాత రైతులు అత్యధికంగా చెరుకు పంటనే సాగు చేసేవారు. అప్పటి ప్రభుత్వాలు మెదక్, బోధన్, మెట్‌పల్లిలో షుగర్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశాయి. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాలతో ఫ్యాక్టరీలు నడిచాయి. రెండేండ్ల కిందట ప్రయివేటు యాజమాన్యం అకస్మాత్తుగా లేఆఫ్ ప్రకటించింది. దీంతో అటు రైతులు ఇటు కార్మికులు రోడ్డున పడ్డారు. ఫ్యాక్టరీలను అమ్మేందుకు ఎన్‌సీఎల్‌టీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీంతో సంస్థ ప్రతినిధులు పరిశ్రమలను పరిశీలించి అమ్మకానికి వచ్చినట్టు తెలుస్తోంది.

**ఉపాధి కోల్పోయిన కార్మికులు...**

బోధన్‌లో 1938లో వెలిసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఒక వెలుగు వెలిగింది. ఫ్యాక్టరీ లాభాలతో రాష్ట్రవ్యాప్తంగా యూనిట్లు సాధించే స్థాయికి ఎదిగింది. 1996 తర్వాత ఫ్యాక్టరీ నష్టాల వైపు వెళ్లడంతో ఫ్యాక్టరీలను అమ్మేశారు. 2002లో మెదక్, బోధన్, మెట్‌పల్లిలో ఉన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీలను 51 శాతం ప్రయివేటు, 49 ప్రభుత్వం వాటాతో దక్కన్ యాజమాన్యానికి అప్పగించి ప్రయివేటు పరం చేశారు. 2002లో ప్రయివేటు యాజమాన్యానికి నిర్వహణ అప్పగించే సమయంలో యేటా పది శాతం చొప్పున సర్కార్ వాటాను ఐదేండ్లపాటు కొనుగోలు చేయాలనే ఒప్పందం కుదుర్చుకున్నారు. 2004లో అప్పటి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీల అమ్మకాల అధ్యయనానికి శాసనసభా సంఘాన్ని వేశారు. సంఘం అధ్యయనం చేసిన అనంతరం నిజాం షుగర్ ఫ్యాక్టరీలో ప్రభుత్వ వాటా అమ్మకాన్ని తప్పు బట్టింది. ప్రయివేటీకరణ రద్దుకు సిఫారసు చేసింది. అప్పట్లో రాజకీయ కారణాలతో సభా సంఘం నివేదిక అమలు కాలేదు. దీంతో రైతులు కోర్టును ఆశ్రయించి అనుకూల తీర్పు పొందారు. 2014లో పాలకుల ఒత్తిడితో బలవంతంగా క్రషింగ్ సీజన్ నడిపిన దక్కన్ యాజమాన్యం 2015 డిసెంబర్‌లో లేఆఫ్ ప్రకటించింది. దీంతో రెండేండ్లుగా ఫ్యాక్టరీలకుతాళంవేశారు. 'ఫ్యాక్టరీలను పూర్తిగా మరమ్మతు చేయించి ఇస్తాం. రైతులు సహకార సంఘంగా ఏర్పడి నిర్వహించుకోవాలి' అనే ప్రభుత్వం ప్రతిపాదనను రైతులు తిరస్కరించారు. ఫ్యాక్టరీలు మూతపడటంతో కార్మికులు రోడ్డున పడ్డారు.

**లేఆఫ్ ఎత్తివేత కోసం ఉద్యమాలు...**

ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీల లేఆఫ్ ఎత్తేయాలన్న డిమాండ్‌తో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. నాయకులు కార్మిక శాఖను ఆశ్రయించారు. శాఖ చేతులెత్తేసి ప్రభుత్వంపైకి నెట్టేసింది. వివాదాన్ని పరిష్కరించాలని ప్రభుత్వం జాతీయ ట్రిబ్యునల్‌కు కేసు అప్పగించింది. ట్రిబ్యునల్ ప్రతినిధిగా రామకృష్ణ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ఫ్యాక్టరీ పరిస్థితులను, కార్మికుల వివరాలను సేకరించాలని ఆదేశించింది. వచ్చే నెలలో ప్రభుత్వం ఆయనకు విధించిన గడువు ముగుస్తుండటంతో పరిశ్రమ నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలుస్తోంది. ఫ్యాక్టరీలు నిర్వహించే వారు ముందుకు రాకపోతే ఆస్తులను వేలం వేసి అప్పులు చెల్లించే ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. దీంతో ఘన చరిత్ర కలిగిన నిజాంషుగర్ ఫ్యాక్టరీల భవిష్యత్‌పై రైతులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఫ్యాక్టరీలను నడిపించిన యాజమాన్యం రైతుల పేర్లపై బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్టు సమాచారం.

**టీఆర్ఎస్ సర్కార్ మోసం చేసింది...**

ఫ్యాక్టరీల లేఆఫ్‌తో రోడ్డున పడిన కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అధికారంలోకి వస్తే ప్రభుత్వపరం చేసుకుంటామన్న టీఆర్ఎస్ కార్మికులను మోసం చేసింది. ఉపాధిలేక కార్మికుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది.

పల్లె సిద్దిరాములుగౌడ్, ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీల కార్మిక నాయకుడు



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-00020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.